శ్రీ దుర్గాస్తుతి

వ్యాఖ్యాత :

శ్రీ శ్రియానందనాథుఁడు

ఈశ్వర సత్యనారాయణశర్మ

శ్రీకాకుళము

•

గ్రంథదాత : శిష్యుఁడు :

శ్రీ కె. టి. టి. వి. నారాయణరాజు

కొండ్రంగి : శృంగవరపుకోట తాలూకా.



ప్రకాశకులు :

సాధన గ్రంథ మండలి, తెనాలి.

 [వెల : రు. 1-50

సాధన గ్రంథ మండలి, 114

శ్రీ దుర్గాస్తుతి

వ్యాఖ్యాత :
శ్రీ ప్రియానందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ
శ్రీకాకుళము

ద్రవ్యదాత : శిష్యుఁడు :
శ్రీ కె. టి. డి. వి. నారాయణరాజు
కాంత్రంగి : శృంగవరపుకోట తాలూకా.



ప్రకాశకులు :
సాధన గ్రంథ మండలి, తెనాలి.

 [వెల : రు. 1-60

సర్వస్వామ్యములు
సాధన గ్రంథమండలివి.

సౌమ్య కార్తీక
ఉత్థానైకాదశి

శ్రీ వేంకటరమణ ప్రెస్, తెనాలి.
1969



వ్యాఖ్యాత :

శ్రీ శివానందనాథుడు

ఈశ్వర సత్యనారాయణశర్మ

(శ్రీ) పాదుకము

శ్రీమాత్రే నమః

ఓం నమశ్చండికాయై

ఓం హ్రీం దుం దుర్గాయై నమః

నివేదనము

భూతాని దుర్గా, భువనాని దుర్గా
స్త్రియో నరాశ్చాపి పశుశ్చ దుర్గా ।
యద్ యద్ధి దృశ్యం ఖలు సైవ దుర్గా
దుర్గాస్వరూపా దపరం న కించిత్ ।

నిత్యామనంతాం ప్రకృతిం పురాణీం
చిదీశ్వరీం సర్వజగన్నివాసామ్ ।
శివార్ధదేహాం సగుణాం గుణాశ్రయామ్
వర్ణార్థరూపాం ప్రణమామి దేవీమ్ ।

పాశగ్రంథనబీడితాన్ రిపుగణా న్ఛిన్నం త్వతీక్ష్ణం ముదా
చ్ఛిన్నస్కంధన కారిణీ నిజపద ప్రాప్తావవంతీ జనాన్ ।
భక్తత్రాణపరాయణా భయకరీ విద్వేషిణాం సర్వతో
భూయాన్మే భవభీతయే భగవతీ దుర్గారివర్గాపహా ।

పాఠకమహాశయులారా! గర్భితమహామహిమమైన యీ స్తుతి చిరమై నా నిత్యపార్వస్తువులలో, నొకటి. పరాంబా తత్త్వమును గ్రహింపఁగల నాయంతేవాసుల కిది యిచ్చి యథాశక్తి వివరించుచుండెడివాఁడను. యోగనారాయణ మూర్తి శ్రీకృష్ణుఁడు దీని నర్జునున కుపదేశించునప్పుడు "పరాజయాయ శత్రూణాం దుర్గాస్తోత్ర ముదీరయ" అనిన మాట వలన యథార్థముగాఁ దన యంశములైన జీవుల నుద్ధరించుట కే

యవతరించి సర్వోపనిషత్సారభూతమై యోగవిధులను శాసించుచు బ్రహ్మవిద్యాప్రకాశకమైన వాక్యసంచయమును గానము చేసి "పహ్రవళి"గా నవతరింపఁజేసెను. భగవానుపేర వెలయు శక్తిమత్కృష్ణుండొకటియైన సర్వజ్ఞత్వముగలవాని గానమే యిది యని కీర్తించుటకొఱకే యాదేవుని రచనమైన పదునెనిమిది యోగపాఠములుగల గ్రంథమును భగవద్గీతానామముతోఁ బెద్దలు గౌరవించిరి. దానిని మనము తలఁదాల్చి కనుల నద్దుకొని తంత్రిలక్షణవిశిష్టమైన భవపారమును జేర్చు సులభోపాయముగా స్వీకరించుచున్నాము.

అందలి ప్రథమాధ్యాయమందే యీస్తుతి యుండెను. కాని యిప్పుడు మనచేతులలో వెలుగుచున్న గీతాగ్రంథమందుఁ గానరాదు. దీని హేతువాదమును ప్రథమాధ్యాయావతారమును వివరించునపుడు వ్రాయఁబడి యున్నది. చదువరు లను శీలింతురుగాక.

ఈ స్తుతియందు మహామహిమను గర్భీకృతమై శాక్తబ్రహ్మవిద్యాసాధకులకుఁ గరతలామలకమై యున్నది. సాధకుల కనాయాసముగా సిద్ధి యెట్లుచేకూరునో హితమెట్లు కలుగునో యనునది 'శుచిర్భూత్వా' 'ఉదీచ్య' 'నమస్తే' 'విశుద్ధేనాంతరాత్మనా' అను మాటలయం దిమిడియున్నది. మఱియుఁ బరాశక్తి భక్తవిజయప్రదానశీల యనుట 'దుర్గా' 'సిద్ధసేనాని' 'జయే' 'విజయే' 'మానవవత్సలా' మున్నగు స్తుతిగలపదముల వలనఁ దెలియును. అట్లే 'మందరవాసిని' 'భక్తానామాలయేషు వససి' 'పాతాళే వససి' 'చంద్రాదిత్యవివర్ధిని' మున్నగు మాటలయందు జపస్తుతి సాధన రహస్యము లిమిడియున్నవి. మొత్తముపైని సర్వమాత సర్వశక్తిసమన్వితయనియు, శక్తి

శక్తి మంత్రసారంబె భిన్నభావనయు భాగవతాభ్యాసాసక్తి ఫల సంపన్నుఁడగుటకే మానవుఁడు చేయు ప్రారబ్ధము గెల్పు గొలుపునది శక్త్యుపాసనమే యని సర్వశక్తిసంపన్నుఁడు శ్రీకృష్ణుఁడు భగవన్ముఖుఁడై యుపదేశించుచున్నాఁడు; ఆదేశించు చున్నాఁడు.

వనివసించినప్పుడు నా యల్పబుద్ధికి గోచరించిన స్తుతిగతవిశేషము లను అమ్మ నా మనోధర్మవర్తనమార్గములను బోధించి క్రొన్నవనీయమైన వివర్ణవస్తుమందముక్కున యుపకారికృత్యులకు ఉపదిష్ట నిల్చి విదయసాధనముగా స్వీకరింపఁ జేసినప్పుడు ధార్మికులైనవారు సైతము వింతలైన సుఫలములను వినయాదేవి వారిచేత నెట్లు పెట్టినదో విశేషములతో వ్రాయనొల్లను. అచల భగవంక మల్కా మంజరి స్వతంత్రశక్తియే యనుకొనిన చేస్తున్నా.

దుర్గాసర్వశక్తిసమన్వితత్వమును బోధించు దుర్గా సప్తశతియందు నా వివరించిన స్తుతిరూపమంత్రములు రెండు నా సాధనసామగ్రినుండి యెత్తి యీ స్తుత్యంతమునఁ జేర్చుట పాఠకవినోదమునకుఁ గాకపోవని యుల్లము చేసితిని. ఎనుబది [illegible] మొదిమి. కనుబాపు బొత్తిగాఁ గొలవనిన గన్నులాల్గు. చదువువ్రాతలు మొదటికే తెగిపోయిన సర్వదుఃఖసమూహము. వ్రాతసాయమునకై ప్రతిమాలినను జేరవచ్చువారు వ్రాతపెట్టిన పదులే, ఇన్ని సబబులచే నిన్ని తప్పులో ఈ చిన్ని పొత్తమందు దొరలిపోయినవి. సైరింపుఁడని మీకుఁ జేమోడ్పు లర్పించుచు దుర్గాపాదభక్తులకు నిరంతరవిజయములనే [illegible] మునకుఁ గూర్పుమని శ్రీమాతను వేడుకొనుచుండు శాక్తబంధుఁడు.

శ్రీశర్మద వైద్యశాల }
శ్రీకాకుళము }
3—11—[illegible]9 }

శ్రీ శ్రీ[illegible]నందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ

శ్రీమాత్రే నమః

మాతృభక్తి ప్రశంస

శ్రీయుతులు కళ్లేపల్లి తిరుమల తిరుపతి వెంకటనారాయణరాజుగారు (తాండ్రంగి, శృంగవరపుకోట తాలూకా, విశాఖపట్టణముజిల్లా) నా ప్రియశిష్యులు. బడిలో విద్యార్థిగా నుండినప్పుడే నా శుశ్రూష ప్రారంభించిరి "ప్రణంతుం స్తోతుం వా కథ మకృతపుణ్యాః ప్రభవతి" అని శ్రీ శంకరగురువులు. కడచిన పుట్టువులయందుఁ బున్నెంపుమూట తెన్నుబత్తెముగాఁ దెచ్చుకొన్నవారలకే యబ్బుఁగల శ్రీ మాతృసేవాభాగ్యము వీరికిఁ జిననాఁడే యబ్బినది.

'మాతృదేవో భవ' 'పితృదేవో భవ' అనెడి శిక్షావల్లీ సూక్తులను యథార్థముగా నాచరణమందుఁ బెట్టుకున్నవారు వీరే. తలిదండ్రులను ప్రత్యక్షదైవములుగాఁ జూచి పరిచరించిన మానవులలో సహజముగా నెలకొనియున్న కృతజ్ఞతయే జగజ్జనకులైన వారియెడ నిర్భరభక్తిగాఁ బరిణమించును. మనము కృతజ్ఞతను జూపఁదగు నా ద్వంద్వమందుఁ ప్రథమవంద్య శ్రీమాత. వీరి భక్తినిర్భరత చిన్ననాఁటఁగోలె శ్రీ దేవీస్తుతిరచన రూపమున వికసింపఁదొడఁగినది. దేవీమహిమస్తుతితోఁ దమ సహజభక్తిని వెల్లడించు పద్యములు పాటలు కూర్చి సంఘ సంకీర్తనములందు వినియోగింప నారంభించిరి. ఇప్పుడు మన రాజుగారియందది యొక వ్యసనముగా మారినది. శివశక్తి దైవ

నిర్ణీతమైన యుపాధ్యాయవృత్తిని సాగించుచు నాధ్యాత్మిక జ్ఞానసంపాదకములైన కావ్యశాస్త్రాది వినోదములనే వీలగు నంతకాలము వెచ్చించుచుందురు. "కావ్యశాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతాం। వ్యసనేనచ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా" అను ధీమల్లక్షణము వీరి కా బాల్యసిద్ధమైయున్నది.

పెండ్లి యెడఁ బెడమొగము పెట్టిరి. శ్రీ మాతృభక్తి ధుర్యులతోడి చెలిమికంటెను జెలుల చెలిమికి విలువ నీయలేదు.

జననము క్షత్రియవంశమందేయైనను క్షాత్రధర్మమును సాధనసంగరరంగమందె నెఱపుచుందురు. రాజకుల సంభూతులైనను మహిమనామకరజోగుణమును మట్టుపెట్టిన శ్రీదేవి నుపాసించినఫలముగా రాజసమెందును గానరాక గడుపుచున్నారు. మాతృభక్తి శ్రీ మాతృభక్తిగాఁ బరిణమించినది.

ఇంతకును రాజులు యశోధనార్జనమందుఁ జిక్కని యెత్తుకాండ్రు. గ్రంథరచయితలకుఁ గంటెఁ దత్ప్రకాశకులకుఁ గలుగు పుణ్యఫలమధికమని యెఱుంగుటే వారి యెత్తు. కావుననే తొల్లింటి దొరలు తమ యేలుఁబడి యందెన్ని విధములఁ బ్రజారంజనము చేయుచున్నను సత్కవుల నాదరించి పోషించుచుఁ గృతిపతిత్వభాగ్యము నొంది శోధనచతురులను నియోగించి గ్రంథప్రతులను సిద్ధముచేయించి నాటి భూపతులకును ప్రసిద్ధపండితులు మున్నగు సభికావళులకును జేర్చుచుండెడి వారలు.

ఒకనాఁడు గురుసందర్శనమునకై మనరాజుగారు వచ్చి సన్నిధిని కూర్చున్నప్పుడు, నాఁటి కసమగ్రముగానే యుండిన యజ్ఞవల్క్యస్మృతివ్యాఖ్య వారి కంటఁబడినది. ఆ చిత్తు ప్రతిని దీని మొదటముగాఁ కూర్చుండి చదివి దీనిఁ బ్రకాశింపఁజేయు భారము నాదిసుఁడీ యనుచు వందనమాచరించిరి. "వలదయ్యా, త్వరపడవలదు వ్రాయుడినము" అనుచు నివారింపఁ జూచితినిగాని, "గురువరా! కలిసంతరణమంత్ర సాధన రచన ప్రచురణభారము నాపైఁ బెట్టుఁడ"ని వేడుకొనునప్పుడు "కృతిపతులైన యవధూతేంద్రసరస్వతీ మహాస్వాములవారి ప్రియతమశిష్యులెందఱో యున్నారు. శ్రీవారికిని సాధన గ్రంథ మండలి ప్రతిష్ఠాపకులగు శ్రీ శాస్త్రిగారికిని తెలుపక వాగ్దానము చేయఁజాల నంటిని. చిన్న నగవుతోనే విన్నఁబోయిరి. కాని "నేనే యథార్థ శ్రీ దేవీభక్తుఁడ నగుదునేని ఈ భాగ్యము నాకే దక్కు"నని నాఁటికి సెలవుగొనిపోయి సాధన గ్రంథ మండలి వ్యవస్థాపకులకు దీని యచ్చువెచ్చముల కని తెలుపుచు 300 రూప్యముల పంపి యీ శుభవార్త నాకందించిరి. ఇది శ్రీ మాత్రాజ్ఞ గనుక రాజుగారిని ప్రోత్సహింపక తప్పదని యంగీకరించితిని. ఆశీర్వాదము లంపితిని. గ్రంథమునందుఁ దమ ఛాయాచిత్రమును ప్రకాశింపఁజేయుట కిష్టపడనందుఁ బత్యాహాశీర్వాదము వలదనిరి. ఈ ద్రవ్యయజ్ఞము శ్రీ మాతృప్రీతిగా నను గన్నతల్లి యగు సాధ్వీమణి అన్నపూర్ణానిర్విశేష వంద్యచరిత, స్వర్గీయ శ్రీమతి అప్పల నరసయ్యమ్మగారి స్మారకగా నాజనకుల నిరంతర శుభాశీరపేక్షతోఁ జేయుచున్నాను, నా జనకులు సాధుసత్తములు.

మహారాజశ్రీ కళ్లేపల్లి చిననారాయణరాజుగారు, జనని అప్పల నరసయ్యమ్మ ఇంత మాత్రము ప్రచురించుట చాలును.

ఈ ద్రవ్యయజ్ఞ యజమానులు మన రాజుగారు ఎంతటి నిరాడంబర జీవులో, మానవుని యున్నతస్థానమునుండి నీచ స్థానమునకు దించివేయు లౌకిక ప్రతిష్ఠావిముఖులో, యెంతటి యధ్యాత్మ వైరాగ్యసిద్ధులో యూహించుకొని పాఠక సాధకశాస్త్రబంధువులు శ్రీ రాజుగారికై నిరంతర శుభచింతనము చేయుచు మంగళాశీస్సునభిషిక్తులను జేయుదురు గాక.

ఇతి శివమ్.

రచయిత
శ్రీ శ్రీయానందనాథుడు
ఈశ్వర సత్యనారాయణశర్మ

మండలి మాట

యత్రాస్తి భోగో న చ తత్ర మోక్షో
యత్రాస్తి మోక్షో న చ తత్ర భోగః ।
శ్రీ సుందరీ సేవనతత్పరాణాం
భోగశ్చ మోక్షశ్చ కరస్థ ఏవ ॥

"భోగములను విడచినవానికే మోక్షము. అటుగాక భోగముల వెంటబడుచున్నవానికి మోక్షము సిద్ధింపదు. కాని సకలమఙ్గళశివంకరి దుర్గను ఆరాధించువారు భోగముల ననుభవించుచునే మోక్షమును బడయగలరు"- అన్నది ఆర్యోక్తి.

పరబ్రహ్మాభిన్నమైన దుర్గా చిచ్ఛక్తి నారాధించి మేలొందుడు- అన్నది సర్వోపనిషత్పురాణముల సారమై యున్నది.

కాని అర్థజ్ఞానరహితమైన యుపాసనము చిరకాలము నకుఁగాని ఫలింపదు. ఫలించినను దాని ఫలము అల్పముగనే యుండును. కాని ఆ దుర్గా యుపాసనముల నుపయోగించు స్తోత్రముల గంభీరార్థములను లలితసుందరభంగిమలో తెలుపఁగల నేర్పరులు నేడరుదుగ గానవచ్చుచున్నారు. బహుగ్రంథములను రచించి తెలుగుభాషకే జనపరిచితులైన శ్రీశ్రీమానందనాథులు బ్ర శ్రీ ఈశ్వరసత్యనారాయణశర్మగారు ఈ దుర్గాస్తుతికి వివరణము వ్రాయుట, అది మా మండలి యందు దచ్చగుట మా భాగ్యముగా భావించుచున్నాము. ఇఁక నిట్టి యుత్తమ వ్యాఖ్యానముతోఁ స్తుతిని జదివి యుపాసించి యంబికానుగ్రహముచే నిహపరములను ఫలింపఁ జేసికొనుట పాఠకుల పని.

ఈ గ్రంథ ముద్రణమునకు శ్రీ కళ్లేపల్లి తిరుమల తిరుపతి వెంకటనారాయణరాజుగారు తమ మాతృశ్రీ స్వర్గీయ శ్రీమతి అప్పలనరసయ్యమ్మగారి స్మారకముగా సముచిత ధనసహాయము చేసిరి. శ్రీ రాజుగారికి వారి కుటుంబమునకు శ్రీమాత నిరంతర మంగళముల ననుగ్రహించుగాక !

అచిరకాలములో బ్ర. శ్రీ. సత్యనారాయణ శర్మగారి "శక్తిపాతము" అను అపూర్వగ్రంథరాజము పాఠకుల కర కమలముల నలంకరించగలదని తెలుపుట కెంతయు సంతసించు చున్నాము.

సౌమ్య కార్తీక
ఉత్థానైకాదశి
18-11-1969

ఇట్లు
బులుసు సూర్యప్రకాశశాస్త్రి
వ్యవస్థాపకుడు : సాధన గ్రంథ మండలి.

శ్రీమాత్రే నమః

శ్రీ దుర్గాస్తోత్ర వ్యాఖ్యా కృతి సమర్పణము

తే॥ గీ॥ శ్రీపదాహూతయై జ్ఞానసిద్ధి నిడుచు
హ్రీంపదాహూతయై శక్తులెల్ల నిడుచు
నెవని భర్గమ్ము సంజ్ఞయై యిడును ముక్తి
యతనికే యిత్తుఁ గృతిని నారాయణునకు. ౧

తే॥ గీ॥ కృతిపతిని నామగోను నీశ శ్రుతిపథమునఁ
బడియె "నారాయణా" యను పదమువరిదో;
అదియె తలఁచాల్చె దుర్గాంబ యాన గాఁగ
అర్పిత మొనర్తుఁ గృతిని నారాయణునకు ౨

తే॥ గీ॥ అమితకృపను నిశుధ్వాంతరాత్మ యరుల
సంఘము తరింప మంత్రదీక్షాప్రదాత
యై నిలిచి గవ్యమున్ జేర్చు నంశదాఁత
నచ్యుతుండగు యోగ నారాయణునకు. ౩

తే॥ గీ॥ అఖిలలోకగురుండు తా నని తెలుపఁగా
విశ్వవిద్యాలయము కట్టి వివిధయోగ
పారగాన మొనర్చిన పరమగురున
కాశ్రితసురాగమైన నారాయణునకు. ౪

తే॥ గీ॥ నిహత మమతాస్మితుండయి నీవె శరణ
మనుచు ధీరతతో నిల్చు నాశ్రితవరు
నందగోపకులోద్భవునిం దయార్ద్రుఁ
డై యొనర్చెడి యోగనారాయణునకు. ౫

తే॥ గీ॥ ధర్మపథవాద్యులకున్ ధర్మి తాన యగుచు
వివిధములు స్వవిభూతుల వేష మూని
తోడనే యుండి ధర్మసంరక్షణి యగు
మాయ నతఁడని యోగనారాయణునకె. ౬

తే॥ గీ॥ నాదమే నాస్వరూపము నాదమె నను
నాదమును జేర్చు దారి యాధార మేను
స్థానముగ నుంట నాపేరు స్థాణువని
యనకె యనునట్టి యోగనారాయణునకె. ౭

తే॥ గీ॥ ఒక మహాత్ము డవధ్యదశవిభేద
మునఁ ద్రిభాశక్తులను మోసపోక మయ్య
ధీర యని తెలిపెన్ యోగదేవిఁ జూపి
యజితు నరుఁ జేసినట్టి నారాయణునకె. ౮

తే॥ గీ॥ తాన గురుశిష్యరూపమున్ దాల్చి నిల్చెఁ
దాన రథిసారథుల వేషమూనుఁ జిత్ర
విభూతిఁ జూపు చదింత్యమౌ స్వేచ్ఛ నడరు
నతని కీశ్వరసత్యనారాయణునకె. ౯

తే॥ గీ॥ త్రిపుటి నరునకుఁ దొలఁచి నిష్కపటుఁ జేసి
దుర్గఁ గొలిపించి దుష్టారివర్గము వయి
గెలుపు టీవి నిడంజేసి కీర్తిఁ గొనిన
యతనికే యిత్తుఁ గృతిని నారాయణునకె. ౧౦

శ్రీమన్నారాయణార్పణమస్తు

దుర్గాస్తోత్ర జపము

సాధకుఁడు శుచియై (విశుద్ధబుద్ధియు, ఆత్మాభిముఖము లగుటచేఁ బవిత్రమైన యింద్రియములు, ఆచార్యునివలన దీక్షా పూర్వకముగా సంగ్రహింపఁబడిన సర్వాభీష్టప్రదము నైన విద్యయు, మంత్రస్మృత్యాదిరూపము గలవాఁడునై) యాచమించి శ్రీ గురువందన స్వగురువందన పూర్వకముగా దేశకాల సంకీర్తనము చేసి గోత్రనామములు చెప్పికొని "మమ సర్వాభీష్ట సిద్ధ్యర్థే దుర్గాస్తోత్రమహామంత్రజపే వినియోగః."

అస్య శ్రీదుర్గాస్తోత్రమహామంత్రస్య బదరీనారాయణః 'ఋషిః' (శిరసి) అనుష్టుప్ఛందః (ముఖే) శ్రీదుర్గాఖ్యా యోగ రూపీ దేవతా (హృది). ఓం నమశ్చండికాయై ఓం నమశ్చండికాయై ఓం నమశ్చండికాయై.

ఓం హ్రీం దుం దుర్గాయై నమః

నమస్తే సిద్ధసేనాని ఆర్యే మందరవాసిని ।
కుమారి కాలి కాపాలి కపిలే కృష్ణపింగళే ॥ ౧
భద్రకాలి నమస్తుభ్యం మహాకాలి నమోఽస్తు తే ।
చండి చండే నమస్తుభ్యం తారిణి వరవర్ణిని ॥ ౨
కాత్యాయని మహాభాగే కరాలి విజయే జయే ।
శిఖిపింఛధ్వజధరే నానాభరణభూషితే ॥ ౩
అట్టశూలప్రహరణే ఖడ్గఖేటకధారిణి ।
గోపేంద్రస్యానుజే జ్యేష్ఠే నందగోపకులోద్భవే ॥ ౪

మహిషాసృక్ప్రియే నిత్యం కౌశికి పీతవాసిని ।
అట్టహాసే కోకముఖే నమస్తేఽస్తు రణప్రియే ॥ ౫

ఉమే శాకంభరి శ్వేతే కృష్ణే కైటభనాశిని ।
హిరణ్యాక్షి విరూపాక్షి సుధూమ్రాక్షి నమోఽస్తు తే ॥ ౬

వేదశ్రుతి మహాపుణ్యే బ్రహ్మణ్యే జాతవేదసి ।
జంబూకటకచైత్యేషు నిత్యం సన్నిహితాలయే ॥ ౭

త్వం బ్రహ్మవిద్యా విద్యానాం మహానిద్రా చ దేహినాం ।
స్కందమాతర్భగవతి దుర్గే కాంతారవాసిని ॥ ౮

స్వాహాకారః స్వధా చైవ కలా కాష్ఠా సరస్వతీ ।
సావిత్రీ వేదమాతా చ తథా వేదాంత ఉచ్యతే ॥ ౯

కాంతారభయదుర్గేషు భక్తానాశ్చాలయేషు చ ।
నిత్యం వససి పాతాలే యుద్ధే జయసి దానవాన్ ॥ ౧౦

త్వం జంభనీ మోహినీ చ మాయా హ్రీః శ్రీస్తథైవ చ ।
సంధ్యా ప్రభావతీ చైవ సావిత్రీ జననీ తథా ॥ ౧౧

తుష్టిః పుష్టిర్ధృతిర్దీప్తి శ్చంద్రాదిత్యవివర్ధనీ ।
భూతిర్భూతిమతాం సంఖ్యే వీక్ష్యసే సిద్ధచారణైః ॥ ౧౨

స్తుతాఽసి త్వం మహాదేవి విశుద్ధేనాంతరాత్మనా ।
జయో భవతు మే నిత్యం త్వత్ప్రసాదాద్రణాజిరే ॥ ౧౩

అనేన మయా కృతేన దుర్గాస్తోత్ర మహామంత్రజపేన శ్రీ దుర్గాపరాశక్త్యాఖ్య దేవీ మయి సుప్రీతా సుప్రసన్నా వరదా భవతు ।

సంజయ ఉవాచ :

తతః పార్థస్య విజ్ఞాయ భక్తిం మానవవత్సలా ।
అన్తరిక్షగతోవాచ గోవిందస్యాగ్రతః స్థితా ॥ ౧౪

స్వల్పేనైవ తు కాలేన శత్రూఞ్జేష్యసి పాండవ ।
నర స్త్వమసి దుర్ధర్ష నారాయణసహాయవాన్ ॥ ౧౫

అజేయ స్త్వం రణేఽరీణామపి వజ్రభృతః స్వయమ్ ।
ఇత్యేవ ముక్త్వా వరదా క్షణేనాంతరధీయత ॥ ౧౬

మోహితాశ్చైతే న జానన్తి నరనారాయణావృషీ ।
తవ పుత్రా దురాత్మానః సర్వే మన్యువశానుగాః ॥ ౧౭

యత్ర ధర్మో ద్యుతిః కాంతి ర్యత్ర హ్రీః శ్రీ స్తథా మతిః ।
యతో ధర్మ స్తతః కృష్ణో యతః కృష్ణ స్తతో జయః ॥ ౧౮

తతః శ్వేతై ర్హయై ర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ ౧౯

య ఇదం పఠతే స్తోత్రం కల్య ఉత్థాయ మానవః ।
యక్షరక్షః పిశాచేభ్యో న భయం విద్యతే సదా ॥ ౨౦

న చాపి రిపవ స్తేభ్య స్సర్పాద్యా యే చ దంష్ట్రిణః ।
న భయం విద్యతే తస్య సదా రాజకులాదపి ॥ ౨౧

వివాదే జయమాప్నోతి బద్ధో ముచ్యేత బన్ధనాత్ ।
దుర్గం తరతి చావశ్యం తథా చోరై ర్విముచ్యతే ॥ ౨౨

సఙ్గ్రామే విజయే న్నిత్యం లక్ష్మీం ప్రాప్నోతి కేవలామ్ ।
ఆరోగ్య బల సంపన్నో జీవే ద్వర్ష శతం తథా ।
ఏతద్దృష్టం ప్రసాదాత్తు మయా వ్యాసస్య ధీమతః ॥ ౨౩



శ్రీమాత్రే నమః

శ్రీ మహాగణాధిపతయే నమః

ఓం హ్రీం దుం దుర్గాయై నమః

శ్రీ దుర్గాస్తుతి

ఓం సర్వస్వరూపే సర్వేశి సర్వశక్తి సమన్వితే।
భయేభ్య స్త్రాహినో దేవి దుర్గే దేవి నమోఽస్తుతే॥ ఓం

(దీని వ్యాఖ్యకై గ్రంథాంతమున జూచునది.)

శ్రీ కృష్ణోపదిష్టమై యర్జునకృతమైన దుర్గాస్తోత్రమున కిది వ్యాఖ్య.

శ్రీ వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజునకుఁ జెప్పినట్లున్న భారతయుద్ధారంభ స్వరూపమును సరహస్యముగా శ్రీ వ్యాసమహర్షిచే మహాభారతమందు వర్ణింపఁబడెను. మఱల భారతయుద్ధారంభ సమయమందు మొట్టమొదట భగవంతుఁడైన శ్రీ కృష్ణునిచేత స్వాత్మమందలి పట్టుదల యనెడి దోషముతోఁ గూడిన పార్థుని కొఱకు నుపదేశింపఁబడినట్టియు; తరువాత స్వగురుప్రసాదలబ్ధదివ్యదృష్టియు; యోగివరుఁడు, సర్వేంద్రియజితుఁడు నైన సంజయునిచేత యోగబలముచేఁ బ్రత్య

ష్టము చేసికొనఁబడి స్వార్థాగ్రహ దోషజుష్టుఁడైన ధృతరాష్ట్ర మహారాజునకు వ్యాఖ్యానింపఁబడి నట్టియు, క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగవియోగముల వల్లనైన సంసారస్వభావ స్వరూపములను దెలుపునట్టియు, యోగబ్రహ్మవిద్యాస్వరూపమైనట్టియు, భగవద్గీత నుపదేశింపఁ గోరినవాఁడై మహాభారతమధ్యమునందు ఉన్నదున్నట్లుగా సమర్పించెను. అందలి ప్రథమాధ్యాయ ప్రథమ శ్లోకము.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ॥

అనువది—

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమందు నొండొరులతో యుద్ధము చేయఁగోరినవారై చేరుకొన్న నావారైన దుర్యోధనాదులును పాండవులును నచట నేమి చేసిరి; సంజయుఁడా! యని ప్రశ్నించెను. ప్రశ్నించిన వాఁడు రాజు ధృతరాష్ట్రుఁడు. ఇతని యీ ప్రశ్నరూప శ్లోకమందలి ప్రత్యేకశబ్దము గంభీరమైనంత భావమును ధరించుచున్నది

ధృతరాష్ట్రుఁడు— ధరింపఁబడిన రాష్ట్రము కలవాఁడు, రాష్ట్రము— దేహము. శాస్త్రములందు దేహము పట్టణము గాను, బహుసంఖ్యాక పత్తనములతోఁగూడిన రాష్ట్రము గాను, రూపింపఁబడుట మనము పలుతావులఁ గందుము, భావనోపనిషత్తునందు నవద్వారపురిగాను, శ్రీసూక్తమందు

రాష్ట్రముగాను, మఱికొన్నిచోటుల గృహముగాను వర్ణింపఁబడినది. ఈ రాజవిషయమునఁ దాను బరిపాలించు రాష్ట్రమును (శరీరమును) బట్టుకొని ప్రేలాడుచు దేహాత్మబుద్ధి, లేశము వీడలేని వాఁడని యూహించుచున్నది. దీనిని బట్టి స్వార్థాగ్రహదోషజుష్టుఁ డీరాజని తెలుచున్నది.

ధర్మక్షేత్రము—ధర్మములు—ప్రవృత్తిధర్మము, నివృత్తి ధర్మము, శుద్ధధర్మము నని మూఁడు విధములు. వాని సంబంధమైన జ్ఞానములకు క్షేత్రమైనది ధర్మక్షేత్రము. అనఁగా క్షేత్రము (పొలము) బీజములను వృద్ధిచేయునది. ఇచటఁ బ్రవృత్త్యాది ధర్మత్రయ బీజములను వృద్ధిచేయునది కావున ధర్మక్షేత్ర మనఁబడినది.

ఇఁక ప్రవృత్తిధర్మము— సంసారవ్యవహారమునం దాసక్తి గల క్షేత్రజ్ఞుని నాశ్రినది. అది కేవలము బంధలక్షణ పారతంత్ర్య స్వరూపలక్షణము గలది.

నివృత్తిధర్మము:— క్షేత్రజ్ఞుఁడనఁబడు నాత్మకు బంధము లేకుండుట యను నెడి లక్షణముగల పారతంత్ర్య స్వరూపము.

శుద్ధధర్మము:— క్షేత్రజ్ఞుఁడనఁబడు నాత్మకుఁ బరప్రాప్తి కారణమైన యాత్మస్వరూప బ్రహ్మవిజ్ఞానమువల్లఁ గలిగిన స్వాతంత్ర్యలక్షణమని యీ మూఁడు ధర్మముల స్వరూపము తెలియఁబడుచున్నది. ఈ మూఁడు ధర్మములయందును శుద్ధ ధర్మమే తక్కిన ధర్మములకంటెను నధిక శ్రేష్ఠమై యాధర్మము

లను ధరించునదియై శాశ్వతమైనదని సిద్ధాంతము. అనుష్ఠింపఁబడు నీ సర్వధర్మముల సంబంధమైన జ్ఞానము దాని ఫలోదయమును గాలమును బట్టియు నధికారమును బట్టియుఁ గలుగు నని తెలియును. కనుక ధర్మక్షేత్రము సదధికారులకును అసదధికారులకును వారువారు నాటిన బీజముల స్వరూపమున కనురూపమైన పంటనే పండించును.

మఱియు దుష్టనిగ్రహము, శిష్టపరిపాలనము ననెడి భగవద్ధర్మమునకును, ఆ భగవంతుని యవతారము యొక్క స్వరూపమున కనురూపమైన ధర్మమునకును నవతార పురుషుఁడై వచ్చిన వాని శుద్ధసంకల్పముచేఁ బరికల్పితమైన యవతారమున కనురూపమైన ధర్మమునకును నిది క్షేత్రము కనుకను వానిని బెంపొందించు నదియగుటచే నిది ధర్మక్షేత్రమని తెలియును.

ఈ ధర్మక్షేత్రమునందుఁ దనకు నియతమైన సంసార వ్యవహారము విధిక్రమముల నతిక్రమింపక జరుపఁజాలుచుండెను శిష్టాధికారులైన పాండవుల భగవదనుగ్రహరూపధర్మమును దాని కనురూపమైన ధర్మప్రవృత్తియును వర్ధిల్లును. గావున నది ధర్మక్షేత్రము.

అటులనె తమసంసార వ్యవహారమునకు దోహదములైన ధర్మములను బ్రవర్తింపఁజేయు నశిష్టాధికారులు నైన దుర్యోధనాదులు భగవదనుగ్రహము లేమిచే దానికిఁదగిన ధర్మప్రవృత్తి స్వభావము చేతనే కలుగు నని తెలియును.

మఱియూ ధర్మముచేత ననఁగా శ్రీకృష్ణునిచేత నధిష్ఠింపఁబడిన క్షేత్రము. అనఁగా దివ్యస్థానమను నిర్వ్యుత్పత్త్యర్థముచేత ధర్మపదవాచ్యుఁడును, యోగబ్రహ్మవిద్యాధికారియు; లోక ధర్మములను శాసించు వాఁడును, సర్వమనుజ లోకేశ్వరుఁడు నైన యా శ్రీకృష్ణునిచేత నధిష్ఠింపఁబడుటచే ధర్మక్షేత్ర మనియుఁ దెలియును.

శ్రీకృష్ణుఁడు ధర్మపదవాచ్యుఁడని మహాభారతమం దీవిధముగాఁ (వనపర్వమందు) ప్రతిపాదింపఁబడినది.

"యే చ వేదవిదో విప్రా యేచాధ్యాత్మవిదో జనాః"
"తే వదన్తి మహాత్మానం కృష్ణం ధర్మం సనాతనమ్"

మఱియు—

"అమృతస్యైష సేతుః" (ముండకోపనిషత్తు)

మఱియు—

"ధర్మస్య సేతుం బధ్నామి చలితే చలితే యుగే"

అనెడి మహాభారతవచనముచేతను (అశ్వమేధపర్వము) భగవంతుఁడైన శ్రీకృష్ణునకు సర్వధర్మములకు మూలమైన సనాతనధర్మమును సంరక్షించుటని సిద్ధమని తెలియును. కనుక నిప్పుడు (ఉత్తమాధికారులు - మందాధికారులు) సదధికారులు, అనధికారులు నైన వారు చేయు సర్వకర్మములకు నీ శ్రేయస్కరమైన సాద్గుణ్యము కలుగునని తెలియుచున్నది. కనుకనే భగవంతునిచేత—

"సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశం"

అర్జునా! సుఖవంతులైన క్షత్రియులకే యిట్టి యుద్ధము లభించు నని తా నుపదేశించిన గీతవాక్య మంతయును యుద్ధగౌరవము చక్కఁగా వర్ణింపఁబడినది. మఱియు ధర్మక్షేత్ర మనునప్పుడు ధర్మపరులైన శిష్టులచేత నధిష్ఠింపఁబడిన క్షేత్ర మనియు నర్థమగును. శిష్టులనుటచేత నశిష్టులైన వారీక్షేత్రమునందుఁ జేసిన యెట్టి కర్మములవల్లనైనను సంపూర్ణఫలోదయము కాఁజాలదని తెలియవలసిన దీ! శిష్టులనఁగా భగవత్తంత్రము నెఱిఁగిన యధికారులనియు; అశిష్టులనఁగా భగవత్తంత్రము నెఱుఁగని యనధికారులనియు నెఱుంగునది. ఇట్టి కురుక్షేత్ర మునకీ చోట మహాభారతశల్యపర్వమందు మున్ను రాజర్షి శ్రేష్ఠుఁడైన "కురు" భూపతి పెక్కండ్రు యాగము లొనర్చెను. అప్పుడు వరప్రదాన సమర్థులైన దేవతలచటికి విచ్చేసిరి. కావున నాస్థలము కురుక్షేత్రమను పేరఁ బరగినది. అచట దేవశ్రేష్ఠులు, బ్రాహ్మణముఖ్యులు; నరపతివరులును నుత్తమ యాగములను జేసి క్రమముగా దేహములను విడిచి స్వర్గతులనే పొందిరి. కనుక మంగళప్రదమును, పుణ్యతమము నైన యీ క్షేత్రము స్వర్గగుణములతోఁ గూడినదై దేవతలకును మిగుల సమ్మతమైనది. కావున నీకురుక్షేత్రమందు యుద్ధము చేసి మరణించిన రాజులెల్లరు నక్షయపుణ్యగతుల నొందుదురు.

మఱియు నీకురుక్షేత్రమున విధ్యుక్త దానములు చేసిన వారికి సహస్రగుణిత ఫలము లబ్బును.

ఇంతేకాక కురుక్షేత్రమందు గాలిచే నెగయఁ గొట్టఁ బడిన ధూళులు సైతము దురాచారులపైఁ బడినను వారికిఁ బరమగతులే కలుగుననుట సుప్రథితముగ స్తుతింపఁబడినది.

కావృవ వేదమందును సర్వదేవయజనాధికరణత్వము కురుక్షేత్రమునకే కలదని వర్ణింపఁబడినది.

అట్టి కురుక్షేత్రమందు "యుయుత్సవః" యుద్ధము చేయఁగోరినవారై "మామకాః" నావారు నాయాత్మీయులు చేరిరి. ఇచట "మామకులు" అను మాటయందు నెంతేని విశేషాభిప్రాయము తోఁచును. రాజు "మత్పుత్రాః" అనుట మాని యనఁగా మముఁ బున్నామనరకమువలన రక్షింపఁగల వారను నర్థమిచ్చుమాటలు మాని, మామకులనెను. అభీష్టులనఁగా భగవన్మంత్రము నెఱుంగని కర్ణశకున్యాదులతోను; మఱియు భగవన్మంత్రము సేవించిన వారైనను, గేవలమున శిష్యధర్మము నవలంబించిన వారగుటచేతఁ బరతంత్రులై పోయిన మహానుభావులు భీష్మాదులతోను గూడుకొన్న వారై యుండుటచేత మామకులు–నావారు (మమ ఇమే మామకాః) అనఁగాఁ బితరులను బున్నామనరకము వలన రక్షింపఁగల వారు కారని ధృతరాష్ట్రుని యభిప్రాయము. దీనివలన సధర్మ యుద్ధమునకే దిగి మరణింపఁ గోరుచున్నవారు. కనుకనే కేవల జన్యజనక భావసంబంధమాత్రమే దుర్యోధనాదులకును నాకును గలదని తెలుపుటకే మామకశబ్దప్రయోగము చేసెను, గాని; "మత్పుత్రాః" అనుటకుసైతము రాజు మనసొప్పలేదు. ఇట్టి

వారెవ్వరనంత్రానభిజ్ఞులు; ఉద్యోగ్గాములు నావారు కురు క్షేత్రగతులై శ్రేయః ప్రాప్తికారణమైన యేమి కర్మము చేసిరి ? అని ప్రశ్నించెను.

మఱియు సద్ధర్మప్రవృత్తికులు పాండవులయొక నావన్న శత్రువులు నైన నాకొడుకులు పరమమహాత్మ్యవిశిష్టమైన కురుక్షేత్రమున నిల్చియు ధర్మబుద్ధులు కాఁగలరా ? అయినా? అప్పుడు పాండవులకు సగము రాజ్య మిచ్చివేయుట న్యాయ్య మని భీష్మాది మహాత్ములచేతను దక్షపుణ్యపురుషులచేతను బూర్ణప్రేమతో ననుగ్రహింపఁబడినవారై పరస్పరము కూడు కొన్నవారై తదనురూపమైన కర్మమునే చేసియుందురు. "ఇప్పు డేమి చేసిరి" అని యడిగెను. ఇఁక పరమపుణ్య క్షేత్రమైన కురు క్షేత్రమందు వసించు గొప్పదనముచేతనే క్షాత్రధర్మస్వరూప సమరముయొక్క ఫలము సమర్థించుటకుఁ దగియున్నను వలదు వలదని మహాత్ములచేత నివారింపఁబడినను క్రూర హింసాఫలకమైన యుద్ధోద్యమమును వీడ లేరు. పైపెచ్చు మహా పతివ్రతయైన పాంచాలి విషయమున వస్త్రదీయ లాచరించిన యపరాధము కాల్చివేయుంటిదని యెల్లరెఱుఁగుదురు. ధర్మ సంస్థాపనార్థమే యుదయించిన భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు పరమసాత్త్వికులును మహాత్ములు నైన పాండవుల పక్షమందే యున్నాఁడనియు నెఱుఁగుదురు. కాని పశ్చాత్తప్తులై పాప మునకైన నిష్కృతియు నొనర్పక యింకను తమ పశు బలమునే నమ్మి పోర వెడలి నిలిచినను బరపక్షసేనాసన్న

మాత్రమునకో, మహామహిమోపేత కురుక్షేత్ర పాదనిక్షేప మాత్రమునకో, వీరును సాత్త్వికభావులు క్రమ్మి సాత్త్వికులయినారో, వెలిచిరో, యుద్ధమువలన విరమించుకొనిరో! యని చేసెదరని భావముతో సంజయుని నడిగెను. లేదా "జాతస్య మరణం ధ్రువం" అనెడి ధర్మరహస్యమును స్మరించి యెన్నాళ్లు జీవించినను చావు తప్పదనుచు స్వర్గాగ్రహము పీడిత పశుబల విశ్వాసముతో యుద్ధమునకే సన్నద్ధులై నిల్చిరా! యని తన వారిని గూర్చిన యనుమానభావము నెంచి ప్రశ్నించుటే కాక రాజు ధృతరాష్ట్రుడు "పాండవాశ్చైవ కిమకుర్వత" యని ప్రశ్నించెను.

ఇంకలి యభిప్రాయమేమనఁగా పాండవ స్వరూపమునకు నియతమైన వ్యవసాయమెట్లున్నదో యనియును దెలియఁగోరి వేఱుగాఁ బ్రశ్నించెను. ఇచట "ఏవ" శబ్దము భేదవచనమే కనుకఁ పాండవులును దమసహాయబలముతోఁ గూడి యుద్ధక్షేత్రమును మెట్టి యేమి చేసిరని యడుగుచున్నాఁడు. స్వభావము చేతనే సాత్త్వికులును, ధర్మస్వరూప భగవంతునితోను, భాగవతులతోను గూడియున్నవారును నగుటచేతఁ బ్రాణిహింసా పాపఫలకమైన ఘోరయుద్ధకర్మమువలన విరమించిరో లేక యుద్ధపరాఙ్ముఖులై సత్యధర్మపరులై స్వాభీష్ట ప్రాప్తి కారణమైన పని యతేమి చేసిరో తెలియఁగోరి "పాండవాశ్చైవ కిమకుర్వత" పాండవులును నేమి చేసిరి. యని రెండవమాటగాఁ బ్రశ్నించెను.

కనుకనే మహాభారతోద్యోగపర్వమందు మహాసభలో భగవంతుఁడు వాసుదేవుఁడు సౌబలునిచేతఁ గపటద్యూతమందు యుధిష్ఠిరుఁడోడుటయు, రాజ్య మపహరింపఁబడుటయు, వనవాసమునకై ప్రతిజ్ఞ చేయఁబడుటయు, సర్వసమర్థులైనను సత్యధనులైన పాండవులుగ్రమైన వనవాసవ్రతమును బదుమూఁడేండ్లు క్లేశపరంపర ననుభవించుచు జరుపుటయు; మిక్కిలి దుస్తరమైన యీ పదుమూఁడవయేఁడు తమ్మును తెలియంగకుండ గడపునప్పుడు అసహ్యకష్టముల కోర్చి యమ్మహాత్ములు సంతరించుటయు, న్యాయమైన రాజ్యప్రాప్తికిఁ దగియుండుటయు, మహాశయులు వీరెల్ల రెఱింగినదే. కావున నుభయపక్షములకుఁ బురోహితులైన సభాసదులు కురుపాండవుల మేలికొఱకైన కర్తవ్యమును లెస్స చింతించి ధర్మ్యమును, యుక్తమును, యశస్కరమును నైన దానిని సెలవిచ్చునది. అధర్మయుక్తముగా లభించు దేవరాజ్యమునైనను ధర్మరాజు గోరఁడు. ధర్మార్థములతోఁ గూడిన రాజరికమునే కోరును. ధృతరాష్ట్రపుత్త్రులు రాజ్యము నేవిధముగా గుంజుకొనిరో యిందెవ్వరుగ్రులో; యెవ్వరు సౌమ్యులో; యెవ్వరు సత్యధర్మపరాయణులో; యెవ్వరు నిష్కపటులో; యంతయు వీ రెఱుఁగుదురు. కావున దుర్యోధనాదుల ప్రవృద్ధలోభమును, యుధిష్ఠిరుని ధర్మనిష్ఠత్వమును, వీరికిఁగల సంబంధమును బరికించి తమ నిశ్చయమును దెల్పునది'' యనిన మాటచేతఁ బాండవస్వరూపము బాగుగా నుపపాదింపఁబడి వర్ణింపఁబడినది.

ఇంకఁ బాండవులయొక్క ధర్మనిరతమైన సత్యధర్మ సిద్ధికొఱకు సర్వసుఖదుఃఖములను సహించు నేర్పును, సత్యపరాక్రమత్వమును, దైవీసంపదచే సిద్ధమైన బలముతోఁ బోరు కోరికయు; శుద్ధ దైవీసంపదచేతఁ గలిగిన బలముచేతనే రాఁదగిన సంధి నొనర్పఁగోరుటను, సత్పురుష సమూహస్వత్వమును; న్యాయముచే లభించు స్వల్పరాజ్యమునకే సంతసించుటయు; సర్వలోకశరణుఁడును; భగవంతుఁడు నైన శ్రీకృష్ణుని కృపకుఁ బాత్రులగుటయు మున్నగు లక్షణములును స్వరూపములును నభివర్ణితము లని తెలియవచ్చును. దీనిచేఁ బాండవులకు యుద్ధమందుఁ బ్రవర్తించుట యుక్తమైనదని తెలియును.

దుర్యోధనుఁడన్ననో యిట్టివాఁడు కాఁడు. ఏలన నతఁడు మహానీయులైన భీష్మాదులచేతను, శ్రీకృష్ణునిచేతను బలుమారుల సంధికొఱకుఁ బ్రార్థింపఁబడినను దాను నిర్దోషి యనియే స్థాపించుకొనుచు "ఆచార్యా! నీవే కాదు; భీష్మాచార్యులు మున్నగు వారెల్లరు నన్నే నిందించుచున్నారు. పాండవులలో నొకరినైనను నిందింపరు. నాయందు నట్టి యపరాధమును నాకుఁ గానరాదు. మఱియు వీరును రాజు సైతము నన్నే ద్వేషించుచున్నారు. కేశవా! రవ్వంత యైనను నాయందు గుణవ్యభిచారమెంత సూక్ష్మముగా యోచించినను గానరాదు. యుద్ధమే శ్రేష్ఠమని నానిశ్చయము. సమరమందు మరణమే క్షత్రియులకు శ్రేష్ఠమని నీ వెఱుఁగుదువు. యోగీశ్వరేశ్వర! మధుసూదన! యుద్ధమువలన నాబుద్ధి విరమింపదు. పాండవులు

నన్నే యుద్ధమునందోడించి రాజ్యమును గైకొందురు గాక. అంతే కాని సూది మోపినంత నేలనైనను పాండవులకు నేను విడుచు వాఁడ నను కాను. నేను ధర్మము నెఱుంగుదునుగాని దాని యందుఁ బ్రవర్తనము లేదు. అధర్మము నెఱుంగుదును గాని; దానినుండి నివర్తిల్లుట లేదు. నాహృదయమునందు వాసు దేవుఁడు నన్నే కార్యమునకు నియోగించునో యాపనిని దప్పక చేయుదును." (ఉద్యోగపర్వము). అని తన నిర్బోధిత్వమును బ్రకటించినాఁడు దనదే ధర్మమని ప్రతిపాదించి పాండవు లతో సంధి నంగీకరింప లేదు. కావున నాసురభావోపలక్షిత మైన ప్రాకృతబలవిశ్వాసముచే బలిసిన యుద్ధకాంక్ష దుర్యో ధనునిదనియు; దైవభావోపలక్షితమైన యాత్మీయబలవిశ్వాస ముచే బలిసిన యుద్ధకాంక్ష పాండవులదనియుఁ దెలియుచున్నది. ఇచటఁ బాండవుల కనుకూలురును సర్వజ్ఞులును, భాగవతులు నైన భీష్మద్రోణాదులచేత ననుగ్రహింపఁ బడినరీతియో యని రహస్యము. కనుకనే యుద్ధారంభమునందు స్వాత్మసామ్రాజ్య ప్రాప్తికొఱకుఁ దమ్ము శరణుఁగోరి వచ్చిన ధర్మరాజునకు సత్పక్షపాతులు, మహానుభావులు నైన భీష్మద్రోణాదులు "ధర్మజా! నీవు యుద్ధము చేయుము; విజయము నొందుదువని యాశాసించి యనుగ్రహించిరి. (భీష్మపర్వము). ఈ గుర్వ నుగ్రహాశీర్వాదముచే పురుషునకు సర్వత్ర విజయమని నిశ్చ నవి. దీనివలనఁ దన తమ్ముఁడైన పాండునివలెనే తమ్ములైన యుధిష్ఠిరాదులును సత్త్వగుణవిశిష్టులనియు, నట్టి భాగ్యము

తనకు లేకపోయె ననియు విచారించియే ధృతరాష్ట్రుడు అచట నిల్చిన పాండవులును నేమిచేసిరి యని ప్రశ్నించెను. విశేషించి ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమందు నివసించు మహిమచే సాత్త్వికగుణము పొందినను జన్మసిద్ధమైన క్షాత్రధర్మము ప్రాణిహింసాలక్షణమైనను నధర్మ్యము కాదని యెంచి స్వార్థాగ్రహదోషము నంటియే యుండి యుద్ధము చేయనెంచిరో యను భావముతోడను బాంధవ్య లేమి చేసిరని సంజయు నడిగెను.

మఱియు భగవదాశ్రయులైన యధికారులకుఁ దమ పూను కర్మములన్నియు భగవదధీనములే యగుటచేత వారు స్వతంత్రముగాఁ దాము చేయవలసిన కర్మమొకటి యుండదు. కనుకఁ దమ యున్నస్థితిలో నిక భగవదభిమతమును ధర్మ్యమును నయిన యేమిపని చేసిరి? అనియు నొక భావము కల్గియు సంజయుని బ్రశ్నించెను.

ఇన్ని భావము లుదయించుటచేతనే ధృతరాష్ట్రుడు యోగియైన సంజయుని బ్రశ్నించెనని శ్రీభగవద్గీతా ప్రథమ శ్లోకాభిప్రాయముగాఁ జెప్పవచ్చును.

ఈసందర్భమున శ్రీ శంకరాచార్యాది గీతాభాష్యకర్తలు వ్రాసిన యభిప్రాయములు గీతాపాఠకుల కావశ్యకగ్రాహ్యము లయి యున్నవని యెన్నియు వివరించుట నావశ్యకము కాదు. మహాభారతేతిహాసము ఖిలమైనదనియు గాని నడుమ వ్యాసమహామునిచే గ్రథితమైన భగవద్గీతాభాగమందలి కొన్ని

శ్లోకములు అనుశాసనిక, శాంతి భీష్మాది పర్వములలోఁ గాల క్రమమునఁ జెదరి పడినవనియు, నది కారణముగానే గీతా గ్రంథాదిని ధృతరాష్ట్రుఁడు "మామకాః ... సంజయ" అని సంజయుని ప్రశ్నింపఁగా నాతఁడు తన యోగబలముచేతను; గురుదత్త దివ్యదృష్టివరప్రసాదబలమునను; జేసిన కథనమందుఁ ప్రధానభాగ మొకటి పర్యాంతరమునఁ బడిపోయినదనియు నది యీ ప్రశ్నమున కీయఁబడిన సమాధానములలోఁ గడు ముఖ్యమై గీతాపాఠక శ్రేయస్కరి యని చెప్పుచు యథాశక్తి దానివివరణము చేయుటే నాలక్ష్యము. అదే సంగరాభిముఖస్థితుఁడును; సర్వాధికారి శిష్యుఁడు నైన యర్జునున కుపదేశించి యచటనే చేయించిన "శ్రీ దుర్గాస్తుతి"

తరువాత సంజయుఁడు కురుక్షేత్రమందుఁ జేరికొన్నట్టియు; న్యాయధర్మపరులైనట్టియు; నాత్మీయదృష్టి సంపన్నులైనట్టియు; శుద్ధాధికారులైన వారి స్వరూపము దాని కనురూపమైన వారికర్మముల స్వరూపమును నిరూపించు దృష్టాంతముచే వివరింప నెంచి తొలుదొల్త నాయాయుగముల కనురూపమగు నట్లుగా సద్ధర్మ సాధుజనపరిత్రాణము కొఱకు నవతరించి యాయావతారధర్మమున కనురూపముగా నొనర్చిన వ్యవసాయము యొక్క సార్థక్యమును గోరిన భగవంతుఁడైన శ్రీకృష్ణుఁడు, అర్జునుని మఱలఁబిలిచి మహాశిక్షాచార్యత్వమును బూనిచేసిన యుపదేశలక్షణమును; అది సర్వాధికారివేద్యమై విశేషించి శుద్ధాధికారులు పొందఁదగినదియు; సర్వశ్రేష్ఠమై

వదియు; స్వాశ్రితజనరక్షణమే భగవంతుని ముఖ్యోద్దేశము లక్షణమనియుఁ దెల్పుచు దాని స్వరూపమును జెప్పుచున్నాఁడు.

అప్పుడే ఖిలభారతగ్రంథమునుండి జారిపోయి పర్యాంతరమునఁ బడిపోయిన యీ ముఖ్యభాగము సంజయుని మాటలలో వాంఛనీయమై శంకరాచార్యముఖ్యులైన భాష్యకారు లెచట సమర్పించిరో యీవిషయము పాఠకులకుఁ దెల్పుట యప్రస్తుతము కాదు.

యథాస్థితముగా నిప్పుడు ప్రచారమందున్న గీతాగ్రంథము ననుసరించి "సంజయఉవాచ" అనునది మొదలు–

తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।
సహసైవాభ్యహన్యన్త స శబ్దస్తుములోఽభవత్ ॥

భీష్ముఁడు శంఖారావము చేసినపిమ్మటఁ గౌరవసైన్య మండలి తక్కినవారును శంఖములు; భేరులు; తప్పెటలు, బూర గొమ్ములు మున్నగు యుద్ధోత్తేజన యుద్ధవాద్యవిశేషముల నొక్కసారిగా ప్రయోగింప నాసంకులధ్వని దిక్కులఁ బిక్కటిల్లెను. ఇంత దాఁకఁ గానవచ్చుదానిని బట్టి చూడఁగా భీష్మాచార్యులు శంఖము పూరించినంతనే యాధ్వనిని విని సైనికులు శంఖభేర్యాదులను ప్రయోగించిరి. అనఁగా నాయాయుద్ధాధికారులు చేయవలసిన కర్తవ్యాంశమును దెలియుటయే యుద్ధప్రధానాధికారి యాజ్ఞ లేకయే యీ దుర్యోధనునికైన దుర్న

మిత్రములకు నాదికారణమైన యుద్యోగముచేత నాలోచింప కయే యుద్ధవాద్యవిశేషధ్వనులను జేసిరని శ్లోకమందలి "సహసైవ" అను మాటచేతఁ దెలియుచున్నది. దీనివలన దుర్యోధనసైనికులు అశిక్షితులనియుఁ దెలియుచున్నది.

ఇంతవఱకు సైనని చెప్పి యిపుడు భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు తనవిధి నెట్లు నిర్వర్తించెనో శుద్ధాధికారులైన యాత్మీయుల కెట్టి యుపకారము చేయవలయునో యెంది యవిలంబముగా నిర్వహించిన తనధర్మమును జెప్పుచున్నాఁడు. ఈభాగమునే నేను వ్యాఖ్యానింపఁగడఁగినది.

ధార్తరాష్ట్రబలం దృష్ట్వా యుద్ధాయ సముపస్థితం ।
అర్జునస్య హితార్థాయ కృష్ణోవచనమబ్రవీత్ ॥

ఓ రాజా! భగవంతుఁడైన వాసుదేవుఁడు ఆ యా యుధి కాపులలోఁ బ్రవేశించి వారికి నియతానుష్ఠేయమైన ధర్మమును శాసించువాఁడై సర్వసంసారవ్యవహారనాయకుఁడై యుద్ధమునకు సిద్ధమై మిగుల సంభ్రమముతో సంగరరంగము నధిష్ఠించిన దుర్యోధనసేనను జక్కఁగాఁజూచి స్వాంశభూతుఁడైన యర్జునుని మేలుకొలుపు నెపంగాఁ దరువాత సుఖమును గలిగించు పురుషార్థప్రాప్తి నెంచి యిట్లు చెప్పెను.

భావమేమనఁగాఁ బ్రాకృతబలముచేతనే సాధ్యముగు నధర్మసిద్ధమైన యుద్ధముచేఁ దమకోరిక నెఱవేరుటకై ప్రవర్తించు

నధికారులను పట్టెడిదైన వారిపేరను ఉత్కర్షగాఁ బరికించి యది శుద్ధాత్మీయబలముచేతనే నిగ్రహింపఁదగిన దనుటను బరిగణించి యాయస్త్రమునే శుద్ధాత్మీయశక్తిని బెంపొందింపఁ గోరినవాఁడై సర్వలోకశరణ్యుఁడైన భగవంతుఁ డిట్లనిననుట.

ఇచట ధర్మసంరక్షణముకొఱకు నవతరించిన పూజ్యులైన నరనారాయణులచేత యుద్ధకర్మానుష్ఠానము పూనుకొనఁబడినది. కావున నరనారాయణుల కీరువురకును దదనంతర ధర్మనిర్వహణమునకై సంకుచితమైన యాత్మీయశక్తి వికసించుటకుగాను వారికి దివ్యభావులైన మహాత్ములచే దివ్యభావముతో సంస్కరింపఁబడిన మంత్రోపదేశ మగత్యమైనది. అట్టి మంత్రోపదేశముచేతనే వారు సర్వశత్రువులను మట్టుపెట్టఁగల శుద్ధాత్మశక్తివికాసముగల వారలగుదురు.

ఈ విధముగా నొకప్పుడు నరునకు నారాయణునిచేత మంత్రోపదేశము చేయఁబడుననియు; నొకప్పుడు నారాయణునకు భగవత్సంకల్పనియుక్తులైన వారిచేతఁ జేయఁబడుననియుఁ దెలియవచ్చుచున్నది.

ఎట్లనఁగా శ్రీమన్నారాయణదేవుఁడే దశరథపుత్త్రుఁడై ధర్మసంస్థాపనార్థమవతరించి రావణవధకుఁ గడంగి పోరునప్పుడు "తతో యుద్ధపరిశ్రాంతమ్" అనెడి రామాయణవచనముచేత యుద్ధపరిశ్రాంతుఁడైన రాముఁడు రావణవధవిషయమున ముగ్ధుఁడై చింతాక్రాంతుఁ డగునప్పుడు అగస్త్యమహర్షి మహా

స్త్యుఁడు తానే వచ్చి రామనామధారియైన నారాయణునకు నాదిత్యహృదయమను నీ మంత్రరాజము నుపదేశించెను. ఇది యీ సత్యమును బోధించు ప్రబలప్రమాణము కదా! ఇట్టివి యుపనిషత్ పురాణాదులందుఁ బలుతావుల గలవు కాంతము.

కనుకనే యువకారపురుషులకు స్థైర్యము తనశుద్ధసంకల్ప ముచే నియతమైన వ్యవసాయము పూర్తికానున్న వేళ లోక భావనచే మోహమును; వ్యవసాయనాయికయగు శక్తియొక్క సంకోచమును సంభవించుచునే యుండును. కావున సర్వేశ్వరుఁడగు భగవన్నారాయణునకును నటులే నారాయణాంశభూతులకును నియతసంసారనాయికయైన శక్తి ననుస్మరించుటకొఱకు వేదే నొక విధమున మంత్రోపదేశము నియతమగుచున్నది. కనుకనే యిచ్చట స్థైర్యము భగవదుపదేశము తప్పనిదయ్యెనని భగ వద్దర్శనసిద్ధులైన పెద్దలందురు.

శ్రీ భగవానువాచ :—

శుచిర్భూత్వా మహాబాహో సంగ్రామాభిముఖే స్థితః ।
పరాజయాయ శత్రూణాం దుర్గాస్తోత్ర ముదీరయ ॥

ఓ మహాబాహుఁడా! అర్జునా! దేశకాలములనుబట్టి చేయఁదగిన ప్రయోజనమును నిర్ణయింపఁగల వివేకశక్తి సంపద గల పార్థుఁడా! నరదేవా! నీవు స్వాభీష్టసిద్ధికి మూలకారణ మగు బీజ, మంత్ర, కవచ, స్తోత్రాది జపయోగ్యాచారవంతుఁడ

వయి యుద్ధారంభమునకు మున్నే రథమునుండి దిగి నీ యుద్ధ సాధనముల నుంచుకొనఁ దగిన చోటుల నుంచుకొని యథా విధిగాఁ గూరుచుండి శత్రుల నోడించుటకు దుర్గానామక యోగదేవీస్తోత్రమనెడి మంత్రరాజమును జపింపుము.

దీనిచేత యోగదేవీదీక్షాచార్యుఁడైన శ్రీకృష్ణుఁడు అయోగ్యాధికారులు స్వస్వరూపాను రూపకర్మమునందుఁ బ్రవర్తించునపు డాకర్మము పూర్ణమగుటకు ననఁగా సఫలమగుటకుఁ దొలుదొల్త వారిచేత స్వాత్మనియతశక్తియే యనుస్మరింపఁ బడవలయుననియు; ఆచార్యోపదేశము లేక యాశక్తి ననుస్మరింపరాదనియు; నాత్మశక్తిని దప్పించి మఱి యెట్టిశక్తియు వారి నియతిస్వభావపూర్తి కొఱకుఁ జాలదనియు నాకారణముచే స్వనియతాత్మశక్తినే స్మరింపవలయు ననియుఁ దమయందే నియతమై యున్న యాత్మశక్తి నుపాసించుట తొలుదొల్తఁ దప్పనిదనియు నిశ్చయించియే తనమహాచార్యత్వమున కనురూపశిష్యుఁడైన ఆ యర్జునుఁ డపుడు తప్పక చేయవలసిన కర్మమునకు సంగభూతమైన శిక్షణమును దా నుపదేశించు నాత్మశక్తిసంపద్విశిష్టయుక్తి స్వరూపమును బోధన నుపదేశించుచున్నాఁడు.

ఇచట "శుచిర్భూత్వా" అనునప్పుడతని సర్వేంద్రియముల పవిత్రతయు; విశుద్ధబుద్ధిమత్త్వము; సదాచార్యునివలన దీక్షాపూర్వకముగా సంగ్రహింపఁబడిన సర్వాభీష్టప్రదమైన

జ్ఞానము కలిగియుండుటయు ననే మూఁడువిధములైన శుద్ధసత్త్వము దుర్గాస్తోత్రజపాంగముగాఁ జెప్పఁబడి యున్నదని తెలియును.

పరమును గోరు ముముక్షువులైన యధికారులకు దుష్ట కామక్రోధాదిశత్రువుల నోడించుటకు శుద్ధాత్మశక్తి ననుస్మరించుటయే హేతువగును. అటులే బాహ్యశత్రువులను జయించుటకును నీదుర్గాస్తోత్రజపమే కారణమగునని "దుర్గాస్తోత్ర ముదీరయ" అనుచు నాఁడు నిర్దేశము చేయుటవలన "నమస్తే సిద్ధసేనాని" మున్నగు వాక్యములతో నర్జునుఁడు జపింపఁదగిన శ్రీదుర్గాస్తోత్రము సహితము భగవంతునిచేతనే యుపదేశింపఁబడెనని తెలియును.

కనుకనే "నమస్తే సిద్ధసేనాని" అని యారంభింపఁబడిన పండ్రెండు శ్లోకముల రూపముఁగల దుర్గాస్తోత్రమంత్రరాజము భగవద్వచనరూపముగానే స్వీకరింపఁబడి పూర్వులచేత గౌరవింపఁబడినది.

దీనిని బట్టియు "అస్యశ్రీదుర్గాస్తోత్రమహామంత్రస్య బదరీనారాయణ ఋషిః, అనుష్టుప్ఛందః। శ్రీదుర్గాఖ్యాయోగదేవీ దేవతా, మమ సర్వాభీష్టసిద్ధ్యర్థే జపే వినియోగః" అని భాష్యకారుల మాట కానవచ్చుటవలన శ్రీకృష్ణునకే దీని యుపజ్ఞత్వము. అనఁగా మొదటి జ్ఞానము. అనఁగా పరోపదేశము లేకయే తనంతట మొదటఁ గల్గిన జ్ఞానము. వాల్మీకికిఁ

గల్గిన రామాయణాదిమ శ్లోకజ్ఞానము చెల్లుటవలన నాతనికే ఋషిత్వము సిద్ధమగుచున్నది. అటులే పార్థుఁడు జపింపవలసిన స్తోత్రమంత్రజపము భగవద్వచనమే యని సిద్ధాంతింపఁ బడినది. శ్రీమద్రామాయణమందును నగస్త్యుఁడు శ్రీరామునకు నాదిత్యహృదయమంత్రోపదేశము చేయునప్పుడును "త్రిరాచమ్య శుచిర్భూత్వా" అని ప్రతిపాదింపఁబడినది. ఇదే యాదిత్యమంత్రదీక్షాలక్షణము. దాశరథి రాముఁడు భగవన్నారాయణుఁడు సూర్యమంత్రదీక్షితుఁడై రావణసంహారము నొనరించి తనకు నియతమైన వ్యవసాయమును జేసెనని తెలియును. కనుక సూర్యదీక్షయందు రామున కాచార్యుఁడు పూజ్యుఁడైన యగస్త్యుఁడే యయ్యెను. అపుడు శ్రీరాముఁ డధికారిశిష్యుఁడై యగస్త్యోపదిష్టవిధమున సూర్యమంత్రోపాసనము సలిపెను.

తరువాతఁ గురుక్షేత్రమునఁ జేరు నధికారము గలట్టియు; భగవంతునిచేత శిక్షింపఁబడినట్టియు; యోగదేవీకృపచే దీక్షితుఁడైనట్టియు; సచ్ఛిష్యలక్షణములు పూర్ణముగాఁ గలట్టియు నర్జునుని స్వరూపమును దివ్యమంత్రానుష్ఠానప్రకారమును సంజయునిచే నిటులు చెప్పఁబడుచున్నది.

ఏవ ముక్తోఽర్జునః సంఖ్యే వాసుదేవేన ధీమతా ।
అవతీర్య రథాత్పార్థః స్తోత్రమాహ కృతాంజలిః ॥

పోరు మొదలు కాకమున్నే శుద్ధయోగవిజ్ఞానైశ్వర్యసంపన్నుఁడైన భగవన్నారాయణాంశముతో నవతరించిన వసు

దేవపుత్త్రుఁడైన శ్రీకృష్ణునిచేత "శుచివై దుర్గాస్తోత్రమును జేయుము" అని భాసింపఁబడి శుద్ధాత్మశక్తిని బొందించు మహావిద్యాగ్రహణమునకు సంగభూతమైన శిక్షచేత శుద్ధాత్మస్వరూపుఁడును, సమర్థుఁడును నైన ధృతాత్మనయుఁ డర్జునుఁడు రథమునుండి క్రిందికి దిగి చేతులు మోడ్చినవాఁడై భగవదాజ్ఞ బొందిన బాహ్యాంతశ్శుద్ధి కలవాఁడై శరణాగతిముద్రను ఘటించి, భగవదుపదిష్టమైన యోగదేవీస్తోత్రమంత్రమును జపించెను.

ఇట్లనుటచేత యుద్ధారంభమునకు మున్నె దుర్యోధనుఁడు తనదుర్గతికి మూలకారణమైన స్వాచార్యతిరస్కారము చేసినటు లర్జునుఁడు చేయలేదని చెప్పుటకే భగవద్వచనమునకు లోఁబడుట యనెడి సచ్ఛిష్యలక్షణము సంజయునిచేత రాజునకు నివేదింపఁబడినదని తెలియుచున్నది.

ఇచట "కృతాంజలిః స్తోత్రమాహ" కేశోక్తిని స్తుతించెను; అనుటచేత దుర్యోధనుఁ డాత్మరక్షణమునకైన బరువు తనపైనే పెట్టికొన్నట్లు కాక పార్థుఁడు తనరక్షణమునకైన బరువు భగవంతునిపైనే పెట్టెనని తెలియుచున్నది.

తరువాత భగవంతుని వలన యోగదేవీదీక్ష నొందిన యర్జునుఁడు తన కుపదేశింపఁబడినట్టియు; పఠితారుల కెల్లరకును, కష్టములవల్లను, నరకమువల్లను ఆత్మశక్తిని బొందించునట్టియు, పండ్రెండు శ్లోకములు కలవిగాఁ గలట్టియు; శ్రీయోగదేవీదేవతాకమైనట్టియు, దుర్గాస్తోత్ర మనెడి మంత్రరాజముతోఁ

దనయుండే ప్రియశిష్యుఁడై యున్నట్టియు; దాను చేయవలసిన కృషికి నాయకుఁడైయున్నట్టియు; శుద్ధాత్మశక్తిని బ్రహ్మశక్తిస్వరూపను ఆకృషియందుఁ దనధర్మమును లెస్స నెఱవేర్చుటచే నగు ఫలప్రాప్తికొఱకును మఱల ననుస్మరించుచున్నాఁడు.

-: అర్జునకృత దుర్గాస్తుతి :-

నమస్తే సిద్ధసేనాని ఆర్యే మందరవాసిని।
కుమారి కాలి కాపాలి కపిలే కృష్ణపింగలే॥

ఈ "నమస్తే" అనుమాటను దీని ప్రత్యేకసంబోధనాంతములందు ననుసంధించుకొనవలయును.

1. సిద్ధసేనాని :- సిద్ధుల సేనను నడిపించుదానా! యుగమునకుఁ దగునట్లుగాఁ జేకొనను వట్టియు, విడువనుం దగినట్టియు, ధర్మమును బ్రచారితము చేయుటకు శిక్షించుదానా! యని భావము. సిద్ధులనఁగా భగవంతులైన నరనారాయణుల శుద్ధసంకల్పముచే సిద్ధమైన యోగబ్రహ్మవిద్యాగల యధికారులలో శ్రేష్ఠులు. ఇచట సేనాశబ్దము సముదాయవాచకము. అనఁగా సర్వోత్తమయోగికులేశ్వరి దుర్గయే యని భావము. రాజులు తమసేనలతో శత్రువులను గెలిచి స్వరాజ్యసిద్ధి నొందుచున్నట్లే యోగదేవివి నీవును సిద్ధాధికారులయందు నియతమైయున్న దివ్యయోగశక్తిచేఁ గాఁదగిన స్వర్గరాజ్యసిద్ధి యనెడి (మూలాజ్ఞానము తొలఁగుటచేఁ గలుగు)నాత్మస్వరూప బ్రహ్మ

విజ్ఞానమును స్వాశ్రితులైన వారియందుఁ బ్రవర్తింపఁ జేయుదువు. నీకు నమస్కారము. అమ్మా! నీకు సృష్టిసంకల్పము కలుగఁగానే నీలోనుండియే సిద్ధమై జగన్నిర్మాణయోగ్య వస్తువులైన ముప్పదియాఱు తత్త్వముల సముదాయమే నీసేన దానిని విచిత్రజగన్నిర్మాణేచ్ఛతో నీయధికారమున నుంచుకొని నడుపుదువు. నీలోనే సిద్ధమైన యీసేనకు నీవే నాయికవు. గావున సిద్ధసేనానివి. నీకు నమస్కారము.

2) ఆర్యే :- సర్వశ్రేష్ఠురాలా! "ఆర్యా కనమకినీ" ఇచ్ఛాశక్తిరార్యా. పరశివబ్రహ్మమే సర్వశ్రేష్ఠుఁడు, ఆర్యుఁడు, ఆతని శక్తియే ఆర్యవు. సర్వశ్రేష్ఠ బ్రహ్మస్వరూప శుద్ధవిజ్ఞానమే బ్రహ్మస్వరూపము. ఈసర్వశ్రేష్ఠబ్రహ్మశక్తి ననుసరించు సత్కారముగల విజ్ఞానులకు "సత్త్వైర్వేదగం ఆర్యం" అనెడి ముఖ్య విజ్ఞానమే సంపాదించును. కావున నీట్టివిజ్ఞానసంపద కలవారలే స్వతంత్రులు, శుద్ధజ్ఞానవిజ్ఞానులనియు, వారలే సర్వశ్రేష్ఠులనియు సిద్ధాంతము. కావుననే "మత్తశ్చ సంప్రవర్తతే ప్రకృతి పురుషాత్మకం జగత్ శూన్యంచాశూన్యంచ। అహమానందా నానందౌ అహం విజ్ఞానా విజ్ఞానే, అహం బ్రహ్మ బ్రహ్మణీ వేదితవ్యే। అహం పంచభూతాన్య పంచభూతాని, అహమఖిలం జగత్"—

నావల్లనే ప్రకృతి పురుషాత్మకమైన జగత్తు సాగుచున్నది. నేనే శూన్యాశూన్యములు, నేనే యానందము, అనానందము,

నేనే విజ్ఞానము—అవిజ్ఞానము; నేనే బ్రహ్మము-బ్రహ్మశక్తి యని
తెలియవలయును. నేనే పంచభూతములును—అపంచభూతము
లును; నేనే యఖిలజగత్, అని తెలియవలయును. (దేవ్యుప
నిషత్) అనఁగా నాకంటెను భిన్నమైనది వేఱొకటి లేదనని
యనుభవజ్ఞానము కలుగవలయునని నిష్ప్రబోధించినది. కావున
ఆబ్రహ్మశక్తియైన దేవివి నీవే సంసారవ్యవసాయమును నడి
పించువారవు. కావున నిట్లభివర్ణింపఁబడిన శక్తిని నిన్ను స్మరిం
చుట యధికారులకుఁ దాము నియతముగా ననుష్ఠింపఁదగు
కృషి. పుణ్యనరులకు ముఖ్యహేతువగును. ఆద్యాదేవీ! నీకు
నమస్కారము. ఆద్యాపదముగానే నిన్నుఁ బిలుచుచు ఆద్యా
వృత్తశ్లోకముల పంచశతితో నిన్నభివర్ణించి కృతార్థుఁడైన
మూకమహాకవి, సిద్ధాంతగ తాత్మశక్తియైన నిన్ను మహాత్రిపుర
సుందరినిగా వర్ణించెను. కాంచీపురాధీశ్వరి యనెను. యోగ
శాస్త్రముఁ జెప్పుచున్నపుడు త్రిపురుని (బ్రహ్మ విష్ణు, రుద్రపుర
ములు = శరీరములు ఎవనివో యాతఁడు త్రిపురుఁడు) సుందరిగా నన్ను
సేవించెను. సాక్షాత్తముఁ దాల్చు తనశరీరమును రాష్ట్రము
గాను అందలి ప్రసిద్ధపట్టణములు మోక్షదాయకములని వాసి
కెక్కిన "అయోధ్యా, మధురా, మాయా, కాంచీ, కాశీ,
అవంతికా, పురీ, ద్వారవతీచైవ సప్తైతా మోక్షదాయికాః"
అను పేరను మూలాధారాది సహస్రారాంత చక్రములుగాను
రూపించి, అందు అయిదవదైన యనాహతచక్రమునే కాంచీ
పురముగా గౌరవించి అచటనే నీకుఁ గామాక్షినామ మిడి

సేవించి ధన్యుండయ్యెనని యమ్మహాకవి రచిత గ్రంథానుశీలన మందే మాకుం దెలియుచున్నది. ఆర్యే! కాంచీపురాధీశ్వరి! రక్ష మాం శరణాగతమ్.

3) మందరవాసిని :— మందర మనగా మనుజులశీర్షము నందలి బ్రహ్మరంధ్రసంజ్ఞకమైన మహాస్థానము. సర్వదేవతా నిలయమైన యాచోట నివసించు దానవు. కావున వివేకలక్షణ మైన వైష్ణవీశక్తివి నీవే. నిను ననుస్మరించు నధికారముగల విజ్ఞానులకు నాత్మస్వరూప విషయమున విడువం దగినదియుం, జేకొనందగినదియు నైన తత్త్వమును గూర్చిన వివేకవిజ్ఞాన శక్తిని బెట్టుదువు. కావున నట్టివిజ్ఞానశక్తి సంపన్నులైన యధి కారులే విధిగాం దాముచేయువలసిన వ్యవసాయమునుండుం దొలగి పోక నిల్వంగల్గుదురు. ఈవిషయమే యోగశిఖోపనిషత్తు—

బ్రహ్మరంధ్రే మహాస్థానే వర్తతే సతతం శివా ।
చిచ్ఛక్తిః పరమాదేవీ మధ్యమే సుప్రతిష్ఠితా ॥

మహాస్థాన మనెడి బ్రహ్మరంధ్రమునందు శివశక్తివి నీవు సంతతముందువు. జ్ఞానశక్తి స్వరూపిణియు, సర్వశ్రేష్ఠయు ననఁగా మోక్షమును గల్గించునదియు నైన యీదుర్గాదేవి బ్రహ్మరంధ్ర మధ్యమునందు సుప్రతిష్ఠితమై యున్నదని వర్ణించి నది ఇట్టి శ్రుతిప్రమాణములచేత మనుజులకెల్లరకు నుపాసింపం దగిన శివశక్తివి నీవే. అట్టినీచే ననుగ్రహింపంబడిన యధికారులే తమకు నిమిత్తమైన వ్యవసాయము పూర్ణమగుటకు సమర్థులగు

దురు. " దేవీ మందరవాసినీ త్యాది సదా సంస్తూయసే యోగిభిః" మందరవాసినివైన యనఁగా బ్రహ్మరంధ్ర ప్రతిష్ఠితవైన మహాదేవశక్తివి నీవే యోగులచేత స్తుతింపఁబడి స్మరింపఁబడుచున్నావు. అమ్మా! నీకు నమస్కారము. మూలాధారమనెడి యయోధ్యనుండి నిన్నుఁ గొనివచ్చి, యనాహతమనెడి కాంచీపురమునఁ బ్రతిష్ఠించి సేవించి, క్రమముగా సహస్రారము పేరిద్వారకావతికి (శ్రీ) విద్యాసాధకోత్తముఁడైన మహాకవి ఎవఁడేని గొంపోయి తాదాత్మ్యముగో సేవింపఁ గల్గునేని వాఁడే నిన్ను "మందరవాసిని" యని సంబోధింప నధికారి.

4) కుమారి :- అమ్మా! నీవు కుమారివి. నీవు దుష్టకామాదులకు మూలమైన మారుని దిరస్కరించితివి. కావున నీవు కుమారివి. దుష్టసంకల్పముల నెడి క్రూరులను జంపుదానవు గనుకను కుమారివి. నీవు శుద్ధసంకల్పనాయికవు. నీవు మాయవు. బ్రహ్మశక్తివి. ఇచ్ఛాశక్తిస్వరూపవు. అట్టి నిన్ను నిమువక స్మరించు నధికారము గల విజ్ఞానులకు నియుక్తమైన వ్యవసాయమందు నియంత్రణాభారము నీపై వేసికొని శుద్ధసంకల్పనాయికవును, స్వతంత్రేచ్ఛాశక్తిస్వరూపవును గావునఁ గుమారీశక్తిసంపన్నులైన యధికారులనే శుద్ధసంకల్పసమగ్రులుగాఁ జేయుదువు.

అమ్మా! యోగశాస్త్రమందు మూలాధారకులకుండమునకు "కుమారి"యని వ్యవహారము. కామకళా — సృష్టిని గావించిన పరమేశ్వరుని శ్రేష్ఠశక్తివి. నీవు ప్రత్యేక పిండాండ

మంచమును నెలకొనియుండి సంకల్పమాత్రమున సుషుమ్నా పథమున నగ్రభాగఁ జూతువు. ఆకుమారమందుఁ బుట్టితివి కావున "కుమారి"వైతివి. మంత్రధ్వనితో నప్పుడే పుట్టిన బిడ్డ వలె లేచి స్వాధిష్ఠానమునఁ జేరునప్పుడు నీకు "బాలా"యనియు పేరు. "యత్కుమారీమంద్రయతే" (శ్రుతి). పిదప ఆఱుదళ ములయందు "బ" మొదలు "ల" వఱకు న్యసింపఁబడిన మాతృకావర్ణములు గల పద్మమును స్వాధిష్ఠానముగాఁ జేసికొనుట చేతను గాయత్రీశక్తివైన నీవు "బాలాత్రిపురసుందరి" వైతివి. ఆపద్మమును వీడి మణిపూరాదుల దూసికొని పోవునప్పుడు "మహాత్రిపురసుందరి" వని స్తుతింపఁ బడితివి.

ఈమెయే కామకలారూప యంటిని. కామకలవైన నిన్ను దెల్పు బీజము "ఈం". ఇది నీవిద్యయైన కాదివిద్యయందు నుద్ధరింపఁబడును. ఈ విద్యయందు నాలుగు "ఈ"కారములు కలవనియు నాలవదియైన ఈంకారమే" లక్ష్మీకామకలా నామములతోఁ బ్రసిద్ధమనియు శ్రుతి చెప్పినది. త్రిపురసుందరీవిద్య యందలి ప్రథమకూటమైన "క, ఏ, ఈ, ల, హ్రీం" అనువాని యందే యుద్ధరింపఁబడును. దీని విశేషవివరణమును గూర్చి నాయనువదించిన సౌందర్యలహరియందలి "స్మరం యోనిం లక్ష్మీం" అనుమాటలతో నారంభమగు 33 శ్లోకపు వివరణ మందుఁ వివరములు చూడఁదగినది. అందుద్ధరింపఁబడిన "ఈంకారమే" కామకలా అని నీ స్వరూపము.

కౌమారికాం ప్రకోద్భాసాం సారాత్సారాం పరాత్పరాం।
ప్రణమామి మహాదేవీం పరమానందరూపిణీం ।

—మాతృకాసరస్వతీస్తుతి.

ఈ నీ విద్యయే గుప్తతరగాయత్రీ విద్య. పరమానంద స్వరూపమును బరమేశ్వరశక్తియు నైన కుమారిని మహాదేవిని సన్నుదెల్పు "ఈంకారము" గుప్తతరముగా నుండుటచే నీవిద్యకు "గుప్తతరగాయత్రి" యను పేరయ్యెను. అని యొక శ్రుతి చెప్పఁగా "ఏవమేతాం త్వా వేదకుమారీం బ్రహ్మస్వరూపాం। త్రిముఖీ మేకముఖీం శుద్ధాత్మ శక్తిం బ్రహ్మాణి సభవతి శుద్ధసంకల్పః। సభవతి యశస్వీ; సభవతి తేజస్వీ, సభవత్యోజస్వీ, బలిష్ఠో బ్రహ్మనిష్ఠో విభూతిమాన్" అను యథర్వ శ్రుతి యున్నది.

అమ్మా! కుమారీదేవీ! నీయథార్థ స్వరూపము నీ విధమున నెఱిఁగిన వాఁడు శుద్ధసంకల్పుఁడును, యశోవంతుఁడును, తేజోవంతుఁడును, ఓజశ్శాలియు, బలిష్ఠుఁడును, బ్రహ్మనిష్ఠుఁడును, విభూతుల పేరఁబరగు సర్వసిద్ధులతోఁగూడిన వాఁడును నగును.

"కామో యోనిః కామకలా వజ్రపాణిర్గుహాశయా। సా స సకలా మాయా చ పునః కుశేశయా విశ్వమాతా దివి తిష్ఠతి సైషాత్మశక్తిః। కుమారీ దేవీ భగవత్యాత్మశక్తి ర్దేవేంద్ర

మండలవాసినీ । సైషా భవతి మాయా బ్రహ్మశక్తి
స్స్వాహా । తా మేవాం వేద సభవతి విభూతిమాన్"

—దేవ్యుపనిషత్.

నీవే మహామాయా, మహావిద్యా, బ్రహ్మశక్తి యున్నగు పేర్లతో వర్ణింపఁబడితివి. (ఇమ్మహామాయా మహావిద్యాపదముల వివరణముకొఱకు నాసాధనసామగ్రి నాలవమూట యందలి బ్రహ్మకృతదేవీస్తుతియందుఁ జదువరులు చూడఁ దగును.) కావున శ్రుతిస్మృతులయందు వర్ణింపఁబడిన యీ నీస్వరూపమే సముపాస్యము కనుకఁ గుమారీ సంజ్ఞ కాత్మశక్తివి నీవే తొలియవ్వ ల్ల నధికారులచేత స్వానుభూతివ్యవనాయ పూర్తి కైన శుద్ధసంకల్పసిద్ధికొఱకు నమస్కర్తవ్యవని పెద్దలు సిద్ధాంతీకరించిరి. అమ్మా! నీవు కుమారివి. దేవసేనానాయకుఁడై తారకాసురు నడిర్చి వానిని మట్టుపెట్టిన కుమారస్వామిశక్తివి. పరమార్థమేమనఁగా, కు—దుష్టసంస్కారములను, మార—యతి— అణఁగఁద్రొక్కువాఁడు. ఇతఁడు దేవసేనాపతి. 36 తత్త్వముల సముదాయమే దేవసేన. సముద్రమందలి బుడగలవలె నైజాన సముద్రమైన పరమేశ్వరునియందు శివాదిక్షితిపర్యంతమైన 36 తత్త్వములు లేచినవో యవి యాతని యాజ్ఞ ననుసరించియే జగన్నిర్మాణకార్యమందు వినియోగింపఁబడును. గావున దేవసేనకు అనుశీలంపదయనకి కుత్సితవర్గమును సంహరించువాఁడు కనుకఁ గుమారుఁడు, అతని శక్తివగుటచే నీవు కుమారివి. అనఁగా స్వాశ్రితులకు దైవీసంపదనే ప్రసాదించుచు నానుకి

సంపదను మట్టుపెట్టి భక్తరక్షణము చేయుటకనీవని తెలిసి కొంటిమి. ఆర్యాంబా! కుమారీదేవి! నీసంకల్పముచేతనే యీ యార్యావర్తమునం బుట్టిన నీబిడ్డలెంతటి ప్రతిభావంతులు! తల్లీ! వీరుభారతులు, "భాసాం రతాః భారతాః" స్వయం ప్రకాశ వస్తూపాసనమందు ఆసక్తికలవారు. కనుక నీదేశము ఆర్యావర్తము, భారతము నైనది. సర్వప్రపంచము నీకల్పనమే యైనను నిట్టి పావననామము గలదేశము భూముఖమున మఱొండు లేదు. అర్యను నిన్ను బూజించి భారతులమైన మేమే నీధన్యసంతానము. ఈఆర్యావర్తమును స్త్రీరూపముగా-బ్రహ్మ శక్తిస్వరూపముగా నన్నారి. "స్, త్, ర్, ఈ=స్త్రీ" సకారము బ్రహ్మమును, తకారము జగత్తును, రేఫము తేజస్సును=జ్ఞానమును, ఈకారము శక్తిని దెల్పును. కాగా అఖండజ్ఞానస్వరూప పరమాత్మశక్తియే జగదాకారము నొందగా తచ్ఛక్తి స్త్రీబీజ వాచ్యమైనది. అది నీవు. ఆర్యావర్తమును స్త్రీమూర్తిగా భావించి దానిదక్షిణ పర్వతాగ్రమును కన్యాకుమారి యుగ్రమనిరి. ఉత్తరాగ్రమును హిమవత్పర్వతోన్నతతమ శిఖరాగ్రముగా చూపించి పార్వతియనిరి. ఎంత గంభీరభావము. నిన్ను రెండుస్థలములందును బర్వతపుత్రివనియే పల్కుటలో ఎంతో గాంభీర్యమున్నది. తల్లీ! చైతన్యమయివైన నీవు కేవలజడముగా కానవచ్చు శిలలయందుసైతము మాకు వెనకే చూపుకొను నేర్పున్నప్పుడు తప్పక ప్రత్యక్షమగుదువని భావముకదా. దక్షిణాగ్రమున నీవుట్టినిల్లు కుమారమునకి మూలాధారము కనుక

నచట నీవు కుమారివి, కన్యకవు, బాలాత్రిపురసుందరివి. అనా
హతమందు (వింధ్యాద్రి) నీవు మహాత్రిపురసుందరివి. నీవే
సర్వోత్కృష్టస్థానమై హిమగిరిశిఖరముగా చెప్పబడు సహస్రార
మందు లలితవు. (సర్వమతీత్య లలతీతి లలితా) అన్నిటిని మీరి
ప్రకాశించు నది లలితా. నీస్థూలమూర్తియైన యార్యావర్త
మందు భక్తులు నిన్ను ఇష్టాను విధములుగా సేవించుచుండ
యోగసాధనపరులైన వారు పిండాండమందలి సుషుమ్నా పథ
మునే ఆర్యావర్తముగా—ఆర్యాశబ్దవాచ్యవైన నీవావర్తించు
అనగా ఆరోహణావరోహణములు చేయుప్రాంత్యభూమిగా నెంచి
నిన్నుపాసించి ధన్యులగుచున్నారు. నీస్వరూపమే యైన పిండాండ
మందు తొలుత బాలాత్రిపురసుందరిగాను క్రమముగా మహా
త్రిపురసుందరిగాను ఉన్నతాధికారులై లలితాంబగాను ఉపా
సింతురు. లలితా! పరశివవనితా! నీకివే వినతులు.

5) కాళి :- అమ్మా! నీవు కాలునిశక్తివి. కాలుడను
పరమశివుడను. తచ్ఛక్తివి. నీవు కాలనాయికవు. కాలునకంటె
భిన్నవుకావనెడి యేకత్వబుద్ధితో వెలయువానికి సర్వేష్టసిద్ధి
దాత్రివి. కావున నీవు కర్మయోగులచేత నుపాసింపబడు బ్రహ్మ
శక్తిస్వరూపవు. ఆత్మనిష్ఠితయైన క్రియాశక్తిస్వరూపవు నని
చెప్పబడితివి. నిన్ను నుస్మరించు నధికారులైన విజ్ఞానులకు నియ
తానుష్ఠేయములైన కర్మములయందు నాయికవై యుందువు.
స్వతంత్రాత్మశక్తి స్వరూపవు. క్రియాశక్తి రూపమున నం
దెంపొంది వెలయుదువు!

ఈ విధముగా నమస్కరింపఁబడు నీవు కాలినామమునఁ బరఁగుదువు. నీవు వ్యాప్తిశక్తి ప్రధానినివి. కావునఁ గాలీశక్తి సంపన్నులైన యధికారులే ప్రవృత్తిపరమైన ప్రత్యేకశుద్ధకర్మ మందును సమర్థులగుదురని నిశ్చయించుచున్నాము.

తాం సూర్యవర్ణాం క్రియయా జ్వలంతీం
క్రీం బీజవేద్యాం పరమాసనస్థాం ।
సర్వాత్మసంస్థాం పరమాత్మశక్తిం
దేవీం భజే కాళికాం కర్మశక్తిమ్ ॥

కర్మోద్యమే యే మనసా స్మరంతి
తాం కాళికాం కర్మశక్తిం చ భక్త్యా ।
తే కర్మ కృత్వా పరమం పవిత్రం
భజంతి తత్పరమం బ్రహ్మధామ ॥

(సూర్యతేజోరూపిణియైనట్టియుఁ, గ్రియాశక్తిరూపమున వెలయునట్టియు; "క్రీం" అనెడి బీజాక్షరముచేఁ దెలియఁబడు నట్టియు, సర్వోత్తమాసనమైన సహస్రారమందున్నట్టియు, సర్వ మందును నాత్మస్వరూపమున నున్నట్టియుఁ, బరమాత్మశక్తి యైనట్టియు, స్వయంప్రకాశశీలయు, సృష్ట్యాది క్రీడనశీలయుఁ, గర్మశక్తిస్వరూపిణియు నైన కాళికాదేవిని సేవింతును. అట్టి క్రీం బీజవాచ్యయైన కాళీదేవిని దమతమ కర్మోద్యమముల యందు మనసార స్మరించువారు ఆయాకర్మముల ననవద్యముగా నెఱవేర్పఁగలవారై సర్వశ్రేష్ఠమైన బ్రహ్మపదము నొందుదురు. ఇటులు కాలి స్తుతింపఁబడినది.)

5)

కావున నిత్యాలీశక్తి కర్మోద్యమమందు సర్వాధికారులకును ఫలప్రదాత్రి యగుటచే స్మర్తవ్యయని సిద్ధాంతము.

6) కాపాలి:- కపాలి=శివుడు. అమ్మా! నీవు శివశక్తివైన కాపాలివి యనుటచే నధికారులైన యెల్లర యెల్లపనుల నెఱవేర్పు నాయికవును, బ్రహ్మశక్తిస్వరూపమున వారియందు (తమయందే) నియతవై యుండి స్వతంత్రవైన క్రియాశక్తివి నీవే యని యనుచున్నాము. అట్టి నిన్ననుస్మరించు (ఉపాసించు) నధికారులైన విజ్ఞానుల యాత్మస్వరూపమునుండి శత్రువుల సర్వప్రతికూలప్రవృత్తులను నుపసంహరించుదానవై యాశత్రువులను సంహరించు పనియందు నున్ముఖవైన యాత్మశక్తివై పెంపొంది వెలయుదు వని తెలియును.

కావున నిట్టి శక్తిసంపదగల యధికారులే తమ శత్రుబలమును స్తంభింపఁజేయు నాత్మశక్తివైన నీ యనుగ్రహమును సంగ్రహించు సామర్థ్యము గలవార లగుదురని నిశ్చయించినాము.

కావుననే "తామ్రైతాం వేద కాపాలీం మహాదేవీం దుర్గాం శివాం విధివ దుపాస్తే జహాతి స పరాన్ సరీక్షయతి, స్తంభయతి, మోహయతి, భ్రామయతి, ధునోతి స్వకీప్సితం ప్రాప్నోతి పరమం పదం బ్రహ్మణ ప్రజాపతే."-అధర్వణశ్రుతి.

కపాలినామ్నివైన నిన్ను మర్గముల నడలించు మహాదేవశక్తిని గాను; మంగళస్వరూపను గాను; సతింగి శాస్త్రో)

క్తరీతి నుపాసించి హోమాదుల నాచరించి సంతృప్తను చేయు వాఁడు లోపలి వెలుపలి శత్రువులను జయించును. నిలువఁ డీయును. (వారి పురోగమనము నరికట్టును) మతి పోఁగొట్టును. భ్రమింపఁ జేయును. తనపాపములను బోఁగొట్టుకొనును. అంతమందుఁ బరమపదము నొందు నని యథర్వశ్రుతి నిన్ను స్తుతించినది.

కావునఁ గర్మవ్యవసాయమును జేయు నధికారుల కిష్ట ఫలదాన సమర్థవగుటచే, నీవే స్మరింపఁబడు చుందువని యాచార్యు లభివర్ణించిరి.

అమ్మా! స్వస్వరూపానందాస్వాదము చేయువాఁడు. పరశివుఁడని తెల్పుటకే కాపాలి యని పేర్కొనఁ బడెను. పరశివాభిన్నశక్తివి నీవు కాపాలివి. కనుక నీవు స్వస్వరూప నిత్యానందామృతపానశీలవు. కావున నీవును గాపాలి వని స్తుతింపఁ బడుచున్నావు.

7) కపిలే :- అమ్మా! నీవు కపిలవు. నిన్నుపాసించు నధికారులు తలంచునదెల్ల నిచ్చు కామధేనువవైన విష్ణు శక్తివై బ్రహ్మశక్తిస్వరూప క్రియాశక్తి వని చెప్పఁబడితివి. నిన్ను స్మరించు నధికారులైన విజ్ఞానులలో నాత్మస్వరూపమున నుండి నిన్నాశ్రయించు సర్వలోకముల సంరక్షణాధికారమందు నిష్ఠితవైన క్రియాశక్తివై పెంపొంది వెలయుదువని మాకుఁ దెలియును. కావున "కపిల" యను పేరి శక్తితోఁ గూడిన యధికారులే సర్వజగద్రక్షణసమర్థులు కాఁగలరు. కావుననే

"దేవీం వాచ మజనయన్త దేవాః తాం విశ్వరూపాః పశవో వదన్తి సానో మంద్రేష మూర్జం దుహానా ధేను ర్వాగస్మా నుపసుష్టు తైతు" అనియు.

"తా మాత్మసంస్థాం, సకలార్థదాం, శివాం,
గాం, వైష్ణవీం క్షీరనిధే స్సముత్థితామ్,
యాం వై మనుష్యాః శరణం భజన్తి యే,
తే లోక గో ష్ప్రత్య మయన్తి సత్వరమ్."

అనియు నథర్వశ్రుతిచే స్తుతింపఁబడితివి. కనుకనే యిటులు వర్ణింపఁబడిన శక్తిసంపన్నులైన సాధకులే కపిలాఖ్య బ్రహ్మశక్తి స్వరూపవైన నిన్ను సర్వసంరక్షణ సామర్థ్యమును గోరి యుపాసింతురని మా నిశ్చయము.

8) కృష్ణపింగళే :- ముప్పదియాఱు తత్త్వములతో సిద్ధమైన యీవిశ్వమే స్వరూపముగాను; "ఋతంభర, సత్యంభర" ప్రజ్ఞాస్వరూపముగాను, మేము త్రివిధముగా భూతభవిష్య ద్వర్తమాన జ్ఞానరూపమున ననుభవింపు నఖండజ్ఞానమే స్వరూపముగాను, సర్వత్ర వ్యాపించియుండు తేజస్సు గలది గాను, సర్వాంతస్సులయందును వ్యాపించి యుండుటచే నాత్మ నామములోను వెలయు పరబ్రహ్మమే పురుషుఁడు. శ్రుతుల యందుఁ బురుషుఁడనఁబడు నావస్తువు కృష్ణపింగలవర్ణశోభిగా వర్ణింపఁబడినది. సర్వాంతర్యామియై వ్యాపకయోనియందు వ్యాపించియున్న వస్తువు పింగళవర్ణము గలదిగానే యనఁగా గోరోచనమునుబోలిన రంగుగలదిగా శ్రుతులయందు వర్ణింపఁ బడినది. "ఋతగ్ం సత్యం పరం బ్రహ్మ పురుషం కృష్ణపిఙ్గళం

ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయవై నమో నమః" మఱియు ప్రజ్ఞాభాస్యతో వెలయుచు సర్వప్రాణిహృదయగుహల యందు వ్యాపించి నీలమేఘగత విద్యుల్లేఖతో నుపమింపఁబడి, తన సూక్ష్మరూపవిషయమున నీవారధాన్యపు ముల్లుతోఁ బోల్పఁబడి యణువును బోలి యుండి పసుపుపచ్చని వర్ణము గలదిగా వర్ణింపఁబడిన యీపరమాత్మన స్తుతే పురుషుఁడు. అతడే బ్రహ్మ, హరి, శివ, ఇంద్ర, అక్షర, పరమ స్వరాణ్ణామము లతో వదబడునని శ్రుతి వర్ణించినది- అమ్మా! దుర్గా! నీవే యీపురుషశక్తిస్వరూపమున సర్వమందు నున్నదానవు. స్వతంత్రవు. సర్వలోకములను సర్వధర్మములను నేలుదానవు. మేరలేని ప్రభావముగల క్రియాశక్తిగాఁ జెప్పఁబడుచున్నావు. నిన్ను స్మరించు నధికారముగల విజ్ఞానులలో నాత్మస్వరూప మునఁ గ్రియాశక్తిగాఁ బొంది వెలయుదువని తెలియు దుము. కావునఁ బురుషశక్తిసంపన్నులైన యధికారులకు దేవా సురమానుష పక్ష్యాదులతోఁగూడిన సర్వలోకములును భయ పడును.

"భీషాఽస్మాద్వాతః పవతే, భీషోదేతి సూర్యః, భీషాఽస్మా దగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమః" అను నీతైత్తిరీయ శ్రుతిప్రమాణముగాఁ బురుషశక్తిసంపన్నులు బ్రహ్మస్వరూపు లగుటవలన వారి మహిమము కొనియాడఁబడినది. కనుకనే "పురుషశక్తిస్వరూప మేవేదం సర్వం। సా విశ్వమోహినీ, విశ్వ మాతా, వైనాచాత్మశక్తి త్రిపురసుందరీ। య ఏవం వేద

స సర్వం దుర్గం తరతి, స సర్వేషాం నియంతా సర్వభాగ్యపతిః
సచిరం జీవతి బ్రహ్మవిజ్ఞానీ । తస్మాచ్చ దుష్టా భావాభిభ్యతి".
— అథర్వణశ్రుతి.

సర్వమును బుధమశక్తిస్వరూపమే. అదే విశ్వమును గన్నది. విశ్వమును పోషించునది. ఆయాత్మశక్తియే త్రిపుర సుందరి. అనఁగా మూఁడు పురములయందును (శరీరముల యందును) అనఁగా జాగ్రత్స్వప్న సుషుప్తులయందును విశ్వ, తైజస, ప్రాజ్ఞ నామములతో జ్ఞానస్వరూపమున శోభించునది. మఱియు బ్రహ్మవిష్ణురుద్రుల మూఁడు శరీరములెవ్వరివో యా పరమపురుషుఁడే త్రిపురుఁడు అతని సుందరిగా వర్ణింపఁబడినది గానఁ త్రిపురసుందరి. ఇటులు తెలిసికొనఁగలిగినవాఁడే సర్వదుర్గములను (కష్టములను) దాటిపోవును. అతఁడే సర్వమునకు నాయకుఁడు. అతఁడే చిరంజీవి. అతఁడు బ్రహ్మజ్ఞాని యగుటవలన సర్వదుష్టభావము లతనికి భయపడును. మఱియు సనాతనధర్మదీపిక యందుఁ బూజ్యుఁడైన నారదుఁడు పురుష శక్తి సంపన్నాధికారులను గూర్చి.

యస్యాః సర్వే దుష్టభావా దేవాశ్చ మునిపుంగవ ।
బిభ్యత్యస్యా మహాదేవీ యా చ సా కృష్ణపింగలా ॥
విస్ఫూర్తం దహరాకాశ మధ్యస్థే బ్రహ్మలక్షణా ।
యా చ స్యాత్పురుషే నిత్యం యోగేనైవ విరాజతే ॥
బ్రహ్మసాయుజ్య కామాశ్చ యోగినో యా ముపాసతే ।
సా స్యాత్పురుషశక్తిశ్చ యోగదేవ్యభిలేశ్వరీ ॥

బ్రహ్మా విష్ణుః శివశ్చేంద్రో దేవాః సిద్ధా మహర్షయః ।
ధ్యాత్వా పురుషశక్తిం చ స్వాత్మస్థాం మునిపుంగవ ।
స్వస్థాన మనవాప్యంచ సంప్రాప్తా ఇతి బుధ్యతే ।
సా దేవీ నియమేనాత్ర సేవ్యా స్యాద్భువనౌకసు ।
సమస్త సిద్ధసంసేవ్యా సా దేవీ పరమేశ్వరీ ।

ఓ మునిశ్రేష్ఠుఁడా! దుష్టభావులును, దేవతలు సైతము ఏమిటి భయపడుదురో యా దేవశక్తి కృష్ణపింగళ. విశుద్ధమైన యనఁగా పాపాది మలరహితమైన హృదయాకాశము నధివసించి యుండును. సత్యజ్ఞానానందములే యామె లక్షణము. పురుషునియందు నెలకొనియుండి యోగముచల్లనే ప్రకాశించును. సాక్షాత్కృతశక్తిని గోరు యోగులచేత నుపాసింపఁబడు నామెయే పురుషశక్తిస్వరూప. అఖిలేశ్వరియైన యోగదేవి. బ్రహ్మవిష్ణురుద్రేంద్రాదులును దేవతలును సిద్ధులును మహర్షులును దనలోనే యున్న యాపురుషశక్తిని ధ్యానించి స్వస్థానము నొందిరని యనఁగా ముక్తులైరని తెలియును. కావున నీవా దేవినే నేమమున సేవింపుము. పరమేశ్వరియైన యాదేవియే సిద్ధులు సేవింపఁదగినది.'' అని విష్ణు వర్ణించెను. కావునఁ బురుషశక్తిసంపన్నులైన యధికారులే సర్వసమర్థులు. సృష్టిస్థితిలయములను సహితము చేయఁగల్గుదురు. ఆ పురుష శక్తివి నీవే. నీకు నమస్కారము.

భద్రకాళి నమస్తుభ్యం మహాకాళి నమోఽస్తుతే ।
చండి చండే నమస్తుభ్యం తారిణి వరవర్ణిని ॥ 2.

9) భద్రకాళి :- అమ్మా! నీవు శుభములను గలిగించు దానవు. కనుకను, నీవు భద్రకాళివి. నీవే శుద్ధాత్మశక్తి స్వరూపవు. నీవే ప్రవృత్తి నివృత్తి లక్షణమును, సర్వమూలము నైన శుద్ధాత్మవిజ్ఞానము నొసఁగుదానవు. అట్టి శుద్ధాత్మ స్వరూప చిచ్ఛక్తివైన నీవే స్వతంత్రవని యార్యులందురు. అట్టి నిన్ననుస్మరించు నధికారముగల వారలకుఁ బ్రవృత్తినివృత్తి పరమైన విజ్ఞానమునుగూర్చి సర్వభద్రములఁ గలిగించునట్టి యేకత్వలక్షణ (అద్వైతలక్షణము) మనని శుద్ధవిజ్ఞానము ఆత్మస్వరూపమందే పుట్టి వెలయుచున్నది. కనుక భద్రకాళి పేరి శక్తితోఁ గూడికొన్న యధికారులే యెల్లరకు నభ్యుదయము కలిగించువారై సర్వసముద్ధులై వెలయుదురని విశ్వసింపఁ బడినది.

కనుక నే నాశనరహితమైన యాత్మశక్తివి నీవు అమృత బిందువులు అనఁగా నమృతస్వరూప పరమాత్మశక్తితో పీకని చుట్టరికముగల దేవతలు; నిన్ను భద్రనుగా ననఁగా మంగళ స్వరూపనుగా నెఱింగి స్వీకరించిరి. కనుకనే నీవు భద్రకాళి వనఁదగితివి.

కావున నో బ్రాహ్మణుఁడా! త్ర్యక్షరాత్మకమైన భద్ర కాళీవిద్య నుపాసింపుము. అని యథర్వశ్రుతి యుపదేశించినది.

అమ్మా! యోగదేవివైన నీ భద్రకాళీస్వరూప ముపాసింపఁ బడినది.

'భద్రకాళ్యైచ విద్మహే, సర్వసిద్ధించ ధీమహి సానో దేవీ ప్రచోదయాత్" ఆశ్రుతియందే భద్రకాళీదేవి యొక్క గాయత్రీస్వరూపము చెప్పఁబడినది. మఱియు "భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః, భద్రం పశ్యేమాక్షభి ర్యజత్రాః" అమ్మా! నీవు చెవులను మాకిచ్చినందులకు భద్ర (పరమాత్మ) స్వరూపమైన నిన్ను గూర్చియే మాటిమాటికి విందుము. మా సర్వేంద్రియములతో నిన్నే పూజింతుము. అనఁగా నీవే సర్వేంద్రియశక్తిస్వరూపవై యున్నదానవని యెఱింగి నిన్నే మాలోఁ గనుచుందుము; అని తైత్తిరీయారణ్యకము నిన్నే స్తుతించినది. మఱియు-

"తాం భద్రకాళీం తపసా జ్వలంతీం
మహేశ్వరీం శుద్ధమహాప్రతిష్ఠాం ।
శుద్ధాత్మకల్యాణగుణస్వభావాం
వందే సదా చేతసా భద్రకాళీమ్".

"తన తపస్సుచేఁ (జ్ఞానస్వరూపముతో) ప్రకాశించునట్టియు, మహేశ్వరశక్తియైనట్టియు, శుద్ధబుద్ధిస్వరూపమునఁ బ్రతిష్ఠితయైనట్టియు, సత్యజ్ఞానానందములనెడి శుద్ధాత్మస్వరూపమైన కళ్యాణగుణములే రూపముగాఁ గలట్టియు, భద్రకాళినే యెల్లప్పుడు మా మనసులో మ్రొక్కుదుము". (అనఁగా మనసార సేవింతుము.) మఱియు-

భద్రాసనస్థాం పరమాం, పవిత్రాం
భద్రార్చితాం శంఖచక్రాది యుక్తాం ।
రుద్రాక్షమాలాం, గగనే నటం తాం
వందే సదా చేతసా భద్రకాళీమ్ ।

మంగళకరమైన యోగాసనమందుఁ గూర్చున్నట్టియుఁ (సహస్రారమే యీ భద్రాసనము) సర్వశ్రేష్ఠ (పరం మాతీతి-పరమా = మోక్షమును గలిగించునది) ఎట్టి మాలిన్యములు లేనట్టియు, పవేఃస్త్రాయతే ఇతి-పవిత్రా = వజ్రాయుధమువలనఁ గాపాడునది యనఁగా మృత్యుభయము లేకుండఁ జేయునది, యనఁగా జననమరణరూప సంసారభయమును బోఁగొట్టునది, (మోక్షప్రదాత్రి యని భావము) జ్ఞానులచేతఁ బూజింపఁ బడునదియు, శంఖచక్రములు ధరించునట్టియు, (అనఁగా నాద స్వరూపిణి తానే యనియు, సర్వదా వర్తమానకాలచక్రము తన స్వరూపమనియు సంసారచక్రమును నడుపుచున్నది తానే యనియుఁ దెల్పుటకే యీ వర్ణనము) రుద్రాక్ష పూసలపేరు దాల్చునదియు, అనఁగాఁ దన్నుగూర్చి మంత్రజపము చేయు వారికి జపఫలము నిచ్చునదియుఁ, బరమార్థ మేమనఁగా అక్ష మాలా - అకారాది క్షకారాంతమైన మాతృకావర్ణస్వరూపము తనదే యనియు, వనఁగా సర్వసారస్వతము తనస్వరూపమే యనియు, దెలుపుచున్నదని భావము. ఆకాశమందుఁ బండు లాడుచున్నది తానేయనియు, అనఁగా చిదాకాశమందు సదా వెలయుచున్నది తానే యనియుఁ, దెల్పుచున్న భద్రకాళిని సంతతము మనసార సేవింతును. అని యీవిధముగా వర్ణిం శ్రుతియుందే సిద్ధాంతరూపస్తుతి కానఁబడుచున్నది. కనుకనే భద్రకాళీపరశక్తిసంపద గల యధికారులే సర్వజగదభ్యుదయమును గోరు వారును సర్వరక్షకులును గాఁగలరని సిద్ధాంతము, భద్రకాళ్యక్షరమంత్రము :- క్రీం హూం హ్రీం.

10. మహాకాళి :– అమ్మా! మహాకాలనామప్రసిద్ధుఁడైన పరమశివుని శక్తివి. దక్షిణోత్తరగతులతోఁ బరిభ్రమించుచు సర్వబ్రహ్మాండ సంసారమునకు నాదికారణమైన కాలచక్రమును గాలము నతిక్రమింపక యధికారము నతిక్రమింపక యనఁగా విశృంఖలముగాక కట్టుబాటులతోఁ బరిభ్రమింపఁజేయు బ్రహ్మశక్తియే స్వరూపముగాఁగల మహాకాళుఁ డనెడి యోగ నారాయణశక్తి స్వరూపిణివై, యఖండాకారవై, యన్నిటి లోవెలుపలను వ్యాపించియున్న దానవని నీవే వర్ణింపఁబడు చున్నావు. కావున నిన్ననుస్మరించు నధికారుల సర్వధర్మముల నుపసంహరింప హేతువైన యోగాత్మశక్తివి నీవేయై పెంపొంది వెలయుచుందువని తెలియుచున్నది.

కావున నేకాత్మశక్తిసంపన్నులైన వారలే సర్వసమర్థులును, సర్వజ్ఞులును, సర్వోత్తములును, యోగసిద్ధులును, నగుచున్నారని యార్యసిద్ధాంతము. కావుననే యీకాళి యజ్ఞేయయు, ననంతయు, నలక్ష్యయు, నజయు, నేకయు నని దేవ్యుపనిషత్తు నిన్నే వర్ణించినది.

కావునఁ దురీయాత్మశక్తివైన నీవే మహాకాళివి, మహామాయవు, యోగేశ్వరి వని నిన్ను శ్రుతులు గానము చేసినవి. అట్టి నిన్నుపాసించువాఁడు సర్వత్ర విజయము నొందును. బ్రహ్మసాయుజ్యముక్తి నొందు ననియు నథర్వశ్రుతియే స్తుతించినది. కనుక మహాకాళి పేరి యాత్మశక్తివైన నిన్నుపాసించు

నధికారముగల వారలు సర్వస్వతంత్రులును, విజయులు నగు చున్నారు. అట్టి నీకు నమస్కారము.

11 చండి :- అమ్మా! నీవు చండివి. కోపస్వభావవు, సర్వశత్రువులకు భయమును గలిగించు కోపమే లక్షణముగాఁ గలదానవై సర్వకర్మవ్యవసాయమును నడుపునట్టి యాత్మ నియతశక్తివై గుణమయివై వెలయుదువు. అమ్మా! లోక కంటకులైన మధుకైటభులనెడి రాక్షసులను జంపితివి వీరే పరమార్థముచే నీ యాశ్రితపక్షమున బహుత్వవాంఛ, బహు త్వానంద మనెడి యాసురభావములు. వీనిని నశింపఁజేసియే బ్రహ్మగ్రంథిభేద మొనర్చి స్వస్వరూప సత్యప్రతిష్ఠితులను జేసి కామ్యకర్మఫలనాశ మొనర్చెదవు. మహిషాసురుని వధించితివి. స్వాశ్రిత రక్షణపక్షమునఁ బరమార్థముచే నయ్యసురుఁడే రజోగుణము. స్వాశ్రితుల రజోగుణము నడంచి స్వస్వరూప చైతన్యమందుఁ బ్రతిష్ఠితులను జేసి విష్ణుగ్రంథిభేద మొనరించి సంచితకర్మఫలనాశ మొనర్చెదవు. అమ్మా! శుంభనిశుంభా సురులను మట్టుపెట్టితివి. స్వాశ్రితపక్షమునఁ బరమార్థముచే వీరే యస్మితా-(విజ్ఞానమయకోశము నంటిన యహంకారము) మమత (మమకారము) నడంచి స్వస్వరూపానందప్రతిష్ఠితులను జేసి రుద్రగ్రంథిభేద మొనర్చి ప్రారబ్ధకర్మఫలనాశ మొనర్చెదవు. ఈ విధముగా స్వాశ్రితరక్షణవిషయమున నీ కాంతా, కరుణా సాగరాది నామములు సార్థకములైనను లోకరక్షణపక్షమున బాహ్యశత్రువులను బరిమార్చునపుడు నీవు నిజముగాఁ జండివే.

అంతేకాదు, నీ యాజ్ఞలను పాలించు దిక్పాలకాదులెల్లరును నీ చండతకు వెఱచియే తమతమ నియతవ్యవసాయముల నాదిష్ట ప్రకారమున జరుపుచున్నారు. కావునను నీవు చండివి. కృపయు, నిష్ఠురతయు విరుద్ధభావములైనను స్వాశ్రితపక్షమునఁ గృపయు, శత్రుపక్షమున నిష్ఠురతయు, మహాదేవివైన నీవొక్కతెయందే తోఁచుచున్నది. ఇట్టి నీకు నమస్కారము.

12. చండే:- అమ్మా! నీవు చండవు. చమూన్ డాతీతి-చండా. అమ్మా! పరమాత్మా! నీకు సృష్టిసంకల్పము కలుగఁగానే యనఁగా బహుస్యాంధ కలుగఁగానే మహిమసాగరవైన నీయందు, మహాసాగరమందు వలలు, బుడగలు, నురుగులు, తుంపురులు పొడమునట్లు శివాదిక్షితిపర్యంతమైన ముప్పది యాఱుతత్త్వములు పొడమినవి. అదియే నీచమువు-సేన. దాని వైచిత్ర్యమే విశ్వనామముతో వెలయుచున్నది. ఈ నీ సేన విశ్వవ్యాప్తము. విశ్వేశ్వరి! నీవు విశ్వేశ్వరవు. ఇది నీ ప్రపంచలాస్యవినోదఫలము. ఆనందసాగరవైన నీయందు ద్వితీయస్పందనము కాఁగానే నీసేనయైన యాశివాది తత్త్వసంఘాతము నుపసంహరించుకొందువు. అనఁగా నీలోనికే యీడ్చుకొందువు. అమ్మా! సృష్టిస్థితిలయ తిరోధానానుగ్రహము లనెడి ప్రకృష్టకృత్యులను జేయుచు ననఁగాఁ బ్రకృతి పరవై, గుణమయివై, యనఁగా సత్త్వరజస్తమస్సు లనెడి మూఁడవస్థలే స్వరూపముగా వెలయుదువు అంతేగాదు, యథార్థముగా నాయవస్థలఁగాఁగిపోయినవుడు నీవే ప్రకృతికంటెఁ

బరవు. పరబ్రహ్మ పరమాత్మస్వరూపిణివి. అట్టి నీకు నమస్కారము.

13. తారిణీ:- అమ్మా! నీవు తారిణివి. నీభక్తుల సర్వాపదలను దాటింతువు. కావునఁ దారిణివి. మఱియు నీయాశ్రితులను దాటరాని భవసాగరమునే దాటింతువు. కావుననుఁ దారిణివి. దశమహావిద్యాస్వరూపము నీదేయైనను నీతారణశక్తియే సర్వాపేక్షణీయము. మాకుఁ గమనీయము. అమ్మా! నీవు గుణమయవు. సత్త్వరజస్తమస్సు లనెడి మూఁడుగుణముల (అవస్థల) నాశ్రయించియే నీ యీ త్రివిధ స్పందనమున్నది. లేదా స్వేచ్ఛాకృతములైన యీ నీ త్రిశక్తులే త్రిగుణముల నెడి పేరఁ బ్రసిద్ధములు. ఇమ్మూఁడుగుణములు నీయాశ్రయము చేఁ బ్రకాశించునవగుటను, నీవే గుణమయివి. ఈ గుణమయావస్థనుండి మమ్ములను దప్పించి నీవు సనాతనస్వరూపమందు నీసృష్టిస్థితిప్రలయము లనెడి మూఁడు సుడులు లేని చోటికిం దీసికొని పొమ్ము. అదియే నీతారిణీశక్తి. అట్టి నీకు నమస్కారము. అమ్మా! నీవే యాత్మగానుండి సకలకర్మవ్యవహారములను నడుపుదువు. అపుడే నీవు గుణమయివి. నీకు నమస్కారము.

14. వరవర్ణిని :- అమ్మా! నీవు వరవర్ణినివి. శ్రేష్ఠమైన వ్రతము గలదానవు. నీ వ్రతము భక్తరక్షణము. ధర్మసంస్థాపనము. పైని జెప్పిన నీ గుణమయావస్థయే నీ క్రియాశక్తి స్వరూపము. శుద్ధాత్మ. స్వరూపమున నుండి నీవే నీ శుద్ధాత్మ స్వరూపమందే నీ క్రియాశక్తి స్వరూపము నిల్పియున్నది.

మఱియు అదిక్షాంత మాతృకావర్ణములు నీ స్వరూపమే కావున నీవు వరవర్ణినివి. శ్రేష్ఠ జ్ఞానమే నీ స్వరూపము కావునను నీవు వరవర్ణినివి. అట్టి నీకు నమస్కారము.

కాత్యాయని మహాభాగే కరాలి విజయే జయే ।
శిఖిపింఛధ్వజధరే నానాభరణభూషితే ॥ 3

15. కాత్యాయని:- అమ్మా! నీవు కాత్యాయనివి. కత్యులనఁగా బ్రహ్మవేత్తలు. వారిలో నీవు నెలకొనియుండువు గావునఁ గాత్యాయనివి. నీవు రజస్తమస్సంపర్కము లేని సాత్త్వికబుద్ధులయందే నిలిచి సాత్త్వికప్రవృత్తులయందే స్తోత్రమంత్రబీజ జపహోమాది క్రియాలక్షణనై; శుద్ధమై తత్స్వరూపనియతమైన క్రియాశక్తివై వెలయుదువు. అట్లే యనఁగాఁ గత్యులనఁగ సత్త్వగుణప్రధానులు స్తోత్రమంత్రజపాదు లనెడి యధ్యయనమందుఁ గృతార్థు లగుదురు. కావున నీవు కాత్యాయనివి. నిరంతరవ్యాప్తిచేఁ బకికి లోఁబడని స్వాతంత్ర్యము గలదానవు కావునను నీవు కాత్యాయనివి. అట్టి నీకు నమస్కారము.

16. మహాభాగే:- అమ్మా! నీవు మహాభాగవు. భగమే భాగము. సర్వజ్ఞత్వ, నిత్యతృప్తిత్వ, అనాదిబోధత్వ, స్వతంత్రత్వ, అలుప్తత్వ, అనంతత్వము లనెడి గుణషట్కమునే భగమందురు. అసాధారణమైన యీ భగము (భాగము) నీసొమ్ము. కనుక నీవు మహాభాగవు. ఇంకను మహాచ్ఛబ్దము చేఁ

ప్రథితమగు బ్రహ్మముయొక్క యంశము (భాగము) నీది కనుక నీవు మహాభాగవు. మహాభాగః = ఐశ్వర్యము, ధర్మము, కీర్తి, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము, అనువాని సముదాయమునకు భగమని పేరు. భగసంబంధమైనది భాగము. భాగమే భాగ్యము. అసాధారణభాగము కలదానవు కనుక మహాభాగవు. మఱియు నీవు అధిష్ఠాన, అనుష్ఠాన, అవస్థాన నామరూపములయందు బ్రహ్మసమ్మితవు. కనుక మహాభాగవు. అనఁగా బ్రహ్మభాగవు. కనుక నీవు పరమాత్మభావముతో నున్న నీవే గుణమయివై సర్వవ్యాపినివై క్రియాపరవైన యాత్మశక్తివి, అట్టి నీకు నమస్కారము.

17. కరాలీ:- అమ్మా! నీవు కరాలివి. శత్రువులకు భయమును గలిగించుదానవు. నిన్నాశ్రయించువారి నిల్లప్పును పీడించు కామాదిశత్రువులకు భయమును గలిగించుదానవు. అనఁగా నంతః శత్రువులైన కామాదులు నీయాశ్రితులను దేరి చూడఁజాలరని భావము. అంతఃశత్రువులే కానిమ్ము, బహిః శత్రువులే కానిమ్ము వారి వినాశకాలమును సూచించు ప్రకృతి రూపమున నిలిచి గుణమయివై నీవే క్రియాశక్తిరూపమున శత్రువులకు భయమును గలిగింతువు. అట్టి నీకు నమస్కారము.

18. విజయా:- అమ్మా! నీవు విజయవు. సర్వత్ర విశేషించి జయము నొందుదానవు. కనుక విజయవు. విశిష్టమైన జయమే యనఁగా "ఓంకారమే" స్వరూపముగాఁ గలదానవు కనుకను విజయవు. నీ నిరంజనస్వరూపమందు విజయానామము నీకే

చెల్లును. నిన్నుపాసించు వారికస్త్రశస్త్రప్రయోగచాతుర్యము నిచ్చి విజయము కలిగించుదానవు. మానవహృదయము నెడి కురుక్షేత్రమందు నిరంతరము జరుగుచుండు దేవాసురయుద్ధమున ననఁగా నాసురీదైవీసంపదలకు జరుగుచుండు సంగరమందు దైవీసంపదకే జయము నిచ్చుదానవు. కనుకను నీవు విజయవు. నిన్నుపాసించు భక్తులను దైవీసంపద్విశిష్టులను చేయుదువు. ఆ విధముగా నాసురీసంస్కారముల నణఁపఁగల భక్తిజ్ఞానవైరాగ్యము లనెడి యస్త్రశస్త్రములఁ బ్రయోగింపఁగల చాతుర్యమును నీభక్తులలోఁ బెంచి విజయులను జేసెదవు. కావునను నీవు విజయవు. ధర్మసంస్థాపనముకొఱకుఁ బ్రత్యేకయుగమందు నవతరించి గుణమయివై సంసారకర్మవ్యవసాయనాయికవై నీయవతారకార్యము ముగియఁగానే మఱల నీ నిర్గుణనిరంజన స్వరూపముతో నిలుతువు. అప్పుడు నీవు విజయవు. అట్టి నీకు నమస్కారము.

19. జయే :- అమ్మా ! నీవు జయవు. నిన్నుపాసించు నధికారులకుఁ బ్రారబ్ధవశమున నైన సంసారవ్యవసాయమును బూర్తి చేయుదానవును, ఆవ్యవసాయమును విడిపించుదానవును ననఁగా మోక్షప్రదమగు సన్న్యాసయోగమును నీవే సర్వోత్కృష్టవై ప్రసాదించుదానవు. వేదస్మృతిరాశి స్వరూపిణి వగుటచేత నోపాసకులకు ముక్తికారణమైన యాత్మజ్ఞానమును బ్రసాదించి సంసార కర్మవ్యవసాయ సన్న్యాసమును జేయింతువు. అట్టి నీకు నమస్కారము.

20. శిఖిపింఛధ్వజధరే:- అమ్మా! నీవు నెమ్మిపింఛెమును ధ్వజముగాఁ దాల్చినదానవు. నీ యీ వేషాభినయము విచిత్ర భావగంభీరత గలది. ఐంద్రజాలికుఁడు నెమలిపింఛమును జూపి జగత్తును మోహపెట్టును. ఆమోహనవిద్య నీ సృష్టిసంకల్పము తోనె వికసించినది. నీకు బహుత్వవాంఛ కలుగఁగానే చిత్ర విచిత్రములతోఁ గూడిన నామరూప క్రియాగుణాత్మక వస్తుజాల రూపజగత్తుగా నెలసి దానిని నీవే మోహపెట్టుచున్నావు, ధ్వజముగా ధరించిన శిఖిపింఛము దేశకాలకలనావైచిత్ర్య ముతోఁ జిత్రీకృతమైన జగదాకారముతో నీవే యున్నావని తెల్పుటే కాక నీ బహుత్వప్రదర్శనముచే నాజగత్తును నీవే మోహపెట్టుచున్నావనియుఁ దెలుపును. మఱియు నైంద్రజాలి కుఁడు తన మాయాశక్తిచేత మున్ను లేని విచిత్రవస్తువులను బ్రదర్శించి మఱలఁ దనచేతి నెమలికుంచెను జూపి యాడించి తను ప్రదర్శించిన యావిచిత్రవస్తువులనుఁ గానరాకుండఁ జేయు నట్లు స్వేచ్ఛతోఁ జిత్రజగత్తును గనుమఱగింతువు. ఇంద్రజాల విద్యాధికారిణివై జగత్సృష్టిస్థితిలయములను జేయుదానవు నీవే యని నీ యీ వేషాభినయముచే మాకుఁ దోఁచుచున్నది. అమ్మా! నీకు నమస్కారము.

21. నానాభరణభూషితే:- అమ్మా! నీవు పలుతెగల నగ లతో నలంకరింపఁ బడినదానవు. నామరూపములు లేక సత్య జ్ఞానానందములే స్వరూపముగాఁగల బ్రహ్మవస్తువునకు సర్వావ యవసంపన్నమై నామరూపవిశిష్టమైన యొక మూర్తిని

గల్పించి, యా మూర్తిగతవిశేషములతోఁ బరమాత్మయొక్క-
పారమ్యమహిమ, జీవదయాళుత్వ, భక్తరక్షణ పరత్వాదులైన
సర్వజన కమనీయములైన విభూతివిశేషములను చెప్పఁగోరి
యామూర్తిని నానాభరణములతో నలంకరించినట్లు వర్ణించుట
సాధకోత్తమసమయము. ఆ నానాభరణములే దేవతావిభూ-
తులు. ఏదేవత పేరు యేయే విచిత్రాభరణములతో నలంకరించి
నటులు ప్రవర్ణించినను నవి యాదేవతావిభూతులే. ఆవిభూతు
లన్నియు సకలదేవతాస్వరూపిణివైన నీవియే యని మేము
తెల్పుకొనుచున్నాము. విభూతిమయీ! నీకు నమస్కారము.

అట్టశూలప్రహరణే ఖడ్గఖేటకధారిణి ।
గోపేంద్రస్యానుజే జ్యేష్ఠే నందగోపకులోద్భవే ॥ ౪

22 :- అట్టశూలప్రహరణే :- అమ్మా! నీవు త్రిశూల
మాయుధముగాఁ గలదానవు. దీనిచే నీతత్త్వమును, నీభక్త
రక్షణదీక్షయు మాకెంతో స్ఫురించుచున్నది. త్రిశూలము-
ఒక్కటే. కాండమును (కాడయు) దానితో భిన్నముకాక
వెలయు మూఁడు మొనలును గల శూలాయుధము. సాధకుఁడు
తన సాధనమందెంత యారితేరినను నింతో యంతో మిగిలి
యుండు నస్త్రితమనశలు నశింపకున్నచో వానికి ముక్తి లేదు.
వాని త్రిపుటీజ్ఞానము బొత్తిగా నశింపలేదను మాటయే. అదే
పరమశత్రువు. ఆ శత్రువును గూల్చునది నీధరించు త్రిశూలా
యుధమే. స్తోతృ, స్తుత్య, స్తుతులు, జ్ఞాతృ, జ్ఞేయ, జ్ఞానములు,

అనుచు మూఁడు మూఁడుగాఁ దోఁచుచున్నది యొక్క బ్రహ్మ వస్తువే యనియు తెలివిలేక మూఁటిని వేర్వేఱను తెలివియే త్రిపుటీజ్ఞానము. ఇది నశించి, బ్రహ్మస్వరూపదుర్గాంబయే యొక్క కాండమునుండి వికసించిన మూఁడు సెలలవలెఁ త్రిపుటి ధీరాకారమునఁ దోఁచినప్పుడు స్తోత్ర స్తుత్య స్తుతులు వేఱు కావు. పరమాత్మస్వరూపమే యనియు నిశ్చయజ్ఞానము కలిగినప్పుడు పరశ్వ నిశ్చయత్వమునకు వచ్చి సాధకుఁడు ముక్తుఁడగును. ఇదే నీచేతి యట్టెరాల ప్రకారణరహస్య మని మాకు స్ఫురింపఁజేసిన నీకు నమస్కారము.

63. ఖడ్గఖేటకధారిణి :— అమ్మా! నీవు కత్తిని డాలును ధరించితివి. అవి శత్రువులకెంత భయంకరములో మాకంత సుఖకరములు. ఖడ్గము పదును, తెగనఱుకుట. ఎడమచేత ధరించిన డాలు నలుముఖములఁ ద్రిప్పఁబడినప్పుడు దాని కమర్చఁబడిన చంద్రకము లనియు కాంతిమద్వస్తువులు శత్రువుల కనులకు మిఱుమిట్లు గొలుపుచేతఁ దమ కర్తవ్యము నూహింపలేక భయపడుదురు. అది సహాయము.

ఈరెండును మాకు సుఖకరములే. యుగయుగాంతరములనుండి, జన్మజన్మాంతరములనుండి మమ్ములను పీడించుచున్న దేహాత్మబుద్ధి (నే ననినంత నశ్వరభౌతిక దేహమే స్ఫురించుట) సుఖప్రదమగు నీకటాక్షప్రసారము చేతనే ఖండింపఁబడును. పాపరాశికి మూలమైన యీ యనాత్మజ్ఞానము తెగిపోవుటకంటె సుఖమేమున్నది! అనాత్మజ్ఞానము తొలఁగినను విక్షేపావరణ

శస్త్రములనెడి శత్రువులు సమ్ముఖులై పోనటకే చూచుచుందువు, నీచేతి వాలు ఆశత్రువుల నిరువురిని దరికి రాకుండఁ జేయును. ఖేటకగత చంద్రకములనుండి వెలువడు కాంతులు శత్రువులకు దుఃఖకరములైనను మాకొక నవి నీకటాక్షప్రసారములే. ఈవిధముగా నాత్మస్వరూప నియతక్రియాశక్తిరూపిణివై భక్తుల నేలు తల్లీ! నీకు నమస్కారము.

24. గోపేంద్రస్యానుజే :- అమ్మా! నీవు గోపేంద్రుని యనుజవు. ఈమాట విన్నంతనే యొక్కసారి గా యింద్రియ చాంచల్యము తొలఁగి నీపరాశక్తిస్వరూపమే మాలో స్ఫురించును. గా॥ ఇంద్రియములను బరిపాలించువారు గోవులు, జ్ఞానమును బరిపాలించువారు గోవులు- జీవాత్మలు. ఇంద్రుఁడు సర్వైశ్వర్యసంపన్నుఁడు. అనఁగా సర్వశక్తిసంపన్నుఁడు. గోవులఁ బాలించువాఁడు (ప్రభువు) పరమాత్మ. అతని యనుజవు. అతనితో నెడములేక యే పుట్టియాతని సహచరివై యుండి ప్రకృష్టమైన యనఁగా ననన్యసాధ్యములైన సృష్టిస్థితి లయ తిరోధానానుగ్రహములనెడి కృత్యులు చేయుచుండుటచేఁ బ్రకృతి పేర వెలయుదువు. కనుకనే నీవు దేవివి స్వయంప్రకాశ శీలవు. క్రీడనశీలవు. సర్వజగదభ్యుదయమునే చేయుచుందువు. నిత్యానంద శాంతాస్వరూపిణివైన నీయందు ద్యోతనక్రీడన వాంఛ యనెడి సంకల్పము కలుగఁగానే నీవు గుణమయివి. రజోగుణప్రధానక్రియాశక్తివైన నీకు నమస్కారము.

25, జ్యేష్ఠే :- జగజ్జననీ! నీవు సర్వశ్రేష్ఠవు సర్వశత్రు వినాశనమునకు హేతుభూతమైన కర్మవ్యవసాయమునందు నధికారము గల ప్రకృతిస్వరూపిణివైన నీయందు నియుక్తమై యున్న ఘోరాకారముగల సత్త్వగర్భరజోగుణప్రధాన క్రియాశక్తి వని మాకుఁ దెలిసినది. కావున మాబాహ్యశత్రువులను, నంతఃశత్రువులైన కామాదులను నశింపఁజేయు సంహారమే కాక సత్త్వగర్భతామసీమూర్తివి కనుక సత్త్వగుణప్రాధాన్యముచే జ్యేష్ఠానామమున సౌమ్యస్థితిశక్తివియు నీవెయై జగదభ్యుదయమునకే చూచుచుందువు. అమ్మా! నీకు నమస్కారము.

26. నందగోపకులోద్భవే :- అమ్మా! నందగోపకులమందుఁబుట్టి యందు సుస్థిరముగా నిలచుదానవు. నీకు నమస్కారము. తల్లీ! ఇందు గర్భితమైయున్న నీతత్త్వము మాలో స్ఫురించినపుడు యథార్థముగా నానందమయులమగుదుము. నందుఁడైన యనఁగా నానందస్వరూపుఁడైన పరమాత్మయొక్క లక్షణమే తానైన, గో=ప్రజ్ఞను పాలించు వారు—నందగోపులు, వారికులమందు సముదాయమందు వెలయు దానవు కనుక నందగోపకులోద్భవవు బ్రహ్మస్వరూపప్రజ్ఞ నారాధించు యోగుల కులమందుందు దానవు. కులమనఁగా సుషుమ్నామార్గము. కావున మూలాధారాది సహస్రారాంతమైన సుషుమ్నాపథమందు సంచరించుదానవు. మఱియు యోగశాస్త్రమందుఁ గొన్నిచోట్లఁ గులమనగా హృదయపద్మమని కానవచ్చును. కావున నదియే నీయుద్భవస్థానమని (యుద్భవ

స్థానమునఁగా నీవు చివరకు నిలిచియుండు స్థానమని) మాఱుఁ డోచును.

కావునఁ బరాపరసంకల్పములు అనఁగాఁ బెద్దల విన్న కోర్కుల రూపమున నుదయించు ప్రకృతిస్వరూపమున నుండు దానవు. ఆయా సంకల్పములకు ననురూపమైన యానందమును గలిగించు కర్మవ్యవసాయమును జేయించు దానవనియు, నానందగుణమయివై కామామలతోఁగూడిన యానందగుణ మయు పరాశక్తివనియుఁ బెద్దలచే వర్ణింపఁబడిన నీకు నమస్కారము. (దుర్గాంబయొక్క పంచకోశగుణోద్భవమును గూర్చిన కథాసందర్భమున నా సాధనసామగ్రి నాలవమాట యందలి శుంభవధానంతరము దేవకృత దేవీస్తుతి (నారాయణీస్తుతి) శ్లో॥ 37-38 విపులవ్యాఖ్యను ఉపాసకులు చూడఁదగును.)

మహిషాసృక్ప్రియే నిత్యం కౌశికి పీతవాసిని ।
అట్టహాసే కోకముఖే నమస్తేఽస్తు రణప్రియే ॥ ౯

27. మహిషాసృక్ప్రియే :- మహిషాసురరక్తపానమందు ఆసక్తవు. అమ్మా! నీయానామము విన్నంతనే మాలో మాటిమాటికి నుదయించు రజోగుణము నశించి మా సంచిత కర్మనాశనమైనట్లే భావించి మురిసియుందుము. మహిషుఁడు రజోగుణము. అమ్మా! దానివలనఁబుట్టు సంస్కారము లన్నియు నాసురములే. వాని నణఁగించి భక్తుల నేలు నని నీవు రజోగుణములను దునుముట్ట నణఁగింతువు అనుటయే రక్తపాన

త్రియత్వముగాఁ జెప్పఁబడినది. దీనివలన ఈ నీప్రకృతిస్వరూపము తమఃప్రధానము, సత్త్వగర్భముగాను దోఁచును. కావున నియతముగా నీవు చేయఁదగిన సంహారకర్మవ్యవసాయమునం దధికారిణివై భక్తరక్షణమునకై రజోగుణ సముద్భవాసురీ సంపదను మొదలంట సంహరింతువని నమ్ముచున్నాము. ఇదియే నీవు పీకులలో నుదయించి శత్రుసంహార సామర్థ్యరూపమున నొప్పు ప్రకృతివై క్రియాశక్తిరూపమున వెలయుదువు. అమ్మా! నీకు నమస్కారము. (నా సాధనసామగ్రి రెండవ మాట యందు మహిమతత్త్వముఁ గూర్చిన విపులవివరణమును జాతకలు చూడఁదగును).

28. కౌశికి :- అమ్మా! నీవు కౌశికివి. ఈనీపేరు స్మరించినంతనే మాకు నీగొప్పతనము నాల్గువిధములుగా స్ఫురించును. కౌశికుఁడనఁగా నింద్రుఁడు. ఇంద్రుఁడు సర్వైశ్వర్య (సర్వసామర్థ్య) సంపన్నుఁడు. అతని శక్తివి నీవు గావున నీవు కౌశికివి. ఇంద్రుఁడు పరమేశ్వరుఁడు తదభిన్నవైన నీవు పరమేశ్వరివి. మఱియు జ్ఞానాకాశనియతవై యుండి తన తేజస్సుచేత సమస్తమును సర్వమును భస్మము చేయునట్టి దివ్యప్రకృతి యందు నిష్ఠితమైన విశుద్ధరజోగుణప్రధాన క్రియాశక్తివి. మఱియుఁ గౌశికుఁడు పాములను బట్టుకొని యాడించువాఁడు. తచ్ఛక్తి కౌశికి. బ్రహ్మాండ పిండాండములయందు వ్యాపించి యున్న సమష్టివ్యష్టిరూపకుండలినీ పరాశక్తివైన నీవే యసంఖ్యా వివిధశక్తిరూపమున వెలసి యాశక్తివిశేషములచే నన్నేని

చింతనములను జేయుచుంటివి. కావున నీవు కౌశికివి. మఱియు నీవాకారము గౌరీశరీర కోశమునుండి పొందిన కౌశికీ కాత్యాయని నామములతో వెలసి సింహవాహనవై హిమగిరిప్రాంతముల సంచరించుచు నీ తేజముచే లోకులను మోహపెట్టుచుండినప్పుడు నీయొక్క సౌందర్య పరాక్రమాది విశేషములను విని నిన్ను బలాత్కారముగ వివాహింపఁగోరి వచ్చిన శుంభనిశుంభులను దమియించితివి. ఈవిధముగా నీ దివ్యప్రకృతి నీయొక్క క్రియాశక్తి స్వరూపమునఁ బ్రకాశించు నీకు నమస్కారము. (శ్రీమార్కండేయమున నా పాఠసామగ్రి మూఁడవ మూర్తి యందుఁగల విశేషవివరణమును జనులు చూడఁదగును.)

29. పీతవాసిని :- అమ్మా! నీవు పీతవాసినివి. పీతవాసస్సును పచ్చని వస్త్రమును ధరించినవాఁడు విష్ణువు. ఆతని శక్తి పీతవాసిని. విష్ణువు అసజ్జనులను (దుష్టసంస్కారములను) సంహరించు వాఁడు. సత్త్వగుణప్రధాన విష్ణుశక్తివై యుపాసకుల దుస్సంస్కారములను సంహరించి సాధులోకమునకుఁ ప్రాణము నొసంగు దానవు కావున నీవు నిజోద్రిక్తసత్త్వగుణప్రధాన క్రియాశక్తివి. అట్టి నీకు నమస్కారము.

30. అట్టహాసీ:- అమ్మా! నీవట్టహాసము చేయుదువట, అతిశయధ్వనితోఁ గూడిన యా నీనవ్వు సంతోషమే లక్షణముగాఁగల నీచిత్ప్రభచే అసత్పురుషులకు భయమును గలిగించునదే. నీభర్తగా మాచే గారవింపఁబడు శివుఁడు నీకభిన్నుఁడు. నతఁ డెంత నుండుకొని సృష్టిసంకల్పము నుపసంహ

ించు కాలమువేళ నీయట్టహాసమును జేయుచున్నదియు నొక విధమైన యానందస్పందనమే కావునఁ దాండవించును. ఆనంద స్పందన స్థూలలక్షణము హాసము. లయవేళ నగు స్థూలలక్షణము, అట్టహాసము. సదా మరణభీతిజుష్టులైన యసజ్జనులకు నది భయంకరమే.

అమ్మా! నాఁడు నీవు నీయట్టహాసముతోనే శత్రువులను భయపెట్టి పఱఁగొట్టి భక్షించితివి.

“చండాట్టహాసై రసురాః శివదూత్యభిదూషితాః ।
పేతుః పృథివ్యాం పతితాం స్తాంశ్చఖాదాథ సా తదా॥

(దేవీమాహాత్మ్యము-సప్తశతీ-అష్టమాధ్యాయము.)

31. కోశముఖే :- అమ్మా! నీవు కోశముఖివు. కోశ శబ్దము విష్ణునామములలో నొకటి. ముఖమనఁగా విజ్ఞానము. వైష్ణవవిజ్ఞానము గలది. విష్ణువు సర్వజగద్వ్యాపకుఁడు. నీవు సర్వజగద్వ్యాపినివైన వైష్ణవశక్తివి. కాఁగా సర్వజనసర్వార్థ సాధనస్థితిశక్తి స్వరూప మహాప్రవృత్తి నియుతయైన శుద్ధసాత్త్విక క్రియాశక్తివి.

32. రణప్రియే :- అమ్మా! నీవు యుద్ధప్రియవఁట. సహజవిరోధులైన యాసురభావములకును, దైవభావములకును మాత్రమే యుద్ధము సంఘటిల్లుచుండును. ఈరెండిఁటి పుట్టుచోటొక్కటియే అది మనస్సు. అది నీవే. “ఇంద్రియాణాం మనశ్చాస్మి” అని నీవే కదా గీతావిభూతి యోగపాఠమందుఁ

చెప్పికొంటివి. ఈరెండు భావముల రూపమైన రెండుప్రకృతు లుగా (అసురీ-దైవీ) నీవే జీవులయందు వెలసి రణము సాగించు చుందువు. ఇది నీయాట ఈ నాటకము నీవు సాగింపకున్నచో నీరెండుప్రకృతుల వేషము నీవే వేసుకున్నచో బహుత్వేచ్ఛా మూలకమైన సృష్టికి నాటి బీజములే లేకపోవును. కావున నీ రణప్రియత్వము; సృష్ట్యాది పంచకృత్యములయందైన పరాయణ త్వము. దైవీయాసురీప్రకృతులయందును, నానుకీసంపత్ప్రకృతు లందును ధర్మాధర్మసంకల్పరూపమున నీవే వెలసి తదనురూప కర్మములఁ జేయించి తదనురూప సుఫలదుష్ఫలరూపబీజములను జేసినుంచుకొనియే పునః సృష్టి చేయుచుందువు. కావుననే నిన్నుంచి పెద్దలు చేసిన నామస్తుతులయందు "కారయిత్ర్యై నమః; కర్మసాక్షిణ్యై నమః; కర్మనాశిన్యై నమః; కర్మఫల ప్రదాయిన్యై నమః," (లలితా త్రిశతీనామస్తుతి) అను మాటలు దొరలినవి. జగన్నాటక సూత్రధారిణివైన నీవు నీవన్నిన నాటక మంతయు మమ్ముఁ బాత్రములనుగాఁజేసి యాడించి యానం దింతువు. ఇదే నీరణప్రియత్వము.

మఱియు నీవిరుద్ధ ద్వివిధప్రకృతులచే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుయుత్సులతో సమవేతులనుజేసి యుద్ధనాటక మాడించు నెపమున జీవధర్మములను బోధింతువు. భక్తిజ్ఞాన వైరాగ్యముల రుచిచూపుదువు. నిన్నుపాసించు వివిధమార్గము లందు నడిపింతువు. స్వస్వరూపజ్ఞానమును బెట్టి "ముకుంద" వగుదువు. ఈ నీరణప్రియత్వ తత్త్వము తెలియఁగలవారు

ఈ సృష్టియందు విశేషముగా నున్నారు. జగజ్జననీ! నీకు నమస్కారము.

ఉమే శాకంభరి శ్వేతే కృష్ణే కైటభనాశిని।
హిరణ్యాక్షి విరూపాక్షి సుధూమ్రాక్షి నమోఽస్తుతే॥

33. ఉమే :- అమ్మా! నీవు ప్రణవస్వరూపిణివి. నీవు పర్వతరాట్తనూజవై పార్వతీనామమున వెలసి శివుని బెండ్లాడు కోరికతోఁ జిన్నప్రాయమందే ఘోరతపమూను నప్పుడు నీయుగ్ర తపోవతిక్లేశముఁ జూచి ఓర్వలేని నీజనకులచేఁ దపస్సు వలదని నివారింపఁబడుటకై "ఉ = అమ్మాయీ! మా = వలదు" అని మాటి మాటికి ననుచుండెడి వారు. అప్పుడే నిన్ను నిరుగు పొరుగు వారు "ఉమా" యను నామముతోఁ బిలువఁ జొచ్చిరఁట. అది యథార్థమే కాని శివుఁడొకప్పుడు దేవీ! నాప్రణవము "అ, ఉ, మ" అను సంగములుగల "ఓం", నాకుం గడు ఇష్టమైన నీ "ఉమా" నామమే నీప్రణవము. అదియును "ఉ, మ, ఆ" అను నోంకారాంత వ్యత్యస్తాంగములుగల "ఓంకారమే" యని నను మెప్పించు నెపమున మాకములువిప్పి మీరుపాసించు దుర్గానామములందు "ఉమా" అను దానిని సామాన్యనామముగాఁ గైకొనక ప్రణవమంత్రమేనుఁడీ" యని మాకు బోధించెను. అమ్మా! ఈ నామముతో నిన్నుపాసించు జాపకుల తపశ్శక్తిని బెంచి సర్వేప్సితార్థప్రద నాత్మీయక్రియా శక్తిగా వెలయుచున్న. నీకు నమస్కారము.

34. శాకంభరి :- అమ్మా! నీవు శాకంభరివి. ఈ నీ జీవకరుణాపూర్ణత్వ బోధకమైన నామము మాకెంతో ధీరత గొల్పును. ఒకప్పుడు ద్వాదశవార్షికక్షామము సంభవించి లోకమంతయుఁ బ్రాణశక్తి క్షయమొందు నపుడు నీశక్తిచేతఁ బృథివియందు శాకసమృద్ధి నుత్పాదించి సర్వజీవులను భరించుటచేత నీవు శాకంభరీ నామముతో కీర్తింపఁబడితివి. శుంభాసురాదుల వధానంతరము నిన్ను దేవతలు; స్తుతించినపుడు మెచ్చి నీ భవిష్యదవతారకథనమందు నీ శాకంభరీ నామప్రసిద్ధిని వర్ణించుకొంటివి. నీనోటితోఁ జేసిన యావర్ణనము జీవలోకమునకు ధీరతఁ గొల్పకుండునా! (నా సాధనసామగ్రి 4 మూల చూడుడి) పరమార్థమేమనఁగా దేహశాకాను రూపముగా శాకమును అనఁగా సర్వజీవాత్మసత్త్వమును ధరింతువు. అనఁగా సర్వప్రాణధారిణి ప్రకృతియందు నియతమైన క్రియాశక్తిరూపమున వెలయుచుందువు.

35. శ్వేతే :- అమ్మా! నీ యీ శ్వేతానామము మాకెంతో యాహ్లాదకరము. మా మనస్సులు నీయందే నిలిచి నీయందే వృద్ధిపొందును గావున నీవు శ్వేతవు. విశుద్ధసత్త్వస్వరూపిణివైన నీస్వభావమును శ్రుతులు శ్వేతముగానే వర్ణించినవి. మామనస్సులు నిన్ను పొందునపుడే మాబుద్ధిసత్త్వము వికసించును. అదే నీవు మాకిచ్చు బుద్ధియోగభాగ్యము. తల్లీ దానిని మాకిచ్చి దాని యందు నీస్వరూపమును భాసింపఁ జేయుదువు. నిన్నుపాసించు నధికారులయందు నాత్మస్వరూపనియత పరమసాత్త్విక క్రియాశక్తివై సంరక్షించు నీకు మామ్రొక్కులు.

36. కృష్ణా:- అమ్మా! నీవు కృష్ణవు. నిన్ను స్తుతింపఁదగు నామావళిలో సర్వశ్రేష్ఠమైన సాటిలేని నామ మిదొక్కటే. కృష్ణానామమునది సత్తింగి యానామమునే స్మరించు భాగ్యమిచ్చిన యధికారిమి యవిలంబముగా నీలోఁ జేయుము.

తొలుత నీవు శ్వేతవై బుద్ధిసత్త్వవికాసము చేసి తరువాతఁ గృష్ణవగుదువు. "కర్షతీతి కృష్ణా" ఆకర్షించుదానవు కనుక కృష్ణవు. నీ సాకర్షణశక్తిచే మమ్ములను విషయములను తీయుము. విషయాతీతమైన నీనిరంజనరూపమందు మమ్ముఁ జేర్చుము. శరన్నవరాత్రములలో సప్తమినాటికి మా మానసిక కళ లేడింటితో మేము నీచేత నాకర్షింపఁబడినపుడు అదే మాకు మహాకృష్ణాష్టమి, దశమినాటికిఁ బదిమానసికకళలతో మేము నీచేత నాకర్షింపఁబడినపుడు దుష్టసంస్కారము లనెడి యసురులతోడి యుద్ధమున మేమే విజయము పొందుదుము, కనుక నది మాకు విజయదశమి. నాఁటియందు గృష్ణాదేవీ! విజయమును మాకిచ్చి విషయాతీతమైన నీ నిరంజనస్వరూపమును జూపుదువు కనుక నాతిథి పేరు విజయాదశమి, (విజయదశమి). దుర్గాంబా! అప్పుడే నీవు మాచేత సర్వకర్మఫలసన్యాసమును జేయించి సాత్త్వికక్రియాశక్తిరూపవై మాలో వెలయుదువు. నీకు మాజోత

37. కైటభనాశిని :- ఈ నీనామమును విన్నంతనే యాగామికర్మఫలనాశము చేయునది మాదుర్గాంబయే యని పొంగిపోవుదుము. కైటభశబ్దార్థము—బహుళార్థము. "కీటవద్బా

తీని కీటభః తస్య భావః కైటభః" భిన్న భిన్న కీటము లొక్క-
చోటం జేసుకొని తమతమ శక్తి కొలంది స్పందనధర్మమును
జూపుచు నొకచోట బహుత్వమును దెలుపుచుండుటలే సంచితకర్మ
బీజసమూహము ఒక్కసారి యనేకభావముల పరిజ్ఞానము
చేయును గనుక బహుత్వబీజములే కైటభనామమున బ్రసి
ద్ధములు. ఈ బహుత్వవాంఛా బీజసముదాయము నీవు కృష్ణ
రూపముతో మాయయందుఁ గరగించి తెలిసినప్పుడే నశించును.
అప్పుడే నీకైటభనాశినీనామము సార్థకము. మా పూర్వాది
కర్మఫలనాశనమును జేయుటకు నీవే మాలో సత్వగర్భరాజసీ
క్రియాశక్తిరూపమున వెలయుదువు. నీకు జోతలు.

38. హిరణ్యాక్షి :- అమ్మా! ఈ నీనామము నీసర్వత్ర
వ్యాపకశక్తిని దెల్పును. "హిరణ్యం విష్ణు రాఖ్యాతం తస్య
వ్యాప్తిస్తు వైష్ణవీ" హిరణ్యమనఁగా సర్వవ్యాపకశక్తిరూప పర
మాత్ముఁడు; విష్ణువు. "హిరణ్యం అక్ష్ణోతీతి హిరణ్యాక్షి"
విష్ణువునందు ననపాయినివై వ్యాపించి యుండుదానవు కావున
నీవు హిరణ్యాక్షివి. "శక్తిశక్తిమతో రభేదః" అనెడి శ్రుతి
ప్రమాణమువలన వైష్ణవీశక్తివై నీవే సర్వత్ర వ్యాపించి
యున్నావు. నిన్ను నుపాసించు నధికారులలో నవద్యాన నాశక
సద్భావ జనక వైష్ణవివై సత్వగర్భరజోగుణప్రధాన తేజో
మయక్రియాశక్తిరూపమున నుండి మాలో నుదయించు నవద్యా
వముల నెడి యసురులను నశింపఁజేయు నీకుఁ జేమోడ్పు.

39. విరూపాక్షి :- అమ్మా! విశేషరూపములతో జగ
దాకారమున వ్యాపించియున్నదానవు గనుక విరూపాక్షివి.

చంద్రసూర్యాగ్నులనెడి ముక్కనులు విరూపముగాఁ గల వాఁడు విరూపాక్షుఁడు. రుద్రుఁడు. తచ్ఛక్తివి నీవు విరూపాక్షివి. జగమే రుద్రాణివైన నీశరీరముగా భావింపఁబడి నపుడు సూర్యచంద్రాగ్నులనెడి మూఁడు తేజోమండలములు నీముక్కనులుగా నెన్నఁబడును. సూర్యచంద్రాగ్నిమండల తేజస్సులు భిన్నభిన్నములుగాఁ గానవచ్చినను బరమార్థముచే నేక తేజస్సే. ఈ తేజస్సనునది నిత్యరూపమే యైన జ్ఞానమే. భూత భవిష్యద్వర్తమాన జ్ఞానములనెడి వ్యవహార మున్నను జ్ఞాన మన్నది యొక్కటే. ఈ మూఁడు విధములైన జ్ఞానములే నీముక్కనులుగా నెన్నఁబడుటచే నీవును ముక్కంటివే. ఈ కారణముచే రుద్రుఁడు ముక్కంటియైనట్లే నీవును ముక్కంటివి. జగద్రూపము నుపసంహరించుకొను సంకల్ప ముదయించునంత నఖండైకజ్ఞానరూపమున వెలయుదువు అపుడు నీవు విగతమైన రూపముతో నఖండజ్ఞానాకారమున వ్యాపించియుందువు. కనుక నీవు విరూపాక్షివి. కావున మా యుపద్రవములను నశింపఁజేయు రౌద్రివై సత్త్వగర్భితమోగుణప్రధాన ప్రకృతి నియతమైన క్రియాశక్తివై వెలయు నీకు దండము.

40. సుధూమ్రాక్షి :- సమస్తమైన యుపద్రవములను ధూమముగా నుంచు వహ్నివు. త్రిరూపమున వ్యాపించియున్న దానవు. అనఁగా, సు = పరమార్థమునుగూర్చిన యుపద్రవముల వల్లఁ గలుగు కామాది శత్రువులను బాఁదోలు జ్ఞాన స్వరూపమున నున్నదానవు. రజోగర్భ తమోగుణప్రధాన ప్రకృతియందు నియతమైన క్రియాశక్తివి. నీకు నమస్కారము.

అమ్మా! నీతత్త్వము నెఱుంగఁ బ్రయత్నింపని యధమాధికారులయెడ నీవు ధూమ్రామూర్తివే. అనఁగా విపర్యయజ్ఞాన రూపమున వారలలో వ్యాపించి నీకు మఱింత దూరముచేసి వినాశము వంకకే పరుగెత్తింతువు.

దుర్గాంబా! యథార్థహిరణ్యాక్షివై శత్రువులను మంటపెట్టఁ బ్రబలమాగ్నినేత్రము గలదానవై కొన్ని యసురభావములను, విరూపాక్షివై యనఁగా రుద్రశక్తివై కొన్ని యసురభావములను, సుధూమ్రామూర్తివై కొన్ని యసురభావములను మట్టుపెట్టుదువు. ఇదే నీరజోగర్భ తమఃప్రధాన క్రియాశక్తిస్వరూపము.

అమ్మా! నీ శ్వేతా, కృష్ణా, ధూమ్రా నామములను మఱియొక విధముగా సమన్వయించు చున్నాము.

దేవీమాహాత్మ్యమునందు "ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః" అని చేయఁబడిన వర్ణనమే నీ శ్వేతాది నామములతో సమన్వయించును.

ఖ్యాతి శబ్దమునకు యశఃప్రతిష్ఠాదులను మీఱిన యర్థము మఱియొకటి కలదు. అదే వివేకఖ్యాతి. ప్రకృతిపురుషుల పృథక్త్వము (వేఱుపాటును) గూర్చిన సుస్పష్టప్రతీతి. దానిని వివేకఖ్యాతి యని సాంఖ్యులందురు. ఆపాతదృష్టిచే (పైపై చూపులో) సాంఖ్యకారులు ప్రకృతిని జడనామముతో నుల్లేఖించిరి. వాస్తవముగాఁ బ్రకృతి జడముకాదు. చైతన్యమయి

నైన నీయొక్క జడత్వప్రతీతి మాత్రమే. (చిచ్ఛక్తి శ్చేతనా రూపా జడశక్తి ర్జడాత్మికా. సూ॥ నామ.స్మృతి) జడత్వము సైత మొకవిధమైన బోధమే. బోధవస్తువు చేతనమే కాని జడము కాదు. కేవల చేతనమే కాదు. ఆనందమే దాని స్వరూపము, నిర్గుణానందవస్తువే రూపమున సగుణభావము నొందినది. అనఁగా సత్త్వరజస్తమోగుణమయమై ప్రకాశించినది. ఈ విషయమును చక్కఁగా ననుభవించుట పేరే ప్రకృతిపురుష తత్త్వ వివేకము లేదా వివేకఖ్యాతి.

అమ్మా! ఈ ఖ్యాతిరూపముతో నీవే నిన్ను వెలయించుకొనుచున్నావు. ఆనందమయపురుషుఁడవైన నీవే నిన్ను విశేష భావముతో ననుభవించునపుడు నీకు "ప్రకృతి" యను పేరయ్యెను. ఈ ప్రకృతి పురుషతత్త్వముల యథార్థానుభవ రూపముతోనే నీవున్నావు. ఈ యనుభవము (ఉపలబ్ధి) పేరే వివేకఖ్యాతి. తద్రూపిణివైన నీకుఁ బ్రణతి.

ఈఖ్యాతికి విపరీతమైన యజ్ఞానమనుమూర్తితోఁ గూడ నీవే యున్నావు. ఏరూపముగాను బోధవికాసము లేక, లక్షసాధనలు చేసినను, అనుభవవికాసము కాకయున్నపుడే అజ్ఞానమయ కృష్ణమూర్తితో విరాజిల్లుదువు. ఆ యజ్ఞానమయమైన నీకృష్ణమూర్తికిని ప్రణామములు,

మఱి, యీరెంటికిని మధ్యవర్తియై (ఖ్యాతికృష్ణల నడుమ) నీమఱియొక మూర్తి యున్నది. దానిపేరు ధూమ్రము, ఆరూపమునను వ్యాపించియున్న దానవు కనుక నే ధూమ్రమూర్తివి,

ఈ ధూమ్రమూర్తివలన జ్ఞానముయొక్క ఉపప్రకాశముతోఁ గూడి యజ్ఞానరూప ప్రకాశమగును.

అమ్మా! నీ సంతానమందుఁ గొందఱు వేదాదిప్రతిపాద్యమైన నీ స్వరూపమును వ్యాఖ్యానింప దక్షులు; సగుణ నిర్గుణాది తత్త్వవిశ్లేషణ సమర్థులు; మోక్షశాస్త్రమందును అధ్యయనాధ్యాపనములందును బటువులునయ్యు, నీ యీరూపసంపన్నమయ స్వరూపానుభవము లేకయే పోవుచున్నారు. అప్పుడే, అమ్మా! ఈ ధూమ్రమూర్తితో (జ్ఞానవినాశము గన్నంతిగల మూర్తితో) వారి నాడించుచున్నావని తెలిసెను. అట్టి నీయపూర్వధూమ్రమూర్తికి మ్రొక్కులు.

మఱియొకవంక, అమ్మా! నీవు సదాఖ్యాతి (శ్వేతా) కృష్ణా ధూమ్రామూర్తులతో సర్వజీవుల నాడించుచుందువనియు మాకుఁ దెలిసినది. మేము విషయగ్రహణము చేయునప్పుడే నీ యీమూర్తుల విశిష్టత ప్రకట మగునని మేము తెలిసికొనుచున్నాము. "మేమిది తెలిసికొనుచున్నా" మను నదే విషయగ్రహణ స్వరూపము. సర్వత్ర మే మీమూడు మూర్తుల స్వరూపము స్థితిరూపముగాఁ బ్రకాశించుట కనుగొనుచున్నాము. దానికి మా ప్రణామము.

వేదశ్రుతి మహాష్టద్యై బ్రహ్మణ్యై జాతవేదసి ।
జంబూకటకచైత్యేషు నిత్యం సన్నిహితాలయే ॥ 7

41. వేదశ్రుతి :— అమ్మా! నీవు వేదశ్రుతి స్వరూపవు, వేదములనఁగా నాత్మస్వరూపమును గూర్చిన యనుభవజ్ఞాన

మును వెల్లడించు మాటలు. వానిరూపమున నీవే యుండి జీవలోకమునకు ధర్మోపదేశములుచేసి జీవుల నాత్మజ్ఞానవంతులనుగాఁ జేయఁజాలుదువు. కావున సమస్తశ్రుతులచేతను బోధింపఁబడు నీ స్వరూపమును అనఁగా నాత్మస్వరూపమును తెలియఁ జెప్పుచు హృదయాకాశమందు వసించుచున్నావు. నీవు సత్త్వ గుణప్రధాన క్రియాశక్తివై జీవలోకోపకారము చేయు చుందువు. నీకు నమస్కారము.

42. మహాపుణ్యా:- అమ్మా! నీవు మహాపుణ్యవు. పుణ్య మనఁగాఁ బరమాత్మతోఁ జేరియుండుటే. నిన్ను నుస్మరించు నధికారులకు వారివారి యధికారమునుబట్టి మహాసుఖమును అనఁగా మోక్షమును, అల్పసుఖమును- అనఁగా భోగ సుఖమును, నిచ్చు రజోగుణప్రధానమైన పవిత్రక్రియాశక్తి స్వరూపమున నెలయుదువు. నీకు నమస్కారము.

43. బ్రహ్మణ్యా:- అమ్మా! నీవు బ్రహ్మణ్యవు. సృష్టిశక్తి స్వరూపవై సర్వస్వరూపములతో నెలయుదువు.

సకల నీవే రాజసీమూర్తివై నీలో నిముడ్చుకొనియున్న జీవకర్మఫల బీజముల తెలివి యనెడి వేదములను జేతఁబట్టుకొని విరాణ్మనోరూపవై విశ్వకల్పనము చేయుదువు. అనఁగా సర్వ స్వరూపములతోఁ బ్రకాశించుటచే బ్రహ్మణ్యవని కీర్తింపఁ బడుదువు అనఁగా సృష్టికర్త్రివియు, లయకర్త్రివియు నీవేయని తెలిసిన నీకు నమస్కారము.

44. జాతవేదసి :- అమ్మా! నీవు జాతవేదసివి. జాతవేదుఁడు- అగ్ని. "అగ్ని ర్వై రుద్రః" అనెడి శ్రుతిచేత నీవే రుద్రశక్తివై లయసంకల్పము కలుగఁగానే ప్రళయాగ్నిరుద్రస్వభావమున సర్వమును భస్మము చేయుదువు. అనఁగా జీవకర్మఫలబీజముల నన్నిఁటిని నీలోననే యుపసంహరించుకొందువు. అనఁగా నీవు కేవల తామసీక్రియాశక్తివై కల్పాంతము నొనర్తువు. నీకు నమస్కారము,

45. జంబూకటకచైత్యేషు నిత్యం సన్నిహితాలయే :- నీవు జంబూకటకచైత్యముల నాలయములుగాఁ జేసికొనియుందువు. అమ్మా! నీసంకల్పముచేతనే సిద్ధమైన జంబూద్వీపమునందు నుపలక్షణముచేత నార్యావర్తాది సప్తద్వీపములయందును, పట్టణములయందును, పర్వతారణ్యములయందును, సర్వగృహములయందును నీవే నీకభిముఖులై యుపాసించు వారలకు సన్నిహితవై యుండి యర్చామూర్తిస్వరూపముతో నిలిచి తత్తదభీష్టఫలప్రదాత్రివై స్వాశ్రితుల ననుగ్రహించుచుందువు.

త్వం బ్రహ్మవిద్యా విద్యానాం మహానిద్రా చ దేహినామ్
స్కందమాత ర్భగవతి దుర్గే కాంతారవాసిని ॥ ౯

46. త్వం బ్రహ్మవిద్యా విద్యానాం:- అమ్మా! విద్యలలో నీవు బ్రహ్మవిద్యవు. పరావిద్య, అపరావిద్య యని విద్య రెండు విధములు. "యయాతదక్షర మధిగమ్యతే సా విద్యా" ఏవిద్యచేత నక్షరపరబ్రహ్మము పొందఁబడునో యనఁగాఁ దెలియఁబడునో యదియే విద్య. అదే పరావిద్య. తక్కిన విద్యలన్నియుఁ

పరావిద్యను సూచించునవియే కాని పరమములు కావు. అనఁగా మోక్షము నిచ్చునవి కావు. "పరా పరాణాం పరమా త్వమేవ పరమేశ్వరి" పరాపరవిద్యలలో (పరం మాతీతి పరమా) మోక్షమునిచ్చునది పరమవిద్య. పరమేశ్వరివైన నీవే విద్యారూపమున ననఁగా మోక్షమునిచ్చు బ్రహ్మవిద్యారూపమున వెలయుచున్నావు తొలుత నీవు నిన్నుపాసించువారి యిష్టకల్పమూర్తితో వెలసి వారి సర్వాభీష్టములను ఫలింపఁజేసి క్రమముగా బ్రహ్మవిద్యాస్వరూపిణివై వారిలో వెలయుచున్నావు. బ్రహ్మజ్ఞానాగ్ని సర్వకర్మములను భస్మము చేయు ననెడి స్మృతి ననుసరించి కర్మనాశము చేసి యనఁగా నాగామిసంచితప్రారబ్ధ కర్మబీజములను మఱల మొలవకుండఁజేసి మోక్షము నిత్తువు. అట్టి నీకు నమస్కారము.

47. మహానిద్రా చ దేహినాం:- అమ్మా! నీవు ప్రాణులలో మహానిద్రాస్వరూపమున వెలయుచుందువు. ప్రాణులు సామాన్యముగా ననుభవించు నిద్రావస్థ యలసిన యింద్రియముల యుపరతావస్థ. అనఁగా సేదదీర్చుకొను నవస్థ. దానినే నిద్ర యందురు. అది కేవలతమోరూప. అది విడువఁగానే ప్రాణి సంసారవిషయమున భూతకృత్యములను, భవిష్యత్కర్తవ్యములనుగూర్చి పరిశ్రమించు నవస్థ; జాగ్రదవస్థ. విశిష్టజ్ఞానియెడ నీవు; ఆత్మవిద్యాస్వరూపమున నిలుతువో యపుడాతఁడు బ్రహ్మమిల నావస్థ (యోగావస్థ) నొందును. అపు డాతఁడు "అహం బ్రహ్మాస్మి" అనెడి మహావాక్యార్థ జ్ఞాననిష్ఠితుఁడైన

వాఁడు. కావున బ్రహ్మలక్షణములైన సచ్చిదానంద స్వరూప ములయందుఁ బ్రతిష్ఠితుఁడై క్రమముగాఁ దన యానందస్వరూప ముందే నిలుచును. ఆయవస్థనే యోగనిద్ర యందురు. ఇదే పరిపక్వయోగావస్థ యని యొక మహానిద్రావస్థ. అప్పు డతనికి భూతవర్తమాన భవిష్యత్ కర్తవ్యములనుగూర్చి యోచించు పనియే యుండదు. అదియే యోగనిద్ర. దీనినే దేహు లనుభ వించు మహానిద్రయని పెద్దలందురు. అది నీస్వరూపమే. నీపరిపూర్ణానుగ్రహము నిన్ను నిరంతరోపాసనాసక్తను గావించు నుత్తమాధికారులయెడనే నీవు యోగనిద్రా స్వరూపిణివై జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థ లనెడి మూఁడు శరీరముల నంటనీయక సముద్ధరింతువు. తురీయావస్థాత్మక మహానిద్రాస్వరూపిణీ! పార్థివదుర్గానామ్నీ! నీకు నమ స్కారము.

48. స్కందమాతః :- అమ్మా! నీవు స్కందుని గన్న దానవు. స్కందుఁడు శత్రువులను శోషింపఁ జేయువాఁడు. ఈశత్రుశోషణశక్తికి మాతవు నీవు నీయాశ్రితులకు శత్రు మారణశక్తిని నిచ్చెదవని భావము. స్కందమనఁగా శుక్ర మను పేరుగల బ్రహ్మతేజస్సును గన్నదానవు. "శుక్రమసి జ్యోతిరసి తేజోసి" అను శ్రుతిచేత శుద్ధవిజ్ఞానమే లక్షణ ముగాఁగల యొక శక్తి చెప్పఁబడుచున్నది. ఆచార్యులచేత దీక్షాదానము చేయఁబడువేళ నాయాయధికారిశిష్యుల యొక్క మహాస్థాన మనెడి బ్రహ్మరంధ్రమందు శ్రీమన్నారాయణుని

కంటె వేఱుకానట్టిదము, శుద్ధతేజోమయస్వరూపయు నైన యోగదేవిచేత నుంచఁబడు శుక్రము పేరి బ్రహ్మతేజస్సు స్కందమను పేరఁ బరగునని యోగశాస్త్రము. కావునను నీవు స్కందమాతవు. మఱియు నజ్ఞానమును దొలఁగించు వాఁడను నర్థమిచ్చు గుహపదముచేఁ బ్రసిద్ధుఁడైన భగవంతుఁడైన కుమారస్వామియు స్కందపదవాచ్యుఁడగు చున్నాఁడని తెలియఁదగినది, కనుక మును వర్ణింపఁబడిన తేజస్సు నీదియే కావున నీకు స్కందమాతృనామము సుప్రసిద్ధము. ఇతఁడు శాశ్వతముగాఁ గుమారావస్థయందే యుండువాఁడు కనుక సనత్కుమారుఁడు. అజ్ఞాననాశకశక్తి నీకంటె వేఱుకానిది యితనిది కావుననే గుహనామప్రసిద్ధుఁడు.

49. భగవతి:- అమ్మా! నీవు భగవతివి. భగవచ్ఛక్తివి. భగమెవ్వనికో (సర్వజ్ఞత్వ, నిత్యతృప్తిత్వ, అనాదిబోధత్వ, స్వతంత్రత్వ, నిత్యమలుప్తత్వ, అనంతత్వములనెడి షడైశ్వర్యసముదాయము భగము) యతఁడు భగవంతుఁడు. శక్తిశక్తిమంతుల కభేదము. కనుక నీషడైశ్వర్య సంపత్తి నీదియే. మఱియు–

"ఉత్పత్తించ వినాశంచ భూతానా మాగతిం గతిం।
వేత్తి విద్యా మవిద్యాంచ స వాచ్యో భగవానితి" ।

జగదుత్పత్తి వినాశములు, సర్వభూతముల రాకపోకలు, విద్యావిద్యలు అను నీయాఱును ఎవ్వఁడెఱుఁగునో యతఁడు భగవంతుఁడు. తదభిన్నవు నీవు భగవతివి, సర్వపూజ్యవు.

50. దుర్గే :- అమ్మా! నీవు దుర్గవు. దుర్గ+అ = "ఆ" హంత్ర్వాచకము. దుర్గనామకాసురుని జంపినదానవు కనుక నీవు దుర్గవు. మఱియు దుఃఖముచేతఁ బొందఁబడుదానవు. అనఁగా జనులు నీతత్త్వమును (స్వరూపమును) అతికష్టము చేతఁ దెలియఁగల్గుదురు. కనుకను నీవు దుర్గవు. మఱియు దుర్గ = ఆపద, కష్టము, దారిద్ర్యము, వ్యాధి, జన్మము వీని నన్నిఁటిని "ఆ" పోగొట్టుదానవు. కనుక నీవు దుర్గానామవు.

51. కాంతారవాసిని:- కాంతారమందు వసించుదానవు, కాంతారము = అడవి. ఎవ్వరినిం జొచ్చి దాటనీయదు. కనుకఁ గాంతారము. కాంతారవాసిని = దాటరాని సంసారరూపమున నున్నదానవు. కావున నీవు కాంతారవాసినివి. ఈశరీరమంత లమే కాంతారము, దీనియందు నివసించుదానవు. కనుకఁ గాంతారవాసినివి. ఆత్మతేజస్స్వరూపమనఁగా జ్ఞానస్వరూపము. చీకటి యడవినుండి నిర్భయముగా దాటించునది వెలుఁగు. ఈశరీరమను నట్టి చీకటియడవియందు జ్ఞానమను నట్టి దీపముగా వెల యుచున్నది యాత్మయను స్వప్రకాశము వేఱుకాని తచ్ఛక్తియే. ఆత్మవస్తువు జ్ఞానమే స్వరూపముగాఁగలది. శరీరమందు జ్ఞాన స్వరూపమున వెలయుచున్నదనినయే, అది యజ్ఞానముచేత నావ రింపఁబడియున్నది. దానిచేతనే జీవులు మోహపడుచున్నారు. "అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః" ।భ. గీ।

స్వాహాకారః స్వధాచైవ కలా కాష్ఠా సరస్వతీ ।
సావిత్రీ వేదమాతా చ తథా వేదాంత ఉచ్యతే ॥

52. స్వాహా, స్వధా :- అమ్మా! నీవు స్వాహావు, అమ్మా! నీవు స్వధవు. "స్వాహా" అనునది దేవహవిర్దాన మంత్రము. ఇది సర్వదేవకృత్యములకు నుపలక్షణము. "స్వధా" అనునది పితృపిండాంజలి మంత్రము, అమ్మా! నిన్ను గూర్చి విచారణము చేయుఁగా దేవపితృభేదముచే రెండుగా విభజింపఁబడిన కర్మకాండము మంత్రసాధ్యానుష్ఠానమే. మంత్రములు నీస్వరూపములే. కావున నాయాకర్మఫలముల రూపముననుండి కర్మఫలప్రదాత్రివిగాను నుండి సదా సర్వత్ర పూజింపఁబడు చున్నావు. కావునఁ గర్మఫలదాననాయకత్వము నీది. నీకు నమస్కారము.

53. కలా :- అమ్మా! నీవు కలవు. పైనిజెప్పిన దేవపితృప్రీతికరమంత్రము లుచ్చరింపఁబడి నప్పుడు "ఉదాత్తానుదాత్త స్వరితము" లనెడి స్వరముల యుక్తి యిప్పను. ఆస్వరముల యుచ్చారణ తారతమ్యమువలన ఫలతారతమ్యముండును. ఈ స్వరములయందలి ఫలప్రదశక్తికే "కళ" యని పేరు. తద్రూప మున నీవే యున్నావు. కావున శ్రేష్ఠశక్తిస్వరూపిణివైన నిన్నే "బ్రహ్మకలా, చంద్రకలా, నాదకలా: విద్యాకలా, మహావైరాగ్యకలా" యను పేర్ల శాస్త్రములందు గానవచ్చు చున్నవి, అదే "షోడశి" యని శాస్త్రములయందుఁ బ్రసిద్ధము. "చంద్రకలా" యను నప్పుడు "చంద్ + రక్" అను ధాతువుల వలన నేర్పడిన చంద్రశబ్దము జ్ఞానానందస్వరూప పరమాత్మకే చెల్లును. (చది ఆహ్లాదనే, రక దీప్తౌ) పురుషునికంటె వేఱు

కాని శక్తిచే యుత్కృష్టము. కావునఁ గాష్ఠాశబ్దమును నీకే చెల్లును. చంద్రుని షోడశకళా స్వరూపిణివి నీవే. సర్వోత్కృష్టత నీది కనుకనే నీవు కాష్ఠవు. నీకు నమస్కారము.

౫౪. కాష్ఠా :— పురుషుఁడనబడు పరమాత్మకంటె వేఱు కాని నీవే పరాకాష్ఠవు. పరాగతివి. నీవు పురుషివి. అతఁడు పురుషుఁడు. మాయాభిన్నతనే మేము కైకొన్నపుడు ఆ పరమాత్మునకును కాష్ఠాశబ్దమే చెల్లును. కావున శక్తిలింగలక్షణ బ్రహ్మస్వరూపవన్నను, బ్రహ్మలింగశక్తివన్నను మేము స్వీకరించి నిన్ను బూజింతుము.

౫౫. సరస్వతీ:— అమ్మా! నీవు సరస్వతివి. సృష్టిపరమైన బ్రహ్మశక్తివి. బ్రాహ్మివి. సమస్తవిజ్ఞానముల నీవు ధరించి వెలయుచుందువో యా భాషాప్రపంచము నీ స్వరూపము. అది అవిచ్ఛిన్నమాత్రగా వర్ణములుగాను విరచితములైన పద వాక్య విశేషములే స్వరూపముగాఁ గలది. పరావాగ్రూపిణివైన నీవే పశ్యంత్యాదిక్రమమున నుచ్చరించి విశేషశబ్దములతోఁ బలుకఁబడినపుడు నీవు భాషారూపిణివి. నీయుచ్చారము సరస్సులనఁబడు షట్చక్రసంస్పర్శనము గలది. కావున నీకు "సరస్వతీ" యని పేరయ్యెను. నీకు మా ప్రణుతులు.

బ్రహ్మస్వరూపిణివైన నిన్ను దెలుపు విద్యయంతయు నీస్వరూపమే యైన సారస్వతరూపముననే ప్రకాశితమగును. కావున బ్రహ్మవిద్యాస్వరూపిణివి నీవే; అపుడు శాస్త్రము

నిన్ను "శ్రీ" శబ్దముతో వ్యవహరించినది. శవర్ణ, రేఫ, ఈకారములకూడికతో నైన "శ్రీ" శబ్దమునకు జ్ఞానానంద స్వరూపబ్రహ్మశక్తి యనిపేరు. నీవే బ్రహ్మవిద్యాస్వరూప మగుటచేత నిన్ను బూజించుటకుఁ బెద్దలు చైత్రశుద్ధ పంచమి మొదలు తొమ్మిది దినములు తేర్పరిచిరి. ఆ పంచమీతిథికే శ్రీపంచమి యని పేరిడిరి. ఏబ్రహ్మవిద్య భాషాస్వరూపము నొంది ఘనీభావము నొందినదో యది పుస్తకరూపిణీ సరస్వతి. తద్రూప సరస్వతివైన నీపూజను ఆశ్వీనమందు "దుర్గాపూజ, రమాపూజ" యను పేర్లతో నవరాత్రములు జరుపుదురు. పుస్తకరూపిణీ సరస్వతివైన నీపూజ యీదినములందు వచ్చు మూలానక్షత్రాదిగా మూఁడు దినములే జరుపు నాచారము సాగుచున్నది. వేదమాత! తల్లీ! బ్రహ్మవిద్యాస్వరూపిణివైన నీదే సరస్వతీనామము. అట్టి నీకు నమస్కారము.

"యా వసేత్ప్రాణిజిహ్వాసు సదా వాగుపవర్తనాత్ ।
సరస్వతీతి నామ్నీయం సమాఖ్యాతా మహర్షిభిః ॥

సర్వప్రాణుల నాల్కలయందుండి వాక్కులను బ్రసరింపఁ జేయుదానవు గాన సరస్వతివని మహర్షులనిరి. మఱియు "సర్వా త్మిస్వద్క్షిణాం సరస్వతీ" సర్వజ్ఞానప్రవాహరూపమున నున్న శక్తివి నీవేయని మాభావము. నీకు నమస్కారము.

56. సావిత్రి:— అమ్మా! నీవు సావిత్రివి. ప్రాణిప్రసవకారుఁడైన పరమేశ్వరుఁడే సవిత్రుఁడు తచ్ఛక్తి సావిత్రి. అనఁగా

నీవు సృష్టికర్త్రివి. సమస్తజగత్తులకు జీవనౌషధమైన యా పరమేశ్వరుఁడే విజ్ఞానప్రదాత. అతఁడు వేదత్రయీస్వరూపుఁడు. కనుక వేదనారాయణశక్తివైన నీవును నీసంతానమునకు విజ్ఞానమును బెట్టి సంరక్షించుచుందువు. నీకు నమస్కారము.

57. వేదమాత :- నీవు వేదమాతవు సర్వవేదస్వరూపిణివైన నీవు స్వరూపజ్ఞానప్రదానము చేయు సామర్థ్యముతోడి వేదములను వెలికి వినుపకున్నచో నీసంతానము చెడు ననెడి భయమునఁ గృపాముడవై వేదజ్ఞానమును వినజల్లుచున్నావు. కనుక సావిత్రివైన నీవే వేదమాతవు.

ఈవిషయమున భారతమందలి ప్రమాణకథ. శ్రీమంతుఁడైన నారదమహర్షి ముల్లోకసారి తీర్థసన్న్యాసవరుఁడై సంచరించుచు హిమగిరిపాదమును జేరి యచట సంచరించుచుఁ దామరలతోను; గలువలతోను నిండి మనోహరమైన యొక సరస్సును, దానియొడ్డున నానాభరణభూషితయై తన తేజస్సుచే దిక్కులను వెలింగించుచు నాగోలకమందలి పద్మోత్పలములతో నాడుకొనుచున్న యొక దివ్యకన్యకను జూచెను. ఆమెయు మహర్షిని జూచి నారదా! యని సంబోధించె నంత నతఁడును ఆమెను సమీపించి విస్మితమానసుఁడై యుండఁగా, నామె తన చిఱునవ్వు పకరించు నప్పుడు ఆమెనోటినుండి సూర్యసదృశుఁడైన యొక పురుషుఁడు శిరస్సున నొక యనర్ఘ్యమణిని ధరించినవాఁడు వెలికివచ్చెను. చూచుచుండఁగానే యట్టివారే మఱి యిరువురు పురుషులును వెలికివచ్చి ముగ్గురు నాదేవికిఁ బ్రదక్షి

గించి వివిధ ధ్వనులతో మనోహరవాగ్విశేషములతో నామెను స్తుతింపఁగా నారదమహర్షి అమ్మా! తేజోవతి నీ దివ్యాకృతిని నన్ననుగ్రహించి తెలుపుమని యడుగఁగా నాదేవి నారద మహర్షి! నాపేరు సావిత్రి. నీకు శుభమగుఁగాక. సన్నుతి చేయుచుందువు. నీకోరిక తీర్చితి. అనఁగా నారదుఁడు "నీముఖాబ్జమునుండి వెడలివచ్చి నన్ను స్తుతించిన యీ దివ్యపురుషులెవరమ్మా" అని యంతనే యామె వీరు మువ్వురును ఋగ్యజుస్సామములనెడి వేదపురుషులు. నీసంశయము తీరినదికదా యనెనఁట. దీనివలన సావిత్రీ స్వరూపము తెలియఁబడుచు వేదమాత సావిత్రియే యని సిద్ధాంతితమైనది.

58. వేదాంత :- అమ్మా! నీవు వేదాంతవు. అనఁగా వేదాంత విద్యాస్వరూపిణివి. సావిత్రివై వేదములను గన్న దానవు. వేదాంతవిద్యవేల కాకుందువు! "వేదానా మంతః = వేదాంతః" అనుచోట మోక్షార్థులచేత సేవింపఁబడు యోగవిద్యాస్వరూపవైన నీవే చెప్పఁబడుదువు. సర్వవేదప్రతిపాద్య విషయములు చేరియుండు బరిసమాప్తమగునో, చేరియుండు నుపసంహరింపఁబడునో యదే వేదాంతము. ఋగ్యజుస్సామములనెడి త్రయి జ్ఞానకర్మనిష్ఠులకుఁ దగిన ధర్మములను దెలుపునది. సర్వధర్మములకంటె విశేషించి మోక్షధర్మమును విశదించి చెప్పునదియే వేదాంతవిద్యయు. దానికే యుపనిషత్తులని పేరు. అవి బ్రహ్మోపాసనమును దెలుపునవియే. సర్వకారణ బ్రహ్మమే వేదాంతవిద్యచేఁ గొనియాడఁబడుచున్నది.

"యతో వా ఇమాని భూతాని జాయన్తే।
యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి।
తద్విజిజ్ఞాసస్వ" —తైత్తిరీయోపనిషత్తు.

భూతము లన్నియు దేనినుండి పుట్టినవో, దేనివలన నవి జీవించుచున్నవో, తుదకు దేనిలోఁ జేరిపోవుచున్నవో యదియే బ్రహ్మము. ఆ బ్రహ్మమునే మహర్షు లుపాసించినారు. కావున జ్ఞానమువలని తుదిఫలము మోక్షమే చెప్పఁబడుచున్నది. కనుక నీస్వరూపమేయైన వేదాన్తశాస్త్రముచేత ముక్తిమార్గమే బోధింపఁబడుచున్నది. దీనిచే నీస్వరూపమే యైన జ్ఞానము (ఆత్మజ్ఞానము) లభించునో యది నీస్వరూపమే యైన వేదాన్తమే. కనుక నీస్వరూపమే యైన వేదాన్తవిద్యచే జగత్కారణ బ్రహ్మమే స్మరింపఁబడును. కావున నమ్మా! బ్రహ్మముకంటె నన్యముకాని నీవు బ్రహ్మశబ్దితవే యగుటవలన శక్తిరూపిణి వైన నీవే నీస్వరూపమే యైన వేదాన్తవిద్యచేఁ గొనియాడఁ బడుచున్నావు నీకు నమస్కారము.

59. కాంతారభయదుర్గేషు వరసి :- కాన్తారాది శబ్దములచేత బ్రహ్మశక్తివైన నీ ప్రాప్యస్థానములు చెప్పఁబడుచున్నవి. కర్మపరులైన వారికడవులే ప్రాప్యస్థానము. భయస్థానము అనఁగా నగరస్థానము. దుర్గస్థానమనఁగా గృహము. అరణ్య నగరములు కేవలకర్మపరులైన వారి ప్రాప్యస్థానము.

60. భక్తానాం చాలయేషు వససి :- యథార్థభక్తులైన యధికారుల పూజాస్థానము వారి హృదయపద్మమే అనఁగా భక్తులు తమ యనాహతమందే నిన్ను బూజింతురు.

61. నిత్యం వససి పాతాళే :- అనుచోటఁ బాతాళశబ్దముచేత నాధారశక్తికుండలీస్థానమైన మూలాధారమే బ్రహ్మశక్తిస్థానమని చెప్పఁబడును. దీనివలన నీ వివిధభక్తులు నిన్ను బూజించు స్థానములు మాకుఁ దెలిసినవి.

62. యుద్ధే జయసి దానవాన్ :- యుద్ధమందు దానవులను జయింతువు అనఁగా నీ రౌద్రీక్రియాశక్తిస్వరూపము తోఁచును. ఈ యుద్ధము కర్మయోగులకు నింద్రియశత్రుకూటముతో నగునది. అపుడు నీవు వారిచేత నింద్రియశత్రుకూటమును గెలువఁ జేయుదువు. ఈ కర్మయోగులకు నింద్రియములవల్లనే ప్రతిబంధము కలుగుచుండును. నీ యుపాసనము వలన నా ప్రతిబంధము తొలఁగిపోవునని మాకుఁ దెలియుచున్నది. యోగపరులయందు నీవిధమైన క్రియాశక్తివిగా వెలయు నీకు నమస్కారము.

త్వం జంభనీ మోహినీ చ మాయా హ్రీః శ్రీస్తథైవ చ।
సంధ్యా ప్రభావతీ చైవ సావిత్రీ జననీ తథా॥ ౧౮

63. జంభనీ :- అమ్మా! నీవు జంభనివి. వాక్స్వరూపమున నఁగా భాషాస్వరూపమున వెలయు బ్రాహ్మీశక్తివి.

జంభుఁడను నసురుని సంహరించినదానవు గనుకను నీవు జంభ
నివి. నీకు నమస్కారము.

64. మోహినీ :- అమ్మా ! నీవు మోహినివి. మతి పోఁగొట్టుదానవు. నీవు సృష్టికిఁ బూర్వమందు "నేననేకత్వము నొందుదు" నని సంకల్పించి శబ్దస్పర్శరూపరసగంధాకారమున ననఁగా విషయాకారమున వెలసి మనుష్యుల మతులు పోఁగొట్టుచున్నావు. కనుక మోహినివి. మఱియు నిన్నను స్మరించి యుపాసించు భక్తుల యింద్రియశక్తులు విషయముల వెంటఁ బరుగెత్తకుండ మోహము నొందింతువు. అనఁగా మూర్ఛిల్లఁజేయుదువు. కావునను నీవు మోహినివి. మఱియు నిన్నుపాసించు భక్తుల యందు నాసురభావములు తలయెత్త కుండఁ జేయుదువు, కావునను నీవు మోహినివి. అమ్మా ! నీకు నమస్కారము.

65. మాయా :- అమ్మా నీవు మాయవు శ్రుత్యాదులందు మాయాశబ్దము బ్రహ్మశక్తిస్వరూపిణివైన నీకే చెల్లుచున్నది. "అహం బహుస్యాం ప్రజాయేయ" అనెడి బహుత్వ వాంఛ పొడమఁగానే యనఁగా సృష్టిసంకల్పము కలుగఁగానే నిర్గుణస్వరూపవైన నీవు మాతృత్వము నొందితివి. "మాతృత్వం యాతీతి మాయా" అను వ్యుత్పత్తిచేత నీవు మాయాశబ్ద వాచ్యవై సగుణబ్రహ్మశక్తివైతివి. నీకు నమస్కారము.

సగుణవై జగదాకారము నొందిన యనఁగా శబ్దాది విషయాకారము నొంది మాయాఖ్య వహించిన నిన్ను విరాతే

పోవుట యనఁగా విషయములందుఁ జిక్కుకొనుట బహుకష్టము. అపుడు నీవు అవిద్యాస్వరూపిణివి అఖండ విద్యాస్వరూపిణివైన నీవే యల్పాల్పవిద్యా స్వరూపిణివైనపుడు నీవు అవిద్యావు విద్యాఽవిద్యాస్వరూపిణివైన నీకు నమస్కారము. (మాయా శబ్దమును గూర్చిన విశేషవివరణముకై నానాసాధనసామగ్రి తొలిమూలయందుఁ జూచునది.)

అమ్మా! నిన్ను మఱియొకవిధముగా సంస్మరింతుము. యోగమాయా! యోగబ్రహ్మశక్తీ! యని సంబోధింతుము. నీవు శుద్ధబ్రహ్మశక్తివి కనుకనే శుద్ధయోగులు పరప్రాప్తి కొఱకు సర్వాత్మనిత్యపురుషశక్తివైన నిన్నే యుపాసింతురు.

66. హ్రీః :- అమ్మా! నీవు హ్రీం నామప్రసిద్ధవు. హ్రీంనామ మహిమావర్ణనము నిన్ను మెప్పించునట్లుగాఁ జేయ నధికారు లరుదు. హకార, రేఫ, ఈకారముల సంహతిచేత నైనది హ్రీంపదము. హకారము బ్రహ్మవిష్ణు రుద్రులను (నీ సృష్టిస్థితి లయకర్తృలను) దెలుపును. హకారము గగన మను నర్థము నిచ్చును. రేఫము తేజస్సును అనఁగా జ్ఞానమును దెలుపును. ఈకారము శక్తిని దెలుపును. కాఁగా నీవే సృష్టిస్థితి లయములను జేయుదానవనియు, జ్ఞానస్వరూపమున నాకాశము వలె నంతట వ్యాపించి యున్నదానవనియు, "ఈకారము" చేత బ్రహ్మభిన్నశక్తివనియుఁ దోఁచును. ఈ సంయుక్తాక్షరమునకు బిందువును జేర్చి బీజత్వము నొందించి నీపూర్ణత్వమును

బోధించుచున్నది సకలభువనేశ్వరివైన నిన్ను దెలుపు భువనేశ్వరీ బీజమనిరి.

"హ్రీ" అనుదానికి విసర్గమును జేర్చి "హ్రీః" అనునపు డొక బిందువుచేత బ్రహ్మము తెలియఁబడుననియు, రెండవ బిందువుచేత బ్రహ్మాభిన్నురాలైన శక్తి తెలియఁబడుననియు బోధించుచు బ్రహ్మస్వరూపిణివైన నిన్ననుస్మరించి యనుసంధానించు వారికి సంసారబంధమువలన విసర్గము = విడుపు - అనఁగా మోక్షము లభించుననియుఁ దెలుపుటకే యీ విసర్గసంధానము జేసి వ్యవహారము శాస్త్రములందు సుప్రసిద్ధముగాఁ బ్రయోగింపఁ బడినది. శుద్ధమాయాస్వరూపిణివై నిన్ను దెలుపు "హ్రీం" బీజమునే మాయాబీజమనిరి. ఉపనిషత్తులయందు "విద్యుల్లేఖేవ భాస్వరా" యని సర్వాంతర్యామినియైన యీశ్వరుని వేదము వర్ణించినట్లు, యీశ్వరుఁడే నీవని తెలుపుటకే శక్తిప్రణవమైన "హ్రీం" బీజమునకు హృల్లేఖా నామమిడిరి. విద్యా-అవిద్యాస్వరూపిణివైన నీవే మాయాశబ్దముచే శాస్త్రములందు వ్యవహరింపఁ బడితివి గాన "హ్రీం" బీజమును మాయాబీజమనిరి. కుండలినీపరాశక్తివి నీవే యని యోగులు విశ్వసించి హ్రీం బీజసహాయముతో సమష్టివ్యష్టికుండలినీ స్వరూపవు నీవని నిన్నుపాసించి సిద్ధులై యుపాసనాసాధనముగాఁ గైకొనఁబడిన హ్రీం బీజమును కుండలినీ నామముతో వ్యవహరించిరి. నీవు సృష్టించిన సకలభువనములకు నీవే యీశ్వ

రివై నాయికాత్వము వహించిన దానవు గనుక నిన్ను దెలుపు హ్రీం బీజమును భువనేశ్వరీబీజమనిరి.

అమ్మా! నీవు హ్రీంకారజపసంప్రీతవని శాస్త్రము లుగ్గడించుటచేత నీమంత్రమైన హ్రీం మంత్రమునుగూర్చి నుతి కొంత వివరింపక తప్పదు.

ఈలోకమున సర్వప్రపంచమూలములైన రెండువస్తువులే ముఖ్యములనియు నవి బ్రహ్మము, మాయ యనునవి యనియుఁ వక్కాణించుటయు వాని మాటలు గూడనే యనియుఁ జెప్పుకొనుటకుఁ దగవు లేదు. ఈమాటనే శ్వేతాశ్వతరోపనిషత్తు-

"మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం।
తయోర్వ్యాభాతి లేశేనై జగదేతచ్చరాచరమ్"।

మాయయే ప్రకృతి; యనఁగా (బ్రహ్మశక్తి) నది కలవాఁడే మాయి. అనగా శక్తిమంతుఁడు; అన్నింటిని మీరిన; యన్నింటనున్న యమానుషమైన యీరెంటి సర్వాతిత సామర్థ్యమందలి లేశాంశయే యీస్థావరజంగమరూపమంతయు నగుచున్నది.

శక్తియు, శక్తిమంతుఁడు నని రెండు వస్తువులుగాఁ జెప్పఁబడుచున్నవి. ఆశక్తిమంతుని శక్తులే యీజగద్రూపము. మాయయను పేరుగల యీశక్తియే మూలప్రకృతి. సత్త్వరజస్తమస్సుల నెడి దానిగుణముల (అవస్థల) యందు హెచ్చుతగ్గులు లేని స్థితియందే యది మూలప్రకృతి; ప్రధానము,

అవ్యక్తము ననఁబడుచుండును. సృష్టిస్థితిలయ తిరోధానాను గ్రహము లనెడి ప్రశస్తములైన యయిదుకృత్యములు బ్రహ్మ శక్తివైన నీవశములనే నీవు ప్రకృతివనఁ బడుదువు. "పంచకృత్య పరాయణా" నామస్మృతి. ప్రకృతివైన నీవు కారణము. వికృతి కార్యము. (జగత్తు) "శ్రీగుణః సర్వకారణ భూతా శక్తిః" శ్రుతి. సర్వకారణ భూతశక్తివైన నీవే శ్రీగుణవవు. అమ్మా! నా నివేదించు మఱియొక్కమాట, శివశక్తులనఁబడు బ్రహ్మ మాయలు మీరు భిన్నులుకారు. నెలయు వెన్నెలయు వలె మీరొక్కటియే. శక్తిమంతుఁడైన శివునికంటె శక్తివైన నీవు వేఱుకావు. మీ తాదాత్మ్యము నిత్యము. బ్రహ్మశక్తివైన గాయత్రిని నిన్నుఁ గొల్చునప్పుడు దేవి! "అక్షరం బ్రహ్మ సమ్మితం" అను నేతత్వనిష్వాలనముతో నే పెద్దలుపాసించిరి. బ్రహ్మసమ్మితమనఁగా అవస్థాన, అనుష్ఠాన, అధిష్ఠాన నామరూప ములందు బ్రహ్మముతో సమానవే యనిరి.

కావున బ్రహ్మమునకు ముఖ్యమంత్రమైన ప్రణవ (ఓంకార) మెట్లో తచ్ఛక్తివైన (మాయవైన) నీముఖ్య మంత్రము మాయాబీజము (హ్రీం) నట్టిదే. అదే తైత్తిరీయ శ్రుతి "హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ" అని యెలుగెత్తి పలుకు చున్నది.

బృహదారణ్యకశ్రుతియు—

"ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే।
యుక్తాహ్యస్య హరయః శతాదశహ్యయం వై హరయః।

ఇంద్రుఁడు పరమేశ్వరుఁడు. తనమాయలచే (శక్తులచే) ననేకరూపముల నొందుచున్నాఁడని. బహువచనముతో ఇచ్ఛా జ్ఞాన క్రియారూపశక్తులు మూఁడుగా "హరయః" అని శక్తి యను నర్థము నిచ్చును. హరి "హ్రీ" అను దాని బహువచనమును గొనిపూరించినది. "హ్రీం" అను దాని రూపాంతరము "హరి".

ఇంతే కాదు. సామవేదమునందును మాయాబీజము రేఫము (రకారము) తోడి యుక్తముకాకయే హ్రస్వమైన "ఇకారము" తోనే యుగ్గళింపఁబడినది. "పృథ్వీహింకార అదితిర్హింకారో ద్యౌర్హింకారః పుర్నో వాతో హింకారః ప్రజాపతిర్హింకార ఉష్ట్ర ర్హింకారో మనో హింకారః" అని రేఫములేకయే హ్రస్వేకారముతోనే బల్కరింపఁబడిన స్వరమును శక్తిస్వరూపమే యని స్తుతింపఁబడినది.

ఇదే భువనేశ్వరీ సంహితయందు—

"సామసు ప్రథమా శక్తి ర్హింకారో మే మను స్మృత ||
హ్రస్వేకారయుతం తత్తు మాయాబీజం ప్రచక్షతే |

'సామమంత్రములందు సాటిలేని రచనమైన హింకారమే సీకు నచ్చిన మంత్రము. హ్రస్వమైన 'ఇ' కారముతో నున్న యదే మాయాబీజమును 'హ్రీం' నొక్కి చెప్పుచున్నది" అని సీవే మాకు నచ్చఁజెప్పితివి. దేవ్యథర్వశీర్షమందును—

వియదాకార సంయుక్తం వీతిహోత్ర సమన్వితమ్ ।
అర్ధేందు లసితం దేవ్యా బీజం సర్వార్థసాధకమ్ ॥
ఏవమేకాక్షరం మంత్రం యతయః శుద్ధచేతసః ।
ధ్యాయంతి పరమానంద మయా జ్ఞానాంబురాశయః ॥

"వియత్ (హకారము) ఆకాశముతోను, వీతిహోత్రుని (రకారము) తోను, చంద్రుని (బిందువు) తోను కూడఁగా నైన 'హ్రీం' అను నీమాయాబీజము చతుర్విధపురుషార్థముల నీయఁగలది; జ్ఞానసముద్రములును, నియతచిత్తులును, నిర్మలులు నైనవారలు, ఆ నీ యేకాక్షరమంత్రమునే ధ్యానించి పరమా నందస్వరూపులగుచున్నారు. అనఁగా ముక్తులగుచున్నారు." అని కొనియాడఁబడినది. కావున బ్రహ్మవాచకములైన ధ్రువము, తారము, ప్రణవము మున్నగునవి బ్రహ్మవాచకమైన "ఓం" కారమునకుఁ జెల్లునట్లే మాయాబీజనామములైన, శక్తి, మాయా, హృల్లేఖా, మున్నగునవి బ్రహ్మశక్తివైన నిన్ను దెల్పు "హ్రీం" కారమునకుఁ జెల్లును. "మాలినీ, శివవల్లరీ, శక్తి, కళా, మాయా, వాణీ, మూర్తి, బీజశక్తి, కుండలినీ" అను పదములు హ్రీంకార వాచకములు.

నీకును బ్రహ్మమునకును వేఱుపాటు లేమిచే బ్రహ్మమును దెల్పు "ఓంకారము" తచ్ఛక్తివైన నీకునుం జెల్లును. అటులే హ్రీంకారమునకును బ్రహ్మమునకునుం జెల్లును. కావున నే "హ్రీంకార ఉభయాత్మకః" అని శాస్త్రము.

తదా త్వాం తారయిత్వాహం సోమాత్యేతి బహుశ్రుతాః ।
తామేవ శక్తిం బ్రువతే హరిం మాత్యేతి చాపరే ॥

అమ్మా! నీపాదసన్నిధిని కోరి స్తుతించు సంకల్పము కలిగినపుడు, అది నీసంకల్పమే యగుటచేత నిత్యతృప్తవగు నీవిచ్చుమున సంతుష్టినొంది విచారము లేకయే నను నీవనుగ్రహించుచుందువు. త్రాహి మాం తారమా తల్లీ! హ్రీంకారిణీ! హ్రీం శరీరిణీ! నీకు నమస్కారము.

67. శ్రీమాయాశ్రీః :— అమ్మా! శ్రీశబ్దముతో నిన్ను సంబోధించునపుడు విష్ణుమాయాస్వరూపిణివి నీవే యని తోచును. కనుక నీవే సంహారచక్రమును త్రిప్పుచున్న దానవని మాకు దోచును. అమ్మా! సర్వభూతరూపముతో నీవే ప్రకాశించి యాకర్షణము చేసి యనుభవించునపుడు నీవే విష్ణుమాయవు. స్థూలమునందు సర్వభూతరూపముతో (అధిష్ఠాతృ రూపముతో) వెలసిన విష్ణుమాయకు నీకు నమస్కారము. సూక్ష్మమందు అధిదైవికమూర్తితో మహాశక్తిరూపముతో వెలసిన విష్ణుమాయకు నీకు నమస్కారము. పిదప స్థూల సూక్ష్మముల కతీతమైన కారణరూపకు విష్ణుమాయారూపకు నీకు నమస్కారము. ఇట్లు మిగిలిన స్థూలసూక్ష్మకారణముల కతీతమై మనోవాక్కుల కందని తత్త్వలక్షితమైన నిన్ను లక్షించి నమస్కారము చేయుచున్నాము.

అ నీవే శ్రీః (లక్ష్మి) నామముతో వ్యవహరింపఁ బడు చున్నావు.

68. శ్రీః :- శవర్ణ, రేఫేకారములు కూటమి యే శ్రీవర్ణము. శవర్ణము = ఆనందమును, రేఫము - తేజస్సును (జ్ఞానమును); ఈకారము = శక్తిని దెలుపును. కాఁగా జ్ఞానానందస్వరూప పరాశక్తివి నీవే. శ్రీశబ్దముచేఁ దెలియఁబడు బ్రహ్మవిద్యాస్వరూపిణి వనుట సిద్ధము.

మఱియు శ్రీశబ్దవాచ్యవై జ్ఞానానందస్వరూపవైన నీవే ప్రత్యేకభూతమందును "నేను, అహం, ఆత్మా" అనుపేళ్లతో వెలయుచున్నావు. ఈసత్యమును దెలియఁజెప్పుటకే ప్రత్యేక మనుష్యనామము మొదట శ్రీకారము చెప్పఁబడి "నీవు, నేను" అని వ్యవహరింపఁ బడుచున్న వస్తువు జ్ఞానానందస్వరూప పరమాత్మయే యని యనన్యత్వ మున్నొప్పించుకొనుటకే యార్యులు చేసిన యాదేశము. మానుషోపాధి నీకి శ్రీశబ్దవాచ్యవైన నీవు లేచిపోఁగానే మానుషనామమిని ఆత్మగౌరవార్థమైన శ్రీశబ్దము తొలఁగింపఁబడి యావోట "కీ, శే" అను నక్షరము లాదేశింపఁ బడును. ఈసత్యము నెఱింగినం జాలును, మానుష తనువు నాశ్రయించిన నిన్నెవ్వఁడు నవమానింపఁ జాలఁడు. సరిగదా "తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి" అనెడిమహావాక్యార్థమును సులభముగా నధిగమింపఁ గలఁడు.

అమ్మా! నీవు శ్రీశోభవు. నీచే సృష్టమైన ప్రత్యేక పదార్థమందు నేదే నొకగుణము వాంఛనీయము, ఉపకారము, తృప్తికరము నైనది కానవచ్చునవు దాశోభ నీస్వరూపమే. పుష్పముల దళవిన్యాస సుగంధాదిశోభ, తరుగుల్మలతాదుల

యందలి రోగనాశక శక్తిరూపశోభ. నీస్వరూపమే. సింహము నందలి పరాక్రమము, గజదేహమందలి బలము, మున్నగు శ్లాఘ్యగుణములు నీశోభాస్వరూపములే.

అన్నిటిని మించిన నీశోభ బ్రహ్మవిద్యాస్వరూపమైనది.

69. సంధ్యా :- అమ్మా! నీవు సంధ్యవు. మే మెట్టి శ్రేయమ్మును వాంఛించినను సార్థకసంధ్యానామమైన నిన్నే ధ్యానింపవలయును. ధ్యానయోగ్యవస్తువు; ప్రకృతినియతశక్తి స్వరూపిణి సంధ్యాదేవియే యని మాచిన్ననాఁడే పెద్దలు నీపాదములను (ప్రకాశ విమర్శవ్యాపకశక్తులనెడి నీవ్యాపక శక్తులు) బట్టించి ముప్పోకల ధ్యానింపు మనిరి.

"సమ్యక్ ధ్యాయతి ఇతి సంధ్యా" లెస్సగా ధ్యానింపఁ బడునది కావున సంధ్యా. "భ్రువో ర్ఘ్రాణస్య చ యా సంధి స్తత్రైవో పాస్యతే యోగిభి రితి సంధ్యా". కనుబొమ్మలును ముక్కును గలియు చోట నఁగా నాజ్ఞాచక్రమందుఁ జక్కఁగా ధ్యానింపఁబడుదానవు. కనుకను నీవు సంధ్యవు. అప్పట నిన్నుపాసించు ఫలము, మాబుద్ధివృత్తులు నమ్మ నీయఖండ జ్ఞానానందస్వరూపముకడకుఁ బ్రబోధించుటే.

పెద్దలు మాకా ధ్యానమార్గమును కవంత బోధించు నపుడే నిన్ను గాయత్రీ, సావిత్రీ, సరస్వతీ త్యాది నామములతోఁ బిలుపుడనుచు నందే నీశ్రీనామముఁ జేర్చిరి. నీశ్రీస్వరూపము మాకనుభూతముగుటకు నీసంధ్యానామమునే మే మాశ్రయింప

వలయును. నీవే గాయత్రివని చెప్పుచు నిన్నుపాసించుటకైన మంత్రమందు నీ శ్రీస్వరూపము నెఱింగి నిన్నుఁ జేరికొనుటకై ముఖ్యమార్గముగా నిన్ను ధ్యానించు ప్రక్రియనే వారు బోధించిరి.

“తత్సవితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి,
ధియో యోనః ప్రచోదయాత్”.

ప్రాణిప్రసవకారకుఁడైన ద్యోతనక్రీడనశీలుఁడైన పరమేశ్వరుని భర్గస్సునే లెస్స ధ్యానింపుమనిరి. వత్సా! నీసంధ్య యీ భర్గస్సుసుమా. అది పరమాత్మ నియతిప్రకృతిశక్తి. అదే సృష్టిస్థితిలయములఁ జేయునది. కావుననే భర్గస్సు “భ+ర్+గ్” అను ధాతువుల కూటమివలననైన యోగము సార్థకాఖ్య. “భేతి-భాసయతే లోకాన్, రేతి - రంజయతే జనాన్, గ-ఇత్యాగచ్ఛతేఽజస్రమ్, భరగో భర్గ ఉచ్యతే” లోకములను వెలిని బెట్టుట, వానిని పాలించుట (రంజనఁజేయుట) మఱల లోనికి నుపసంహరించుకొనుట యనెడి మూఁడు పనులు చేయునదే భర్గస్సు, అదే సంధ్య. దానినే ధ్యానింపుమనిరి. ఎంతెంతగా చింతింపుమనిరి. అప్పుడే నీవిశుద్ధజ్ఞానానంద స్వరూపమును జేరు నధికారివి కాఁగలవనిరి. ధ్యానింపఁగా ధ్యానింపఁగా బ్రహ్మ నియత పరాశక్తివైన నీవే, బ్రహ్మాభిన్నవైన నీవే పరాప్రకృతి రూపమున నాత్మస్వరూపమున నున్నావని కనుఁగొనవచ్చు ననిరి. అదే శ్రీనామక బ్రహ్మవస్తుధ్యానమనిరి.

బ్రహ్మాండమందు సమష్టికుండలినీ పరాశక్తియై సృష్ట్యాది పంచకృత్యపరాయణయై యున్న యామెయే పిండాండమందు వ్యష్టికుండలినీ రూపశక్తియై సర్వవ్యాపారము నాయకయై వెలయుచున్నదనిరి. అక్షరము, ఓంకారస్వరూపిణియు, బ్రహ్మసమ్మోహినియు నైన యీసంధ్యాదేవిని, వరదను బిలుచు చాతురి గడించుకొని దినమొక్కసారి పిలిచినంతనే యాసంధ్యాదేవి తన మూలాధారమైన కులకుండమును వీడి ప్రాణాపానశక్తి ప్రచోదనము చేసి మేరుపర్వతోత్తుంగశిఖరభూమిక యందుండు సహస్రారమునందుండు నా శివనాథునకు మిమ్ముఁ దీవెనలొసంగ బడుగ జే పోవు ననిరి. అయింతపాటి నేర్పు గడించుకొన్నప్పుడే నీవు బ్రాహ్మణుఁడవగుదువనిరి. అనఁగా బ్రహ్మజ్ఞానసిద్ధికి అర్హుఁడగుటకుఁ దగువాఁడ వనిరి. అప్పుడా సంధ్యాపరాశక్తియే మెచ్చి నీకోర్కెలను దీర్చుఁగాని నిలిచి యుండు నీపూర్ణానుజ్ఞ వడయక తన మూలస్థానమునకుఁ బోదు.

సముద్రదీక్షాచార్యులవలన సంధ్యోపాసనారోహణ క్రియాచాతురిని బొంది స్మరింతునేని నీవెంత సార్థకవేదమాత యగుదు. అనఁగా బ్రహ్మజ్ఞానమును యిచ్చునది యగుదు. అంతే కాదు నీకుఁ బూర్ణాయువును, శుద్ధజ్ఞానధనమును బ్రహ్మవర్చస్సును బెట్టి దిగిపోవు నని వర్ణింపఁబడితివి. సంధ్యాదేవి! శ్రీమాతా! శ్రీశబ్దవాచ్యవై స్థితిరూప బ్రాహ్మీదేవికాలంబవై లక్ష్మీనామంబుచు ధనధాన్యగృహారామపశుపుత్ర కళత్రాది సంపత్ప్రదాత్రివియై కావు మాతృభావముతో లోనుపాసింపఁబడి

భుక్తిముక్తుల రెంటిని ప్రసాదించు జ్ఞానానందస్వరూప బ్రహ్మ శక్తివే నీవనఁదగుదు.

శ్రీశబ్దమునకు బ్రహ్మమనియే యర్థము. శ్రీవిద్యకు బ్రహ్మవిద్యయని యర్థము. "వదంతి శం సుఖం శ్రేయః".

"ప్రకాశో దర్శనో దీప్తో రేఫో కృష్ణః పరం బలీ।
ఈ శ్రీమూర్తి ర్మహామాయా లక్ష్మీ రీకార ఉచ్యతే"॥

అని మాతృకాభిధానము కాన (సుఖమనఁగా నానందము, ప్రకాశమనఁగా జ్ఞానము) జ్ఞానానందస్వరూపిణివై శ్రీమూర్తిమూర్తివైన మహామాయవు. లక్ష్మీ శబ్దవాచ్య బ్రహ్మశక్తివి నీవే; బ్రహ్మవస్తువు. "న స్త్రీ న చ పుమాన్" అను శ్రుతివలన స్త్రీ కాదు. పురుషుఁడు కాదు. కాన నేరూపమున నేని నిన్ను భావించి భజింపవచ్చును. శక్తిశక్తిమంతుల కభేదము. శ్రుతిప్రతిపాదితము కానఁ దండ్రిగా భావింపఁబడిన బ్రహ్మవిషయమే తల్లిగాఁ భావింపఁబడిన బ్రహ్మము విషయ మగుటచే శ్రీచక్రమునకుఁ బరబ్రహ్మచక్ర మనియు శ్రుతి వ్యవహారము.

స్వభావమునఁ దల్లికిఁ దన పిల్లలయందుఁ బ్రేమ మెండనుట యెల్లరెఱింగినదే. ఉపనయనకాలమునఁ ద్రైవర్ణికులకుఁ జేయఁబడు బ్రహ్మోపదేశమును "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" అని యారంభించి యుపాసనవేళ ధ్యానమునకైన రూపకల్పనమున స్త్రీరూపమునే కల్పించి "వేదమాతా తు గాయత్రీ"

బ్రహ్మస్వరూపిణివైన నిన్నుఁ దల్లిగానే యారాధింపు మనిరి. ఆ బ్రహ్మోపదేశము కాఁగానే వటుఁడు మాతృరూప బ్రహ్మమునకు నీకే మ్రొక్కవలయును. శిక్షావల్లియు "మాతృదేవో భవ, పితృదేవో భవ" అనుచు ముందుగా మాతృపూజనే శిక్షించినది. కావున బ్రహ్మభిన్నవగు నిన్ను మాతృరూపమున నుపాసించుటే శ్రేష్ఠఫలదాయకమని శిక్షించిరి. అమ్మా! నీవు సంధ్యవు. మేము స్వస్వరూపజ్ఞానలాభమును గోరినను మఱి యనుసిద్ధిని వాంఛించినను నిన్నే ధ్యానింపవలయునని యాచార్యశిక్షణమువలన గ్రహించితిమి.

70. ప్రభావతి :- కుండలినీపరాశక్తివి. నీవే సంధ్యా గాయత్రీ సావిత్రీ సరస్వతీత్యాది నామములతో నిన్ను శ్రద్ధాభక్తులతోఁ బిలిచి చేయు నారాధనమంతయు మూలాధార కులకుండమునుండి నిన్ను లేపినంత నీవు కరుగించి సుషుమ్నా పథమందుచ్చరించి సహస్రారమునుం జేరునప్పుడు యథార్థముగా "ప్రభావతివే" యను మాట స్వానుభవమున గ్రహించి యానందించిన యధికారివృత్తులే నీకు "జ్యోతిష్మతి, ప్రభావతి" యన పేళ్ళు పెట్టిరి. ఓ పరాశక్తీ! నిన్ను మేము మఱియొక విధముగా గౌరవింతుము. ఏది మేము నియతముగా ధ్యానింపఁ దగినదని యాచార్యులు శిక్షించిరో యా ధ్యేయభర్గస్సు నీవే. అది ప్రభావంతమైన సవితృభర్గస్సు. "ప్రభావతః సవితుః శక్తిః ప్రభావతీ" అనాహత విశుద్ధాజ్ఞాచక్రములయందు వివిధ ప్రభలతో యోగుల కనుభూతవు కనుక నీవు ప్రభావతివి.

ప్రభారూపమున జ్యోతిర్మూర్తివైన నిన్నధికారులు అనుభవింపఁ గలుగుదురు కాని వారికిఁ గల్యాణములనే యిత్తువు. అప్పుడే నీకుఁ "కల్యాణి" యనియుఁ బేరయ్యెను. అమ్మా! అక్షరా! ఓ ఏకాక్షరవాచ్య బ్రహ్మరూపిణీ! నీకు నమస్కారము.

71. సావిత్రీజననీ :- సవితృశక్తివైన తల్లీ! సవితృశక్తి నీ కాత్మస్వరూపముచేసి యారాధించు నధికారులఁ గుర్తించుదానా! యని సంబోధించుచున్నాము. మా శత్రువులను మందేహాసురులను ఖండించు శక్తివి నీవే కనుకఁ బెద్దలు నీమంత్రమైన గాయత్రీమంత్రముతో సవితృమండల మధ్యస్థనారాయణశక్తివైన నీకే యర్ఘ్యప్రదానము నిత్యము చేయుచున్నాము. ఎన్ని యుపాయములచేతను రాముఁడు రావణాసురు నోడింపలేక ముగ్ధుఁడై చింతిల్లుచుండినపుడు భగవానుఁ డగస్త్యమహర్షి దర్శనమిచ్చి యాదిత్యహృదయ మనెడి మహామంత్రరాజము నుపదేశించెను. అందుఁ గానవచ్చు రిపుఘ్న శత్రుఘ్నాది విశేషణము లా రవికిఁ (ఆదిత్యునకు) గడు నన్వర్థములగుటచేతనే సర్వాత్మనియంతరిపుఘ్నలక్షణశక్తివైన నీవు రామునితో నొక్కటై యుబుక లోకకంటకుఁడైన రావణాసురుని నాశమునకు హేతువయ్యెను. అమ్మా! మాయందు సైతము నీవు శత్రుఘ్నమూర్తితో వెలసి మాకు శత్రుపరాజయబలమును బెట్టి సంరక్షింపుము. నీకు నమస్కారము.

తుష్టిః పుష్టి ర్ధృతి ర్కీర్తి శ్చంద్రాదిత్య నిషేవితా ।
భూతి ర్భూతిమతాం సంధ్యా విశ్వాసే విశ్వధారణే ।। ।

72. తుష్టిః:- అమ్మా! ఇష్టప్రాప్తియు ననిష్టనివృత్తియు ననెడి ఫలములను గోరి నిన్నుపాసించు శుద్ధాధికారులలో మహాశాంతి హేతువైన సంతోషరూపమున నీవు వెలయుదువు. ఏ సాధకులలో సావిత్రిపై వెలసి యుండేహామిక సంప్రదాయ శక్తుని నారంభములను సంహరింతువో వారిలో నులుకు మహాశాంతి హేతువైన స్వరూపజ్ఞానమును బెట్టు శక్తివై వెలయుచున్నావు. నీకు నమస్కారము.

73 పుష్టిః:- అమ్మా! నిన్నుపాసించు భక్తుల యన్నమయకోశమునకే (స్థూలదేహమునకే) కాక ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము లనెడి కోశముల కన్నిటికిని క్రమముగాఁ జైతన్య, బుద్ధి, విశేషజ్ఞానసంతోషముల నెడి ద్రవ్యములను బెట్టి పుష్టిని గల్గింతువు భక్తికారణముగా నైన బ్రహ్మజ్ఞాన విభూతివలననే తుష్టిపుష్టులు గలుగును. ఆ రూపమున వెలయు నీకు నమస్కారము.

74. ధృతిః:- అమ్మా! నీవు ధృతివి. నిన్నుపాసించు శుద్ధాధికారులకుఁ గృపతో నీవు పెట్టు తుష్టిపుష్టులవల్లనే ధృతి లాభము (మనస్సు మారకుండ గారణమున్నను మారకుండుట) కలుగును. దానివల్లనే శుద్ధాత్మశక్తి వికాస మగును. అమ్మా! అపుడే నీవ్రూపమును ధరించి యుందువోనట

యనెడి బాధయు కలుగును. కావున దుర్గాంబా! మాలోని ధృతి రవ్వంతయు జాఱనీకుమమా.

75. దీప్తిః:- అమ్మా! నీవు దీప్తివి. ప్రకాశింపఁ జేయు దానవు అనఁగాఁ బయల్పెట్టుదానవు. ఏలాఁగు నీవు ధృతిరూపమున మాలో నిలయుదువో యానాఁడే యాత్మస్వరూపదాయనాయికవై మా యల్పాహంతను నీస్వరూపమేయైన పూర్ణాహంతలోఁ జేర్చివేయుదువు. నీసంధ్యా నామ పారిస్యము వలెంగియే యనుసంధానించు సత్కారులలో బ్రహ్మజ్ఞానమును ప్రకాశింపఁ జేయుదువు. తత్ఫలముగాఁ దప్పక సాయుజ్యమే మా చరమవాంఛితమైన పరప్రాప్తి. నీకు నమస్కారము.

76. చంద్రాదిత్యవివర్తినీ:- అమ్మా! దీప్తిస్వరూపిణివైన నీవే నీసృష్టిసంకల్పమువేళఁ దొలుదొల్త సూర్యచంద్రుల రూపములతోనే యవతరించితివి. ఈరెండును నీబహుత్వసంకల్పమువల్లఁ గల్గిన ఘనీభూతతేజస్సులే. "సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్" శ్రుతి. ప్రత్యేకముగ మందును దొల్త నీవు దీప్తిస్వరూపముల నొందుటకే సంకల్పించుకొందువఁట. తినవాతి నీసంకల్పము చేసిన ప్రత్యేకోపాధియందును నీవే యాత్మరూపముతో వ్యాపించి యుండి నిస్స్వరూప మయిన జగద్వస్తుజాలము నారయుటకనువుగా వేఁడివెలుఁగు చలివెలుఁగు వేషములతో నుదయించితివని మాయూహము. ఆరెండు వెలుఁగులను బోషించుట నీపనియే. కావున నీవు చంద్రాదిత్యవివర్తిని యనుచున్నాము. మఱియు శుద్ధాచార్యులు దీక్షాదానము

చేయునప్పుడు సూర్యచంద్రులందుఁ జొచ్చి, యనఁగా నిడా పింగళానాడులయందుఁ జొచ్చి యాగ్నేయివైన నీవే, నాద రూపబ్రాహ్మీశక్తివైన నీవే స్వదీక్షానుగ్రహణాధికారుల యాత్మ స్థానమునఁ జొచ్చి నిల్తువు. "అగ్నిర్వై వాక్" అని శ్రుతి పలుకుటచేత నీవాగ్నేయి వంటివి. మఱియు నాత్మస్థానము నీదే.

ఋషులు భగవంతునిచేతను, యోగదేవివైన నీచేతను దీక్షానుగ్రహణాధికారులచేతను, నియోగింపఁబడిన మహాత్ములైన దీక్షాచార్యులు తమ యోగశక్తిచేత (అనఁగా శక్తిపాతచాలనచేత) యథావిధిగా స్త్రీ పురుషులకుఁ దగు సమయమున శుద్ధదీక్షాదానము చేయుదురు. ఆవిధముగా సంస్కారలక్షణ యుత శుద్ధదీక్షనొందిన ప్రాణులు ధర్మబుద్ధి గలవారలై క్రమముగా యోగసిద్ధులై యాత్మధ్యానానుసంధానమందు నిరతులై తొలుత బ్రహ్మసామీప్యలాభమును, తరువాత బ్రహ్మ విభూతిలాభమును గడించుకొనఁగలరు. అనఁగా బ్రహ్మము కంటె వేఱుకాని తమ సత్యత్వచిత్త్వ సుఖలక్షణములయందుఁ బ్రతిష్ఠితులగుదురు. "అహం సత్యం, అహం చిత్, అహ మానందః" అనెడి యనుభూతి నొంది స్వస్థులగుదురు. (సోఽ హం సమాధ్యవస్థయందు నిల్తురు) శుద్ధదీక్షాదాతలు కులా చార్యులు అనఁగాఁ దమవంశమునకు ముందు మేలు కోరువారై (పురోహితులై) యాచార్యత్వము వహించు వారలని మాత్రమే యర్థము కాదు, కులమనఁగా యోగశాస్త్రమందు సుషుమ్నా

పథము. తేజోవతివైన నిన్ను సుషుమ్నాపథవియందు సూర్య చంద్రుల నెడి యిడాపింగళానాడుల గతిరహితముతో నీస్వరూపమేయైన చైతన్యము నారాధింపఁజేసి (విస్తరింపఁజేసి) నిన్ను నాత్మస్థానమునఁ జేర్తురు. ఇదే యోగము. ఈవ్యవసాయము చేయువారు యోగులు. (ఇచ్చట శక్తిపాతమనెడి నాంచనమును జనువరులు జూచునది)

మంత్రస్రష్టలు, మంత్రద్రష్టలునైన మహాయోగులు దీక్షాదానకాలమందు నాదబ్రహ్మశక్తివైన నీస్వరూపముకంటె వేఱుకాని బీజాక్షరములను మననముచే ప్రాణము కలిగించు వానిని దీక్షితులలో వేయుదురు. కర్షకుఁడు భూమిపై నిలిచి విత్తులను జల్లునట్లు మంత్రిగులు వేయు బీజములు ఆకాశగుణ (శబ్దగుణ) విశిష్టమైన కర్ణద్వారమున జారి భూతత్త్వవిశిష్టమైన మూలాధారమందు నాటుకొనును. ఆచార్యుల కృపాకటాక్షవీక్షణ సుధారసప్రోక్షణముల చేత నార్ద్రీకృతమై దీక్షితుని భక్తిశ్రద్ధాగ్రహముల నెడి దోహదద్రవ్యముల సంబంధము చేతను ఆమంత్రబీజములు జ్ఞానాంకురములను దొడిగి క్రమముగా నవి విశిష్టజ్ఞానప్రసారముల నెడి పత్రశాఖాములతో నలరి జ్ఞానమహావృక్షరూపమున విశుద్ధచక్రమునకుఁ గ్రమముగా నాత్మస్థానమునకును బోయి పుష్పించి ఫలించి పునర్బీజరూపము నొందును. అధికారి శిష్యునకింత మహోపకారము చేయఁగలవారు మహాత్ములు కనుకనే మంత్రజపప్రక్రియాదిని ఆమంత్రస్థులనే శిష్యముసందు న్యసించి గౌరవించు విధి పురాచారమందున్నది.

అమ్మా! దుర్గాంబా! నీబిడ్డల దుర్గములను దరింపఁ జేయుటకై స్నేహమయివైన నీవు దీక్షాదానవేళ నధికారి శిష్యులలో నన్ని వేషములతోనో వెలసి యెన్నిక గనుచున్నావు. నీకు నమస్కారము.

77 భూతిమతాంభూతిః : అమ్మా! ఐశ్వర్యవంతులైన వారిలో నైశ్వర్యరూపమున నీవే యున్నావు. అమోఘ సంకల్పములచేత నీశ్వరివైన నీవు జాగతవస్తువులుగాఁ బ్రకాశించి యున్నంటను నొక గొప్పతనము రూపమున నున్నావు. అది విశేషించి యున్నచోట నదే విభూతి పేర నొప్పును. ఈశ్వరీ! ఎందెందు నీవట్టి గొప్పతనముగా నున్నావో యది తెలియుటయే మనుజులకు నల్పబుద్ధుల కసాధ్యమే. నీవిభూతిస్వరూపములను నీవు చెప్పవలసినదే. జగన్మయీ! బ్రాహ్మణుల యందు బ్రహ్మజ్ఞానము; సింహమందుఁ బరాక్రమము; గరుడుని యందు దూరదర్శనశక్తి; ఓషధులయందు రోగహరణ శక్తి; అశ్వత్థ, వట, బదరీ, బిల్వాదులయందు జ్ఞానప్రదానశక్తి; అయస్కాంతమునందు నినుము నాకర్షించుశక్తి; యివి మున్నగా దేనియందెట్టి గొప్పతనమున్నను, దేనియందే రూపమున నీవిశేషస్థితి యున్నను నది భూతివిభూతిశబ్దముల తోనే పరఁగును. అన్నియు నెన్నికొనఁదగినవే; కాని అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము ననెడి యెనిమిదియే సుప్రసిద్ధములు. ఉపాస్య స్వధ్యాదేవివైన నన్నునుసంధానించునప్పుడు జీవలోకోద్ధరణ

బద్ధకంకణులై నీవే యధికారస్వరూపులైన వారిలో మున్నుగాఁ బుష్టి, తుష్టి, ధృతి, దీప్తులుగా వెలసి క్రమముగా దీక్షాచార్య రూపిణివైన నీవే అష్టవిభూతుల (ఐశ్వర్యముల) స్వరూపమునఁ బ్రకాశింతువు. అట్టి యధికారులే ధన్యులు. భూతిస్వరూపిణీ! నీకు నమస్కారము.

78 సంక్షిప్త వివ్యాస సిద్ధాంతము :- అమ్మా! నీవు సర్వస్వరూపవు. సర్వేశ్వరివి. సర్వశక్తి సమన్వితవు. కురుక్షేత్రమనెడి మహాసమరాంగణమునందు జరుగుచుండు దేవాసుర యుద్ధమునందు నాసురీసంపదకుఁ బరాజయమును, దైవీసంపదకు విజయమును గలిగించుచున్నావు నీవు. దైవీసంపద్విశిష్టులై నిన్ను పాసించు నధికారుల భూతిని త్వము నీస్వరూపము. నీవే యష్టసిద్ధిస్వరూపమున వారిలో వెలసి పరప్రాప్తికి మూలమైన యాత్మజ్ఞానమును బెట్టుదువు. వారే జీవన్ముక్తులై నీసర్వశక్తి సమన్వితమును, నీయశస్సును, నీధర్మసంస్థాపనదీక్షను, వేనోళ్ళఁ గొనియాడుచు భయరహితులై పునర్జన్మభయము లేనివారై దిక్కులయందుఁ బ్రచరింపఁజేయు చారులై నిన్నుఁ బూజింతురు. "భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోఽస్తు తే."

స్తుతాసి త్వం మహాదేవి। విశుద్ధేనాంతరాత్మనా।
జయో భవతు మే నిత్యం త్వత్ప్రసాదా ద్రణాజిరే॥ ౧౧

అర్జునుడు పరమభక్తితో యోగదేవిని భగవదుపదిష్ట రీతిని స్వాభీష్టసిద్ధికొఱకు స్తుతించునపుడు "విశుద్ధేనాంతరా

64,703

త్మనా" ఈస్తుతి విశుద్ధమైన యంతరాత్మతోఁ జేసితి ననెను. వేలన మున్ను భీష్మద్రోణకృపాద్యాచార్యుల శుశ్రూషాసాంగత్యములచే శుద్ధమైనదే యాధికారిసాధకుఁడైన యర్జునుని యంతరాత్మ. అపుడు శ్రీకృష్ణుఁడు మంత్రదీక్షాదానము చేయఁబూని "శుచిర్భూత్వా మహాబాహో సంగ్రామాభిముఖేస్థితః" అని యాదేశించెను. సాధకశేఖరుఁడా! (1) నీ వపుడు నీ సర్వేంద్రియములు విషయస్పర్శము లేక పవిత్రముగా నుండవలయును. (2) విశుద్ధ బుద్ధిమంతుఁడవై యుండవలయును. అనఁగా సత్త్వవస్తువైన యోగదేవియు, స్తోతవగు నీవు, స్తుతియనెడి బీజాక్షర పదవాక్యఘటితభావము భిన్నములు గాక దేవీస్వరూపమే యనెడి మనోనిశ్చయము వలయును. (3) సదాచార్యదీక్షచే నైహిక సర్వార్థప్రాప్తియుఁ బరప్రాప్తియుఁ దప్పక లభించు ననెడి శ్రద్ధావిశ్వాసములు మనస్సున నిల్కొనవలయును. ఇట్లు మూఁడు విధములైన శుచిత్వము గలవాఁడవై విద్యాగ్రహణము చేయవలయును. "నీవు శుద్ధుఁడవే కావచ్చును గాని; యిపుడు పోరికిఁ దొరకొన్న వేళ నంతటి శుద్ధాంతరాత్మునకును చిన్నదెబ్బ తగులవచ్చు" ననెడి భావముతోనే శ్రీగురుఁ డాదేశించిన విధమున జపాంగముగా మూఁడు విధములైన శుచిత్వము గలవాఁడనై నిన్ను స్తుతించితిని గావున "విశుద్ధాంతరాత్మనా" యని నిశ్చయముగా దేవికి నివేదించుకొన్నాఁడు.

విశుద్ధాంతరాత్ముఁడైన యుపాసకుఁడు మొట్టమొదట చేయుపని శరణాగతి ముద్రాదర్శనము. శరణాగతియన్నను,

అతిశ్శీఘ్రమన్నను, సోఽహంభావసిద్ధియన్నను నొక్కటే. సర్వసిద్ధులను గూడ సాధకుడు ప్రదర్శించు శరణాగతిముద్ర యందు "గురు మంత్ర మంత్రి దేవతా మనః ప్రాణానా మైక్య నిష్పాలనా దేవ సర్వసిద్ధిః" అనెడి యుత్తరార్థము శ్రీపాదు రామకృష్ణోపదేశరూప శాసన మిమికే యున్నది. ఏకీభా వాస్యోర్దైనను చేయు మహోపదేశమిదే. కనుకనే యుద్ధ ముందు దేవి! నీప్రసాదమును గడించుకొన సాలంబమైన శ్రీపరమ రామోపదేశమును పాటించుటచేతను; విశుద్ధుడనైతిని గనుక నీదయచే యుద్ధాంగమందు శాశ్వతముగా నాకు జయ మగుఁగాక యని ప్రార్థింపఁగలిగెను.

ఇచట జయమానంగా దను ముప్పాలార్థమునకు వినో ద్భుతైన వారి నాశమునయుఁ; దాను శుద్ధాత్మస్వరూపమందు నిల్వఁగల్గుట యునియు రెండు. ఇందు మొదటిది జాగతికార్థ లాభఫలకము, రెండవది పరప్రాప్తిఫలకము.

ఇచట "శుధి దృత్యత్వా మహాబాహో" అనునది మొదలు "స్తుతాఽసిత్వం మహాదేవి" అను శ్లోకమువఱకు నైన పదునైదు మంత్రములతో దీక్షాస్వీకారము ప్రతిపాదింపఁబడి నది. ఈస్వీకారము యజ్ఞాధ్యయనవిధానములు లక్షణముగాఁ గలది. యథార్థముగా నిది స్వాత్మస్వరూపబుద్ధితో నియతమైన కర్మానుష్ఠానస్వరూపమే. కనుక నిది యథార్థయజ్ఞము. ఈ యజ్ఞమందు సామాన్యయజ్ఞమునందువలె దేశకాలముల నెన్ను కొనుటయు, సమిత్కుశాది యజ్ఞసాధనద్రవ్యమును సేకరించుట

మున్నగునవి లేవు. ఈ యోగదేవీదీక్షాదానయజ్ఞము సర్వత్ర ఆత్మబుద్ధితో స్వాంశభూతుఁడైన యర్జునునకుఁ జేయఁబడినది. ఇందుఁ బరమాత్మభావమే పెంపొంది, స్వాత్మస్వరూపముతో నున్న యాతేజోమయ యోగశక్తియే స్వాంశభూతుఁడైన యర్జునుని యాత్మస్వరూపమందు నిలిచి యాత్మయందు నియతమై యున్న యోగశక్తి ననుస్మరింపఁ జేయుట కొఱకును, అతఁడు తప్పక చేయఁదగిన వ్యవసాయము పూర్ణమగుటకును అతి నియమంగా యోగశక్తియే వెదఁజల్లఁబడినది. ఈవిధమైన తేజస్సును దీక్షార్థియందు వెదఁజల్లుటయే దీక్షాదానము. ఇదియే మహాయజ్ఞము. తరువాత మంత్రదీక్షాగ్రహణము చేసిన యర్జునుఁడు "నమస్తే సిద్ధసేనాని" మొదలుగా "భూతి ర్భూతిమతాం సంఖ్యే వీక్ష్యసే సిద్ధచారణైః" అను సంబోధనములు గల మాటలతోనే యోగదేవి యభివర్ణితయైనది. [illegible] స్వాత్మవస్తువు భిన్నకాదని యేకత్వవిజ్ఞానముతోనే యను సంధానింపఁబడుటవలనను, అది విద్యాస్వరూపమగుటవలనను నప్రమత్తుఁడైన యర్జునుని యధ్యయనము పూర్ణమైనదని తెలియుచున్నది.

తరువాత "స్తుతాఽసి త్వం మహాదేవి! విశుద్ధేనాంతరాత్మనా"-"జయో భవతు మే నిత్యం" అను దానిచేత నర్జునునిచేత నుపాసింపఁబడు దేవతయును దనకును నభేదము నని నిశ్చయముతోఁ జేయఁబడినది. సోఽహంభావనాస్వరూపమైన యాత్మార్పణమే ప్రతిపాదింపఁబడినది. అదియే మంత్రజపసిద్ధికి మూలము. అదియే దానము.

తతః పార్థస్య విజ్ఞాయ భక్తిం మానవవత్సలా ।
అన్తరిక్షగతోవాచ గోవిందస్యాగ్రతః స్థితా ।

ఇప్పుడు సంజయుఁడు వస్తునిర్వృత్తమైన దుర్గాస్తోత్రమంత్ర జపములచే సంతుష్టయై ప్రసన్నయైన శ్రీదేవి యేమి చేసినదో చెప్పుచున్నాఁడు.

ఆమెకు మానవులయెడ వాత్సల్యము—మనుసంతతివారు మానవులు. తనసంకల్పముచేతనే సమష్టిజీవయై తన్యమే మనువు. వ్యష్టిజీవయై తన్యమే మానవుఁడు. భక్తుఁడు తనమానవత్వమును వీడి మనుత్వమును బరిగణించి గౌరవించి జపస్తుత్యాదుల నాత్మార్పణబుద్ధితోఁ జలుపు భక్తునియందు యథార్థమైన బిడ్డనెయ్యమును జూపకుండఁ జాలదు. కనుక దుర్గాంబ మానవవత్సల. ఏమన మానవులు చేయు సర్వసంసార వ్యాపారముల యందును బారిశుధ్యమును గుర్తెఱిఁగి యుండు నాయకత్వమును వహించునది యామెయే; సకలజనని. స్వభావముచే సర్వమానవలోకము నెడను సమప్రేమము కలదియే. ఇప్పుడర్జునుఁడు సర్వమానవలోక ప్రతినిధియై స్తుత్యాదులచే దుర్గాంబను బరితృప్తను జేసి మానవులు సర్వాభీష్టముల నొందఁగలరని చాటుటకు బ్రతినిధిగా నిల్చిన వాఁడగుటచేత వాత్సల్యపాత్రుఁడు.

పార్థుఁడు చేసిన విధిపూర్వకస్తోత్రమంత్రజపానుష్ఠానము ముగియుఁగానే యాతఁడనిన వాక్యములనుబట్టి యర్జునుని కోరిక

శుద్ధకామరూపులచేఁ బోషింపఁబడుట యెఱిఁగి జగన్మాత యార్తిని వాంఛితమైన జయము వర్తమానప్రాకృతయుద్ధమందే గాక పరప్రాప్తివిషయము లక్షితమునియుఁ దెలియుచున్నది. అర్జునుని హృదయము నలంకరించినది భక్తివిభూతి. ఈ భక్తి విభూతులు భిన్నములుకావు. కావున భక్తుఁడే విభూతిమంతుఁడు. విభూతిమంతుఁడే భక్తుఁడనెడి న్యాయముచే నది యర్జునునిలో వ్యాపించియున్న పరమాత్మస్వరూపమందుఁ బ్రతిబింబితమైనదే యా భక్తివిభూతి యని తెలియవలయును.

అమ్మా! శ్రీదేవి! బ్రహ్మప్రతిష్ఠారూపుఁడును; బ్రహ్మప్రతినిధియునై దీక్షాచార్యత్వమును వహించిన భగవద్వ్యాసుదేవు నెదుర నిల్చి ప్రత్యక్షమై (అనఁగా నితరులకుఁ గానరాక యని భావము) యంతరిక్షమున నిల్చి పలికెను. అధికారిసాధకపక్షమున నీయంతరిక్షము చిదాకాశ (దహరాకాశ) మండలమే. ఈశ్వరుఁడను పేరితో సర్వభూతముల హృద్దేశమందుండువాఁడే యాగోపించును. ఇతని మొదటనే దేవి వక్ష్యమాణ విషయమునఁ బల్కినది.

"స్వల్పేనైవతు కాలేన శత్రూన్ జేష్యసి పాండవ ।
నరస్త్వమసి దుర్ధర్ష నారాయణ సహాయవాన్ ।
అజేయస్త్వం రణేఽరీణామపి వజ్రభృతః స్వయం ।
ఇత్యేవ ముక్త్వా వరదా క్షణేనాంతర ధీయత ।

ఇది దేవిచేసిన వరాభయదానము. ఓయీ పాండుపుత్త్రుఁడా! కొలఁది నాళ్ళలోనే నీవు నీశత్రువులను జయింపఁ

గలవు. నిత్యనారాయణసహాయము గల వరుఁడవు. నిన్నుఁ జేతిమాఱఁగలవాఁడు లేఁడు. యుద్ధమందుఁ బగతుఁడు నిన్ను గెలువలేఁడు. వజ్రహస్తుఁడై యింద్రుఁడు తానే నిన్నెదిర్చినను గెలిచి పోఁజాలఁడు.

ఇపుడు అర్జుననామముతోఁ బరఁగు నీవు కేవల నారాయణాంశుఁడైన నారాయణు నిజయుతుండు వరుఁడవు. నీవు నరాంశముతోఁ బుట్టిన వాఁడవు. కావున సర్వసంహారకశక్తి గల వజ్రమనెడి యాయుధమును దాల్చిన యింద్రునకైనను అనఁగా బ్రహ్మాదులను సృష్ట్యాదికర్మలయందు నియోగించిన సర్వశక్తిమంతునికైనను, అనఁగా ధర్మమును శాసించు పరమాత్మునికైనను స్వభావము చేతనే యజేయుఁడవు.

ఇట్టులు వరము లిచ్చి యోగదేవి తన చూపిన వాత్సల్యమునకును ప్రసన్నతకును ఫల్గుణుఁడు హర్షించుటను గాంచి కనుమొఱఁగిపోయెను. ఇచట అర్జునునియందుఁ గాంచిన హర్ష లక్షణమే శ్రీదేవి తన పూజగా స్వీకరించినదని యభిప్రాయము.

ఈవిధాన సక్రమశిక్షాపూర్వకముగా నరాంశజునిచే నుపాసింపఁబడిన దుర్గాస్తోత్రమంత్రరాజ మహాత్మ్యమును (ఆచార్య శిష్యులైన) కృష్ణార్జునుల స్వరూపమును, దక్ష ధార్తరాష్ట్రుల స్వరూపమును దెల్లఁ బ్రతిపాదించి యోగదేవి వలన నర్జునుఁడు పొందిన వరమును దెలిపి సంజయుఁ డిట్లను చున్నాఁడు.

"మోహాన్నైతే న జానన్తి నరనారాయణావృషీ ।
తవ పుత్రా దురాత్మానః సర్వే మన్యువశానుగాః ।
యత్ర ధర్మో ద్యుతిః కాంతి ర్యత్ర హ్రీః శ్రీ స్తథా మతిః ।
యతో ధర్మ స్తతః కృష్ణో యతః కృష్ణ స్తతో జయః ।

ఓ రాజా! స్వభావముచేతనే దుష్టాత్ములైన నీ కొడుకులు (దుర్యోధనాదులు) మోహమువలన (అయథార్థజ్ఞానమువలన) శ్రీకృష్ణార్జునులు సకలధర్మవేత్తృత్వము సహజముగా నొప్పెడి పురాణమునులైన నరనారాయణులుగా నెఱుఁగ లేరైరి. నరనారాయణాంశ సంభూతులైన ఋషులని యెఱుఁగలేరైరి.

సమస్త ధర్మపరిపాలనము, జగన్నాయకత్వమును వారిదే యని తెలియలేరైరి. కావుననే క్రుద్ధకోపాగ్నిస్వరూప మృత్యువునకు లోఁబడినవారలే.

ఎచ్చట (ఏ పురుషునియందు) ధర్మము, ద్యుతి, కాంతి, హ్రీ, శ్రీ, మతి, నిల్చియుండునో, యచ్చటనే ధర్మశబ్దవాచ్యుఁడును, శక్తికంటె భిన్నుఁడును గాని; శక్తిమంతుఁడగు శ్రీకృష్ణ పరమాత్మ (ధర్మి) తప్పక యున్నటులే.

సంజయుఁడు పలికిన హ్రీ, శ్రీ, ద్యుతి, కాంతి, మతి మున్నగు శబ్దములచేఁ దెలియఁబడు వస్తువులన్నియు యోగ దేవీపరాశక్తి స్వరూపములే యని స్తుతిమాలగ్రంథమందే కానవచ్చును. అస్తుతివివరణమందే యీ శబ్దముల తత్త్వ

మంతయు వ్యాఖ్యానింపఁబడినది. చదువరులు అనుశీలింతురు గాక!

హ్రీం, శ్రీం, ధృత్యాదులు యోగదేవి మహాశక్తిస్వరూపములే; యైనప్పుడు యోగీశ్వరుఁడును, భగవంతుఁడు నైన శక్తిమద్వాసుదేవునకంటె యోగదేవిమహాశక్తి భిన్నకాదు.

ధర్మశబ్దమును శక్తిపరముగానే శ్రుతి పలికినది. "అథాతో ధర్మజిజ్ఞాసా ...... (అరుణశాక్తోపనిషత్).

కావున భారతమందు ధర్మశబ్దముచే వర్ణింపఁబడిన శక్తియే ధర్మియైన భగవంతుఁడు శ్రీకృష్ణుడు. నిలవెన్నెలలకు వలె శక్తిశక్తిమంతులకు నభేదము- అవినాభావసంబంధము. కనుకనే "యతో ధర్మస్తతః కృష్ణః" ధర్మముండు చోటఁ గృష్ణుఁడుండు ననియు, అనఁగా శక్తితోడనే శక్తిమంతుఁ డుండుననియు, "యతః కృష్ణ స్తతో జయః" కృష్ణుఁ డుండు చోట జయము (గెలుపు) తప్పదనియుఁ జెప్పఁబడినది. మూల స్తుతియందు జయశబ్దము స్త్రీలింగమందు ఆకారాంతముగాఁ జేయఁబడి "జయా" అను యోగదేవిబోధకముగ నిల్చినది.

లబ్ధ్వా వరంతు కౌంతేయో మేనే విజయమాత్మనః।
ఆరురోహ తతః పార్థో రథం పరమసమ్మతం।
కృష్ణార్జునా వేకరథౌ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః॥

యోగదేవివలన వరమునొందిన కౌంతేయుఁడు తప్పక నేను విజయమొందఁగలనని నిశ్చయించుకొనెను. ఈ నిశ్చ

యముతోడిదే హర్షము. ఈ హర్షమునే స్తోత్రమంత్రజపానంతరమునఁ దన శక్త్యనుసారము చేసిన కృతజ్ఞతాపూర్వక పూజగా నెంచి సంతుష్టయై యుత్సవముతో నంతర్ధాన మొందెను. ఇప్పట్టు నందధికారిసాధకులు లక్షింపఁదగిన దొక విషయము. సాధకుఁడు స్థూలపూజయే చేయనీ; మంత్రజపస్తవ కీర్తనాదిక మేదే నుపాస్యదేవతాప్రీతిగాఁ జేయనీ, యా దేవతవలన సాక్షాత్కారము సముద్భవింపఁ వలయును. అనఁగా జపానంతరము సాధకుఁడు స్వస్థుఁడై కూరుచున్నపుడు దేవతామూర్తి దర్శనమై స్మేరముఖముతో వరాభయకరాభినయము గాంచుటో, బదులుగా నొక యశరీర వాక్కు హృదయాకాశమునుండి వినవచ్చుటో, యభీష్టసిద్ధిని సూచించు నుపశ్రుతుల సముద్భవించుటో కావలయును. తాదాత్మ్యముతో నుపాసింపఁబడుచుండిన దేవతాశక్తియే సర్వేంద్రియాధిష్ఠిత (ఖండఖండచైతన్యవర్గము) చైతన్యమే దేవతాస్వరూపము. ప్రత్యేకపూజయందును ప్రాణ (చైతన్య) ప్రతిష్ఠ తప్పక చేయఁబడుచుండును. అఖండచైతన్యవస్తువే ఖండఖండచైతన్యరూపమునఁ బ్రత్యక్షమగుచున్నది. సాధకుఁడు శరీరధారి. దేవతకు శబ్దస్పర్శరూపరసాది గ్రహణశక్తి విశిష్టతగల నేత్రశ్రోత్రనాసాజిహ్వా స్పర్శనేంద్రియములు గల తావులను సూచించు చెవి, ముక్కు, కన్ను, నాల్క మున్నగు నవయవములు లేకున్నను సర్వజ్ఞానేంద్రియశక్తులును, హస్త పాదాదులు లేకున్నను గ్రహణగమనాది కర్మేంద్రియశక్తులును బూర్ణముగా నుండును.

"అపాణిపాదో జవనో గృహీతా ।
పశ్యత్యచక్షుః, శృణోత్యకర్ణః"। —శ్రుతి.

"నాకు మానవాదులకు వలెఁ గాళ్ళు లేవు కాని, నేను వడిగా సర్వత్ర వ్యాపింపఁగలను; చేతులు లేవు గాని; నా పట్టునకు దొరకని వస్తువు లేదు. కనుగ్రుడ్లు లేవు గాని; నాకుఁ గానరానిది లేదు. చెవులనుదు లేవు గాని; నాకు వినరానిది లేదు" అని శ్రుతి ప్రమాణము కానవచ్చుటచే జప స్తవాదిసంతుష్ట దేవతానుగ్రహము ప్రత్యక్షము కావలయును. అనఁగా ననుభవింపఁ బడవలయును. సర్వజీవలోకప్రతినిధి, సర్వాధికారి, పార్థుఁడు పొందిన యనుభవ మిదే. అంతరిక్షగత యైన యోగదేవిని దర్శించుట, వరాభయ వాక్కులను వినుట, యనునవే దేవతానుగ్రహానుభవము. సాధకుఁడా! మనము చేయు నుపాసనాప్రక్రియాసంతతి యిట్టి యనుభవమునందియా యంతయో మనకుఁ గలుగకున్నచో జపాదులు చేసి పొందెడి సంతుష్టి మిథ్యాసంతుష్టియే. మంత్రార్థజ్ఞానము, దేవతతోడి తాదాత్మ్యము, త్రివిధశుచిత్వము నను జపాంగములలో లోప మున్నపుడే దేవతానుగ్రహ సాక్షాత్కారము కాదు.

యోగదేవి సాక్షాత్కరించి యనుగ్రహిత గాఁగానే యర్జునుఁడు సర్వపరికరములతోను సంసిద్ధముగాఁ నున్న శ్రేష్ఠమైన తనరథమును అప్పటికే దివ్య రథసారథిగా సిద్ధపడిన శ్రీకృష్ణునితో నధిష్ఠించె; వారు తమ శంఖములను దేవదత్త పాంచజన్యములను బూరించిరి. ఇచట నొక పరమార్థముండి

సత్త్వవిశిష్టత గల యర్జునుని యుపాసనము ఫలించినది. బుద్ధి సత్త్వమందే యాత్మవస్తువు ప్రతిభాసించును. గురుమంత్ర మంత్రి దేవతైక్యభావనమే ఆచార్యోపదేశము. అర్జునుఁడు రథమునుండి దిగి దీక్షాగ్రహణము చేసి యాతాదాత్మ్యము తోనే యుపాసించెను. శరీరమే రథము. శ్రీగురు సుశిక్షితుం డైన యర్జునుఁడు భౌతికస్థూలరథమును విడిచి అధికారిగా సాధకుల నెల్లరను గమ్యమును జేర్పఁగల మహామహోరథ మైన దుర్గాత్మక యోగదేవీరథమందే కూరుచుండెను. అప్పుడును జగద్దీక్షాచార్యుఁడైన నారాయణుఁడే సారథి. స్తోత్రవశవర్తియై శ్రీగురురూప శ్రీకృష్ణునకంటెను భిన్నకాని సర్వకారణభూతశక్తి యోగదేవి వరమిచ్చినది. విశుద్ధాం తరాత్ముఁడైన యర్జునుని రథము (శరీరము) ఇప్పుడు యుద్ధ విజయసాధనపటువులైన యోగదేవీ వివిధశక్తులననే పరికరము లతో సంపన్నమైనదగుటనే పరమరమ్యతమైనది. అనఁగాఁ గామక్రోధాది శత్రువులను జయించి పరప్రాప్తిని గలిగించు టకు సైతము తగియున్నదని పరమార్థము. గురుశిష్యులకు భేదము లేదని నరనారాయణాంశ సంభూతులైన శ్రీకృష్ణార్జును లధిష్ఠించిన రథము (శరీరము) ఇప్పుడొక్కటే. ఇప్పు డారథము నుండి శంఖధ్వని (శత్రువులకు కంపమును పెల్లగించునది శంఖము.) మంగళకర ప్రణవధ్వని బయల్వెడలినది. ఇది ద్వితీయపాద పరమార్థము. అవి దివ్యములు. ధ్వనిమాత్రము తోనే శత్రువులగుండె పగిలింపఁగలవి. ఆసురీసంపద్విశిష్టులైన

దుర్యోధనాదుల నపలఁగొట్టుటకు నరనారాయణాంశ సంభూతులైన రథసారథులు చేసిన ప్రయోగమిదే.

పాఠకుల కొక మనవి —

ఈస్తోత్రము పలువురచే ముద్రితమై ప్రకాశింపఁ జేయఁ బడినది. కాని శ్రీదేవి యర్జునునకు వరప్రదానము చేసి యంతర్హితయైన తరువాత నేమైనదో తెలియఁజెప్ప సంజయుని మాటలు గల మహాభారత మూలగ్రంథమందుఁ గలవాని కంటె వ్యత్యస్తములు, ప్రక్షేపములు కొన్ని కానవచ్చు చున్నవి. విశేగాఁ దెనుఁగు పుస్తకములయందు ఫలస్తుతి కాన వచ్చును. రాజు ధృతరాష్ట్రుఁడు సంజయుని బిలిచి యుద్ధ కాంక్షతోఁ గురుక్షేత్ర రణరంగమందుఁ గూడికొన్న నా వా రేమిచేసిరి ! పాండవు లేమి చేసిరి ! యని ప్రశ్నింపఁగా వ్యాస ప్రసాదలబ్ధదివ్యదృష్టితోఁ దా నేమి యటఁ గాంచెనో యాకథ మాత్రమే చెప్పుట సంజయుని పని. కథనసందర్భమున జరిగిన వానిలో నర్జునునకు దీక్షాదాతయైన శ్రీకృష్ణునివలన యోగ దేవిస్తోత్రమంత్రదీక్ష నొందుట యొకటి. అంతే దేవి సాక్షాత్కరించి యర్జునునకు శత్రుంజయవరప్రదానముఁ జేయుట యైనంతనే—

“తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ।

"పిదపఁ దెల్లగుఱ్ఱములు పూన్చిన గొప్పరథముపై నుండి గురుశిష్యులు మాధవపాండవులు ఇద్దరు (సారథి రథికులు) దేవదత్త పాంచజన్యము లనెడి తమ దివ్యశంఖములను బూరించిరి." అను వాక్యముతో ముగిసిన సంజయుని కథనము ప్రకృత స్తోత్రసందర్భమున ముగిసినది. ఆ తరువాతి చరిత్రముతో మనకు సంబంధము లేదు. తెనుఁగు పుస్తకములయందు స్తోత్ర ఫలస్తుతియును గలదు. లోకులయం దాస్తిక్యవిశ్వాసములు నెలకొల్పుటకు ఫలస్తుతివాక్యములు ప్రత్యేక దేవతా స్తోత్రాంతములయందుఁ గానవచ్చును. రాజు సంజయునివల్ల వినఁగోరినది, యాతఁ డాంతరదివ్యదృష్టితోఁ జూచినదాని కథనమే కాని, శ్రీకృష్ణోపదిష్ట దేవీస్తోత్రపాఠకులకుఁ గలుగు ఫలమేమి యని రాజడుగలేదు. సంజయుఁడు చెప్పనులేదు. ఫల యున ఆ తెనుఁగు ప్రతులయందె వ్యాసభగవానుని ప్రసాదము వలన నేను జూచిన దిది కనుక లోకులు దీనిని బఠించుటచేఁ బొందు ఫలము లిది యని చెప్పవని సంజయునికి లేదు. తాను జూచినదానిని బట్టి కృష్ణార్జున స్వరూపమును ధార్తరాష్ట్రుల యుద్ధానస్థితిని దానిఫలిత మిది యని తెలుపు నొక్కమాటను "సర్వే మన్యువశానుగా।" యనియాఁ దన కథనమును జాలించెను. తెనుఁగుపుస్తకములయందుఁ గానవచ్చు ఫలశ్రుతివాక్యములను మందాధికారుల వినోదమునకై వ్రాసి వానిని వ్యాఖ్యానించు నక్కఱ లేదని విడుచుచున్నాము.

ఇట్లే యథామతిగా మన్యమానోగ్రహాధికారుల నలరింపఁ గల సాధనోపయోగివాక్యములను వ్రాయుచున్నాను. అధికారి సాధకుఁడు ప్రాజ్ఞుఁడు "నమస్తే సిద్ధసేనాని" యని స్తుతింప నారంభించెను. సంబోధించి "నీకు నమస్కారము" అనుట యందు సాధనరహస్యమున్నది. అర్జునుఁడు దేవీసాన్నిధ్యమును గల్పించుకొని స్తుతించుచున్నాఁడు. "నీవు" అనుమాట యెదుర నున్న వ్యక్తినిగూర్చి ప్రయోగింపఁబడును. ఎదుర లేని వ్యక్తిని గూర్చి 'నీవు, నీకు' అనుట యుండదు. దేవిని ప్రత్యక్షము చేసి కొనుటకై యిట్లనినాఁడు. యథార్థసాధకుఁడే యిట్లు చేయును. స్తుతి, ఆవేదనము, నివేదించుట, దీనప్రార్థనము, జాలిపొక్కు ప్పదైనను దేవత నప్రత్యక్షనుగా నుంచి చేయుట.

అమ్మ యెక్కడనున్నది! — అలక్ష్యస్థానమందు — (కాన రానిచోట) నున్నది యని, నీ వామె నుద్దేశించి కల్పనాసహాయముతో నిచటఁ గూర్చుండి స్తుతిపారమో సాధనమో చేయు దువు, అట్టిభావ ముండునంతవఱకు సాధనమార్గమందు వడిగా ముందడుగు వేయఁజాలవు. సాధనరాజ్యమందుఁ గల్పనకుఁగాని, అనుమానమునకుఁగాని తావులేదు. అప్రత్యక్షము నుద్దేశించి యెట్టి సాధనయూ సాగదు. సాధనమందడుగడుగునఁ బ్రత్యక్ష భావానుభవము కావలయును. సాధనకుఁ బ్రత్యక్షతయే ప్రాణము.

ఈ సందర్భమున మంత్రచైతన్యవిషయము కొంచెము సాధ కులకు వివరింపక తప్పదు. ఏమన; మంత్రచైతన్యమువల్లనే

దేవతాసాక్షాత్కారమగును. చైతన్యహీనముగా నుండుటచేఁ బెక్కేండ్లు కఠినసాధన చేసినను నిష్ఫలమే; ఇదే ఋషుల యాదేశము.

మంత్రము శబ్దవిశేషము; దీనిని మననము చేయుటచేఁ బరిత్రాణము కల్గునేని యదే మంత్రము. మంత్రమువలనఁ బ్రతిపాదింపఁబడిన శ్రేష్ఠమైన యర్థమే గురువు. ఇట్టి యర్థము వల్లనగు ననుభవము పేరే చైతన్యము. అదే యిష్టదేవత; ఈవిధముగా మంత్రము గురువు, దేవత యను మూఁడిటిని, ఏకము చేయుటచేతనే మంత్రచైతన్య మగును. ఒక దృష్టాంతముచేత నీవిషయమును సులభముగాఁ దెలుపుదును. "చింతపండు" అని యొకమాట యున్నది. ఇదే మంత్రమనుకో. "చింతపండు" అను శబ్దము నర్థము తెలియనంతవఱకు, చింతపండేమిటో తెలియదు. అంతదాఁక నది వృథాశబ్దమాత్రమే నోరితో లక్షవారములు "చింతపండు" అనుచున్నను, దాని విషయమైన తెలివి కలుగదు. తరువాత నొకఁడు వచ్చి, చింతపండు రూపము, రుచి మున్నగువానిని జక్కఁగాఁ దెలియఁ జెప్పినపుడు, "చింతపండు" అనుదాని యర్థజ్ఞానము కలిగినది. ఈ యర్థము పేరే గురువు; మఱల "చింతపండు" అనుమాట యుచ్చరించినంతనే; కోలగా వంకరగానుండు దాని రూపము, దానిపులుపు రసము, మున్నగువాని జ్ఞానము కలుగును. మఱల నెన్నఁడేని "చింతపండు" అనఁగానే, దానిని జూడఁగానే దానిరుచి, మున్నగువాని జ్ఞానము నీయనుభవవ్యాపారము వికసించి నీ

నోరూరును, అది చైతన్యమయమైనదని తెలిసికొనుము. అటులే యంతట నమకో. "అమ్మా! దయామయి" యనుము. అపుడు దయానుభవముతో నీహృదయము నిండిపోఁగా, దయామయీ పదము. యథార్థముగాఁ బలుకఁబడినదని తెలిసికొమ్ము. నీవు "అమ్మ" యనుచున్నావు కాని, అమ్మ యెవరో యెఱుఁగవు. "అమ్మ" అనుమాటకు అర్థము నీకుఁ దెలియదు, ఇట్టి వ్యవస్థలో నీవు "అమ్మ" యనుచున్నది అది వ్యర్థశబ్దమే. మతెవ్వరేని, "అమ్మ" యనఁగాఁ బరిపూర్ణ స్నేహమునకాధార మయిన జగద్వ్యాప్తిచైతన్యము, అదియే "అమ్మ" యని తెలియఁజెప్పుదురు. గురుకృపచేత నీవాఁడీమాట తెలిసికొందువో, "అమ్మ" యనఁగానే, రమ్యమైన స్నేహఘనమును, చైతన్యమయము నైన యాత్మానుభవము, నీలో నేనాఁడుబుకునో యానాఁడే నీమాతృమంత్రము (అమ్మ యని నీయుచ్చరించినది) చైతన్యమయమైనదని తెలిసికొనుము. అర్థము నెఱుంగక, అర్థము ననుసరించు రసముతోను, భావముతోను, రసికుఁడును, భావుకుఁడును గాక; మంత్రస్తుతివాక్యముల నుచ్చరించుటచే మనుజునకు యథార్థఫలము చేకూరదు ఇదియే మంత్రచైతన్యమనఁబడి, వస్తువారతి లేకపోవుటచేతనే సాధన మార్గము దుర్గమమును, అంధకారబంధురమునుగాఁ దోఁచును. కావున నేదేని స్తోత్రపాఠమో, విశిష్టమంత్రజపమో, నామసంకీర్తనమో చేయువేళ నీయాధ్యాత్మికప్రగతికి సాయపడు సదర్థము నరసికొని యథార్థానురూపభావముతో స్వయం

సంవేదిస్తూఁడ వగుటకుఁ బ్రయత్నింపుము, అప్పుడే దానియథార్థ ఫలము వడిగా నొందగలవు.

ఇప్పుడు స్తోత్రమంత్రజపవేళ సాధకుఁడు ఎట్టి లక్ష్యము నిల్పవలయునో యథాగురూపదిష్టముగా యథానుభవముగాఁ జెప్పుచున్నాను. ఈస్తోత్రమందుఁ దొలుతఁ గొన్ని నామములు సంబోధనాంతములుగాను, దరువాతఁ గొన్ని ప్రథమాంతములుగాను, ఆపైని గొన్ని సంబోధనాంతములుగాను, మఱలనా పైని గొన్ని ప్రథమాంతములుగాను గానవచ్చును. ఏవిభక్తియం దున్నను అనాహితోచ్చారణముతోనే తదర్థజ్ఞానమును అయ్యర్థమువలనఁదోచు మహామాయాపరాశక్తియొక్క భిన్న భిన్నశక్తులను సమష్టివ్యష్టిత్వములనుట మఱువరాదు. ఉపాస్యయు సర్వస్వరూప సర్వేశ్వరి సర్వశక్తిసమన్విత కావున ఆనామధేయములందుఁ దోఁచు వివిధశక్తులను భావించుచు సాధకుఁడు భావుకుఁడు కావలయును. భావయుక్తి యున్నను శక్తిస్ఫూర్తియున్నను నొక్కటే. ఈశక్తులన్నియు నొక మహాశక్తినుండియే వెడలును, ఏశక్తి స్మరింపఁబడునో యారూపముతోనే సాధకునిలోనే వెలసి యుపకారము చేయును. ఏలన సర్వాత్మనియతశక్తి సంపుటమదే; శక్తికిని శక్తిమద్వస్తువు నకును భేదము లేదు. నీభావనమెట్టిదో తద్రూపముగానే యాశక్తి నీలోనే యుబికి యాభావానురూపఫలదానము చేయుచుండును.

స్తోత్రమందలి నామములు యోగదేవీమాహాత్మ్య మహాత్మ్యములను దెల్పునవి కొన్ని, దేవీస్వరూపమును దెల్పునవి కొన్ని, సహజదయాభిల్యాది లక్షణబోధకములుగాను నుండును. అంతే గాదు. అవి శక్తివైశిష్ట్యబోధకములు, ఆత్మజ్ఞాన ప్రధానశక్తి, శత్రుసంహారశక్తి, సాధనమార్గసంసూచకశక్తి ఇవి మొదలుగా నన్ని శక్తులో భావయుక్తస్మరణము చేసినపుడు తనలోనే యున్న యువీకి యుపకారము చేయుచుండును. ఆత్మార్పణము శరణాగతి ప్రణామము సమారాధకములే. ఉపాస్యముతోడి గురు మంత్ర మంత్రి మనఃప్రాణముల యేకత్వనిశ్చయజ్ఞానమువల్లనే సాధకుడు సర్వసిద్ధుల నొందఁగలఁడు. సర్వశక్తిమయవస్తు వది యొక్కటే కాని మఱియొకటి కాదు "నేను" అనుచు నిందుబోధించుచున్నది యోగదేవియే యనని భావము చేసికొన్నపుడు యోగదేవీ శక్తులన్నియు యోగివే యగును. యోగశబ్దమందే "నేను" అనంతమైన "నేను" లుగా నగుదునని కామించిన మా "నేను" నందు ఈబుచ్చి "నేను"ను జేర్చివేయుటే యోగము. వింటియందమ్ము దొడిఁగి లక్ష్యమును దూసికొనిపోవునట్లు చిమ్ముటే యోగము. దీనికే అభ్యాసమని పేరు. అభితః + అసమ్ (అసనమ్) అభ్యాసము - అభ్యసనము. ఈ యభ్యాస చాతురీచేతనే యప్రయత్నముగా వైరాగ్యము లభించును. "అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ సిధ్యతి" అని గీతా

గురుఁడు ఫల్గునకుఁ జెప్పిన మాటయందిదియే యభిప్రేతమని నా భావము.

కావున నో సాధకసోదరులారా! మీరు పూనునది స్తుతియనుఁడు, మంత్రజపమనుఁడు, కీర్తనమనుఁడు, సర్వశక్తిరూపులగు స్వామియైన దేవుని శక్తియే తోఁచి యది మీలోనే యుండి మిమ్ము ధన్యులను జేయవలయును. అప్పుడే జాగరిత స్వప్నభయము మొదలు పునరావృత్తిభయము వఱకునైన భయములన్నియుఁ దొలఁగి మీకుఁ త్రాణము కలుగును.

మఱియొక్కమాట— మీరేయు స్తుతియందలి నమఃపదమునకు నమస్కారము నర్థముతో సంతృప్తినొందక, మః+న = జీవుఁడను గాను. 'శి' = శివునకు అనుచోట సిద్ధసేవాసిత్యాది పదములను చతుర్థ్యంతములుగానే భావించి, ఆ వచతుర్థ్యంతములకు ఐకార్థ్యమునే భావించుచు ఆ పదములవలన నే యే శక్తులు స్ఫురించునో ఆశక్తులన్నియు నవరియో యామూర్తినే "నేను" యనెడి భావనిశ్చయముతోనే సాధకుఁడు తనయుట్ల నిలువవలయును. "ఓం నమశ్శివాయ" "ఓం నమో నారాయణాయ" మున్నగు మంత్రములను జపించునప్పుడు ఇట్టి ఐక్యభావముతోనే "నేను జీవుఁడను గాను, శివుఁడనే" యనెడి సాధనమే పరమమని పూర్వాచార్యులు నొక్కి చెప్పిరి. అప్పుడే యది "పరం మాతీతి పరమం" మోక్షమును గలిగించునది పరమము అను నర్థము నిచ్చును. ఇంత చాలును.

నా సాధనసామగ్రి నాలవమూటయందుఁ గానవచ్చు దేవకృత దుర్గాస్తుతులలో నివి రెండుమంత్రములు మాత్రమే సవ్యాఖ్యానములు ప్లేఛాపఁబడినవి. చిత్తగించునది. ఆ రెండును యోగదేవీతత్త్వమును సమగ్రముగాఁ దెల్పునవే.

ఇది

అష్టసకృత దుర్గాస్తుతి వ్యాఖ్య

సమాప్తము.

ప్రథమశ్లోక వ్యాఖ్య

ఓం సర్వస్వరూపే సర్వేశి సర్వశక్తిసమన్వితే।
భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోఽస్తు తే ఓం॥

ఓ దేవీ! నీవు సర్వస్వరూపవు; సర్వేశ్వరివి. సర్వశక్తులతోఁ గూడినదానవు మమ్ములను భయమువలన రక్షింపుము. దుర్గాదేవీ! నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య :- అమ్మా! దేవతలు నిన్ను స్తుతించునపుడు బ్రాహ్మి మున్నగు నెనిమిది శక్తులను, లజ్జ మున్నగు నీ విశేష రూపములను లక్షించి మఱిమఱి నీకుఁ బ్రణామములు చేసిరి.

దీనప్రాణములతో నీప్రసన్నతను ప్రార్థించిరి. అప్పుడు "సర్వస్వరూపే, సర్వేశే" యనుచు నీప్రసన్నతాలక్షణముం గొనియాడుచున్నారు నీవు ప్రసన్నవైతే నీమూఁడుస్వరూపములను జీవులకు బోధపడును. అప్పుడు వారు స్మరించి ప్రణమిల్లుచున్నారు.

అమ్మా! నీవు సర్వస్వరూపవు. మాకుఁ గానవచ్చునదంతయు, అనఁగా మేమెల్లప్పుడు ననుభవించునదంతయు, నీబహుత్వము (సర్వత్వము) అంతయు నీయొకటి స్వరూపము. ఇదే నీస్థూలదేహము. నీ యీ సర్వస్వరూపమూర్తిని యథార్థముగా, నీస్థూలదేహముగా గ్రహింపఁగల సంతానమునకే నీరెండవ స్వరూపమైన సర్వేశ్వరీమూర్తి దర్శనమగును. ఈ బహుత్వసృష్టిస్థితిప్రలయములను జేయు నీసర్వేశ్వరీమూర్తితో, నీవు వారికాత్మప్రకాశము చేయుదువు ఇదే నీసూక్ష్మశరీరము. ఈమూర్తియందే నీ సంతానము నీ యీశ్వరీమూర్తిని సాక్షాత్కరించుకొని జీవత్వక్షుద్రత్వ మోహమునుండి రక్షింపఁబడును (అవి తొలఁగు ననుట). అప్పుడు నీవు నీమూఁడవ మూర్తియైన సర్వశక్తిసమన్వితస్వరూపమును దెలియఁజేతుదువు. సర్వవిధములుగాను నేశక్తి ప్రకాశించుచున్నదో, సర్వముయొక్క సృష్టిస్థిత్యాదులు చేయుచు సర్వేశ్వరియై యేశక్తి వెలయుచున్నదో, అవన్నియు నెచ్చోట సమన్వయించునో, ఎచ్చోట శక్తియనుచు నట్టి విభాగమును లేకున్నను సర్వశక్తిసమన్వయస్థానమేదో, యదే నీమూఁడవ

స్వరూపము. సర్వరూపములతో దేని ప్రతీతి యగుచున్నదో, యది శక్తి తక్క నితరేమియుఁగాదు. అమ్మాట మేమింతకు మున్నే తెలియఁగల్గితిమి. ఈసర్వశక్తిసమన్వితస్వరూపమునే నీకారణమందురు. అదే బ్రహ్మము, పరమాత్మ, నిరంజనము మున్నగు పేర్లతో వ్యవహరింపఁబడును. ఈ నీ మూఁడుస్వరూపములును సత్యములే. శ్రుతిశిరోవాక్యములు ఈ నీ మూఁడు స్వరూపములకును సమముగానే కీర్తించినవి. భగవద్గీతయు క్షరాక్షరపురుషోత్తమ రూపములుగా నీ మూఁడు స్వరూపముల నుల్లేఖించినది (15–26–27). ఇట్లుండఁగా అధునికమాయా వాదులు, నీ నిర్గుణస్వరూపమును మాత్రమే సత్యమనుచు స్వీకరించి తక్కు రెండుస్వరూపములను మిథ్య యందురు. దాని చేతను హానిలేదు. అమ్మా! నీసత్యమైన నిరంజన స్వరూపమందు జగత్తనుట కేమియు లేదు; గాన జగదీశ్వరుఁడనుటకు నేమియు లేదు. ఉండఁబోలదు, ఆచార్యభాష్యకారులు, ఈ స్వరూపములు విశేషించి తెలుపుటకే ప్రాణపణమునఁ దక్కు రెండుస్వరూపముల యకించిత్కరత్వమును బ్రతిపాదించిరి. ఉండనీ.

అమ్మా! నీవు మాకు మాత్రము త్రివిధస్వరూపములతోను సత్యవు. తుల్యరూపమున "భయేభ్య స్త్రాహి నో దేవి" నీవు మమ్ము భయములవలన రక్షింపుము. మా యెల్లర భయములను తొలగింపుము. జననమరణాక్లిష్టులును, అల్పజ్ఞులును, నిరాశ్రయులునైన జీవుల భయము నెడలింప, నీవాక్కు తెచే

సమర్థవు. అమ్మా! నీవు దుర్గవు. దుర్గ+అ=దుర్గా; దుర్గపదమునకు– దైత్యుఁడు; మహావిఘ్నము, సంసారబంధము, కుత్సితకర్మము; శోకము, దుఃఖము, నరకము, యమదండము, జన్మము, మహాభయము, రోగము అని యర్థములు. తుది– అకారము — హంతృవాచకము; పైనిజెప్పిన యన్నింటిని పోఁగొట్టునది. గాన "దుర్గా" యైనది. యామల తంత్రమందు, దుర్గాశబ్దనిర్వచనము– "ద్ + ఉ + ర్ + గ్ + అ = దుర్గా." ద్ = దైత్యనాశకము; ఉ = విఘ్ననాశకము; ర్ = రోగనాశకము; గ్ = పాపనాశకము; అ = భయరిపునాశకము; అ = శక్తి వాచకముఁగాన; దేవివర్యా దుర్గాపదమును స్మరించినను, ఉచ్చరించినను. వినినను, పైనిజెప్పిన ఫలములు గలుగునని పరమేశ్వరుఁడు శివశక్తి నిగూర్చి యనిన మాట. మఱియు "దుఃఖేన గమ్యతే ఇతి దుర్గా" అతికష్టముచేఁ దెలియఁబడునది. అమ్మా! నీవు దుర్గవు. దుర్గతిహారిణివి. నా యీజీవత్వమనెడి దుర్గతిని తొలఁగింపుము. నీకు కోటిప్రణామములు.

ఓం దుర్గాయై దుర్గపారాయై సారాయై సర్వకారిణ్యై ।
ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః । ఓం ॥

దురధిగమ్యవును, ప్రాణకారిణివియు, సర్వశ్రేష్ఠవు, సర్వజననివియు, ఖ్యాతిరూపవును, కృష్ణవర్ణవును, ధూమ్రవర్ణవు నైన నీకు నమస్కారము.

అమ్మా! నీవు ముక్తియుత తత్త్వస్వరూపవు. కేవల జ్ఞాతృ జ్ఞేయబోధ ముండునంతవరకు నీయథార్థస్వరూపము తెలియఁబడదు. నీవు దుర్గపారవు – సంసారము నావలెగట్టు నీవే చేర్తువు. సర్వభావాతీతమైన నీపరమార్థస్వరూపము నాశ్రయింపనంత సేఁపు; దుర్గమ సంసారమునుండి యేవిధమైన పరిత్రాణమును లేదు. మఱియు నీసంసారక్షేత్రమందు సర్వభూతములలో వెలయు నీస్వరూపము చంచలతామయము; పరివర్తనశీలము. కావున నసారమైనను నీవు సారవు. అసంగా నిరాకారస్వరూపిణివి. ఇంత గొప్పదై విశ్వముతోఁ గూడిన చంచలజగత్తు ఏసత్తుపై కల్పింపఁబడియున్నదో, అది నీవే. కాన నీవు సారవు; నిత్యవు. సచ్చిదానందస్వరూపిణివి.

అమ్మా! నీవు సర్వకారిణివి. సృష్ట్యాదులైన సర్వభావములను నీవే వెలయించుచున్నావు; కాన సర్వకారిణివి; అన్నంతనే నీపరమేశ్వరీమూర్తి కథ తలంపునకు వచ్చును. చిచ్ఛక్తిస్వరూపిణివైన నీవే స్వరూపముచే నిర్గుణవు. కనుక నిన్నుఁ గొందఱు సర్వకారిణివి కాఁజాలవనియు, ప్రకృతియే సర్వకారిణియనియుఁ బలుకువారు; మాయను (ప్రకృతిని) నీతోఁ బాత్రిగా నెకపెట్టుచున్నారు. కార్యముచే నద్వైతసిద్ధాంతభంగ మగుచున్నది. మాయను సత్తాహీనయు, అనిర్వచనీయయు, అజ్ఞానరూపయు నని భావించి యద్వైతతత్త్వమును రక్షించుటకుఁ బ్రయత్నించినవో సర్వసందేహములు తొలఁగునా! వర్తమానజగత్తు యుక్తిని కోరును. యుక్తితర్కముల సాయముతో స్వీకరింప

లేనివారు; ఇట్టి విషయము వేదసమ్మతమైనను, ఆదరపూర్వకముగా గ్రహింపలేరు. కావున నీపరిచ్ఛిన్నయుక్తి ప్రమాణముతోనే తెలియఁ బ్రయత్నింతురు. నిన్నుఉంగుటయు నిన్నోందుటయు నీకృప లేక జరుగదు. ఇట్టి యాలోచన మెందులకుఁ జేయుదురో ! నీకృపనే యాశించినపుడు జిహ్వాజడత్వము బుద్ధిమాలిన్యము తొలఁగును గదా.

ఆత్మ యను వస్తువేదో యిప్పుడెఱుంగఁ జూతము. కేవలానందమే యాత్మ స్వరూపము. శ్రుతి- 'ఆనందం బ్రహ్మణో విద్వాన్; న బిభేతి కుతశ్చన' అనుచున్నది. ఆనందమే బ్రహ్మము స్వరూపము. ఆనందవస్తువు ననుభవమింతయో యంతయో జీవమాత్రునకుఁ గలదు. జగత్తున గమ్య విషయము పొందఁబడినేని క్షణకాల మొక యానందభావము హృదయమునం దుటుకును. ఒక్కసారి యీ భావమును బ్రయత్నింపుము. క్షణికానందాభాసము జన్యానందము; అనగా విషయేంద్రియ సంయోగమున నైన యొకవిధమైన చిత్తవికారము మాత్రమే. స్వరూపానందాభాసమే విషయానందము. ఏచట నట్టి విషయ సంస్పర్శమును లేదో, చింత లేదో, భావన లేదో, త్యాగము లేదో, గ్రహణము లేదో చూచుట, వినుట మున్నగు వ్యాపారములు లేవో, కేవల మానందమే కలదో, అట్టి వ్యవస్థయందు నీ వేస్వరూపమును జేరుదువో, యదే యాత్మస్వరూపమని యెఱుంగుము. ఇంక ముందునకు నడుపుము. ఆనంద మొకవిధమైన యనుభవము (బోధము). మన బోధము ఆనందస్వరూపముగాఁ

ప్రకాశించునప్పుడే, ఆనందవస్తువు ననుభవము చేయఁగల్గుదుము. అది కేవలానుభవానందస్వరూపము. ఆ కేవలానందస్వరూపమునం దెట్టి భేదమును లేదు, తెలియఁబడదు. అనఁగా దానికి సజాతీయమైన మఱియొక యానందదాయకవస్తువు లేదు, "ఆ యానందమునకు విజాతీయమైన దేదేనున్నదా? ఉందునా" యనెడి యిట్టి యుపలబ్ధియు లేదు, మఱి దానియందు స్వగతభేదమును లేదు. అనఁగా దానియం దెట్టి యంగాంగి భావముగాని; భోక్తృభోగ్యాది భావముగాని లేదు. కేవల విశుద్ధానందమే. దీనినే శ్రుతి– "ఏకమేవాద్వితీయమ్" అన్నది. ఈ యానందమునకు మఱియొక పేరు ప్రేమరసము. వేదమునందు "రసో వై సః" యను మాటచే నిర్దేశింపఁబడినది. ఇచట– ప్రేమ, ప్రేమిక, ప్రేమాధారమునం దెట్టి భేదమును లేదు, రసిక, రస, రసస్వరూపమైన భిన్నత లేదు. కేవల ప్రేమము. కేవల రసము. ఏ భాషతో దీనిని దెలియఁ జెప్పుట! అది భాషకు వెలిది. అందుకే వేదము "అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్" అన్నది. "నేతి నేతి" యన్నను మాటలతోను బోధించుట కెంతో ప్రయత్నించినది. ఇదే మన తల్లి. నిర్గుణస్వరూపమని యెఱుంగవలయును. ఇచటఁ గేవలానందముతక్క నెట్టి విశిష్టతయు, అనఁగా భావరంజనము లేదు. కనుకనే, అమ్మ నిత్యశుద్ధనిరంజన యైనది.

ఈ నిర్గుణ నిరంజన స్వరూపముపై నిగూఢ, అమ్మగారి రెండువిధములైన మహాత్త్వములు వెలయుచున్నవి. ఒకటి

ఈశ్వరత్వము, రెండవది జీవత్వము. ఇందుఁ దొలుత నీశ్వరత్వ మనెడి మాతృమహత్త్వమునుగూర్చి యోజింతము. ఉపనిషత్తు

"ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే।
యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి"॥

యనుచున్నది. ఆనందమువల్లనే భూతముల యుత్పత్తియు, వాని యునికియు నగుచుండగా, మఱి జీవుల ప్రలయస్థానము నై యున్నది. ఇచట, పరమానందము — కేవలానందము — అనఁగా సర్వభావవర్జిత నిర్గుణముగాఁ జెప్పఁబడినదో; జగత్తుయొక్క సృష్టిస్థితిప్రలయ హేతువైన యానందమని చెప్పఁబడినదో యీ రెండానందములు నొక్కటియా? వేర్వేరా యని సంశయము కలుగవచ్చును. దీని కుత్తరముగా— "నిత్య నిర్గుణానంద మను చున్నది కథనమాత్రమే. ఆనంద మెప్పుడును నిర్గుణము కాఁజాలదు. నిర్గుణమనఁగా నిర్విశేషగుణమని యర్థము. ఆనంద మొక గుణము (ధర్మవిశేషము). అది సూర్యకిరణములు సూర్యునికంటె భిన్నములును అభిన్నములును నైనట్లులే; మఱియొక యానందము హ్లాదినీశక్తి. ఈశక్తి యెవనిదో వాఁడే యీశ్వరుఁడు. అనఁగా హ్లాదినీశక్తిమంతుఁడు కనుకఁ గేవలానందకర్త యీశ్వరునిచే కాఁజాలదు." ఇత్యాది వాద ప్రతివాదము లెన్నో కలుగుచున్నవి. ఈ విభిన్నమతముల మీమాంస మిందుల సుగమ్యము. ఎవఁడెట్టులనునో వానిచే సత్యముగా నంగీకరించినచో నెట్టి గొడవయు నుండదు. ఏలన బ్రహ్మవస్తువు లేదని యెవ్వఁడునన లేఁడు. బ్రహ్మము పూర్ణము.

దానియొక్క సత్తా యభావకల్పనముం గాదు. కనుకనే దాని సంబంధమున నెవ్వరేమన్నను సత్యమే. బ్రహ్మ మెవరియొక్క నే భావములోఁ బ్రకటమగునో; వారికా సత్తే భాసమై తెలుపడును. ఎవ్వఁడేని బ్రహ్మమును లేదనునా! అదియు సత్యమే ఏలన- వానియందు బ్రహ్మము "నాస్తి" రూపముగానే ప్రతిభాసించినది. ఏదో యొకవిధముగా దానిని స్వీకరింపకుండ లేడు. ఇదే బ్రహ్మముయొక్క విశేషత. కేవల విధానము గానే యవశ్యము సమర్థమైనది కాదు. మఱియు- ప్రకాశము, అంధకారము, జ్ఞానము, అజ్ఞానము, విద్య, అవిద్య, సగుణము, నిర్గుణము, సుఖము, దుఃఖము మున్నగు పరస్పర విరుద్ధధర్మములకు నదియే యాధారము. విరుద్ధధర్మ సమూహము బ్రహ్మమందే యొకదానితో నొకటి కలసి యున్నది. ఇచట నింకొక విశేషమేమన- ఆ యత్యంత విరుద్ధధర్మములు బ్రహ్మమునని యాధారమందే సదా తోఁచుచున్నను దాని నిరంజన స్వరూపమున కించుకయు హాని గలుగదు. కేవలానందస్వరూపబ్రహ్మము, తన నిరంజనస్వరూపము నఖండముగానే యుంచి యొక్కసారిగా నీశ్వరజీవరూపములతో వెలయఁగలదు. ఇదే బ్రహ్మముయొక్క బ్రహ్మత్వము.

ఈ నిర్గుణానందస్వరూపవస్తు వేరూపమున నీశ్వరుఁడై (సర్వగుణసంపన్నుఁడై) యుండునో యనుటను, మనమెఱుఁగఁ బ్రయత్నింతము, సరే; ఆ నిర్గుణానందమును దనుభవించుట కేమే మున్నదా! చెప్పఁగలరా! చెప్పఁగలము. కాని యనుభవశక్తి

లేదు. ఎందుల కట్లగును? నిర్గుణవస్తువునం దేదే నట్టి శక్తిని స్వీకరించినచో, ఆనందమునకు స్వగతభేద మున్నట్లు లేదయ్యె, ద్వైతాపత్తి సంభవించును. కావది కాదు. ఆనందము తన్నుఁ దా నెప్పుడనుభవించునో యప్పుడు భోక్తృభోగ్యభోగాది రూపమైన భేదము దేనివల్లనుం దెలియఁబడదు. కనుకనే యీ విశుద్ధానందస్వరూపవస్తువునందు ఆ భోగ్యాదిభేదము లెవ్వియు లేవు. ఇది నిశ్చయము. ఇక్కడ మఱియొక మాట. ఏమైన సంశయమున్నచో, నిర్గుణ నిర్మలవిశుద్ధానందమైన వస్తువొకటి యున్నదనుఁడు. దానియం దెట్టి భేదమును లేదు. శంకరాచార్యులు నైతము ఈ నిర్గుణమగు జ్ఞానానందస్వరూపము చేయుటకు "అనిర్వచనీయ" యని యొక పదము వ్యవహరింపవలసి వచ్చినది. దానినే గౌరాంగప్రభువు "అచింత్యభేదాభేద"మనియెను. అప్పుడు దానిని మీరు గ్రహింపఁగలిగి శాస్త్రములు గురువులు చూపిన యుపాసనములచే దానిని పొందఁగోరినచో, వారికృపచే నొకనాఁ డావశ్యకముగా నానందవస్తువు నిర్గుణమని తెలియఁ గల్గుదురు.

అఖండజ్ఞానము, అసీమశక్తి యను రెండు నభిన్నవస్తువులని మును చెప్పఁబడినవి. జ్ఞానమే శక్తి; శక్తియే జ్ఞానము; అను నిమ్మాటను సరిగాఁ దెలియలేనివారును, అనుశీలనము చేసి అనుభవింపఁ జాలని వారును, ఈ మహాసంకటతత్త్వమును సరిగా గ్రహింపఁ జాలరు.

సరే; మున్ను విశుద్ధజ్ఞాననామముచేఁ దోఁచినదేదో యది, కేవలజ్ఞానమే కాదు. దాని యానందస్వరూపమును నైతము దెలియఁ బ్రయత్నించితిమి. చిద్వస్తువు కేవలచిత్తు కాదు. ఆనందము నైతము దానిస్వరూపమే యానందమనఁగానే, యానందానుభవమును దాని సత్తయుఁ బ్రతీతిగోచరము లగు చుండును. ఈ యనుభవము పేరే చిత్. సత్తయే చిత్. కావున నానందసిద్ధము సిద్ధిమువలన సచ్చిదానందము లనెడి మూఁడును దెలియఁబడును. ఈ మూఁడు వస్తువులును వాస్తవముగా మూఁడు కావు. ఒక్కటే సత్తు, చైతన్యము, ఆనందము అను నవి యొక్కవస్తువునకేయైన మూఁడు పేళ్ళు. ఈ యానందము విశుద్ధమైయున్నప్పుడును దానియందు "చిత్" అనుభవశక్తి "సత్తు" అనునవి కలవు. అనుభవశక్తి (చైతన్యము) యొక్క యభివ్యక్తి లేనప్పుడు, ఆనందప్రతీతి యుండదు. ఆ యనుభవ శక్తి విశేషభావముతో వెలయునప్పుడు దాని యుభయాంశల "కర్త, కర్మము" అనెడి రెండు భావములును విశేషించి తెలియఁబడును. అనఁగా అనుభవించువాఁడు, అనుభవింపఁ బడునది, అనుభవము అను నిమ్మూఁడును దోఁచునే తెలియఁ బడును. అనఁగా ఆనందవస్తువునం దీమూఁడు భావములును వెలయుచున్నను స్వరూపముచే నించుకంతయు భేదములేదు. ఒక్క యానందవస్తువే నన్నుఁ దా ననుభవించుచున్నది, అనఁగా ఆనందము నచట విశేషించి యనుభవించునో, ఆ యద్వితీయ వస్తువునందు స్వగతభేదము కానవచ్చును. ఇవే సత్త్వరజస్తమోగుణము లనెడి పేళ్ళతోఁ బ్రసిద్ధములు.

సచ్చిదానందముల ప్రథమ స్పందనముచే "సత్" సత్త్వగుణము; అనఁగా ఆనందముయొక్క భోక్తృభావమును; రెండవ స్పందనముచే "చిత్" (రజోగుణము) అనఁగా నానందము యొక్క యనుభవశక్తియు, మూఁడవ స్పందనముచే ఆనందము (తమోగుణము) అనుభావ్యమైన యానందమనెడి భోగ్యభావమును బ్రకాశించును. ఇట్టి విశిష్టతలున్నను, విశుద్ధానంద స్వరూపము విశుద్ధముగానే యుండుననుట మఱువరాదు.

దాని పేరు "నేను, లేదా ఆత్మ" యనును. పంచదశీకర్త "ఇయమాత్మా పరానందః పరప్రేమాస్పదం యతః" ఈ జ్ఞానస్వరూపాత్మ పరమప్రేమాస్థానము; కనుకనే యానంద స్వరూపము. ఎల్లరుం బరమప్రేమాస్పదమైన దానినే కోరుదురు, మివ్వులఁ బ్రేమింతురు. దీనియందలి ప్రీతిసాధన కొఱకే యీజీవత్వబంధన మనాదికాలమునుండియు సాగుచున్నదో, దీని రక్షకై సమగ్రపృథివీ త్యాగము చేయుదురో (ఆత్మార్థం పృథివీం త్యజేత్) అట్టి యాత్మ యెంత ఘనానందస్వరూపము! అది మాటలతోఁ దెలియునట్లు?

మును చెప్పినట్టులు, ఆత్మ విశిష్టభావముతోఁ దన్నుఁదా ననుభవించునప్పుడే యది సగుణనామముఁ బరఁగును. దీనిని దార్శనికులు— వికారమని, పరిణామమని, వివర్తమని, భ్రాంతియని, కల్పనమని, యధ్యారోపమని, ఏమో పేరేని బెట్టినీ; హాని లేదు.

ఇది వినుఁడు. సగుణ నిర్గుణములు రెండును సత్యములే; నిర్గుణవస్తువొక్కటే యీవిధముగా సగుణమగును. అసలు మాట యేమనఁగా- వేయిసారు లది సగుణత్వము నొందినను, కాని నిర్గుణత్వము బిందుమాత్రమైనను వికారము నొందదు; అది యఖండముగా యథాపూర్వముగానే యుండును. ప్రకృతియే సంసారము. వస్త్రము అను పేర్లతోను, ఆకారము లతోను, బహిరంగము నందినను, దాని స్వరూపము సంబంధము కంతయు నంతరముండదు. బంగారు; కంకణకుండలాది నామము లతో వివిధాకారములతో నాకారితమైనను దాని సువర్ణత్వ మఖండముగానే యుండును. నీరు; సముద్రము, నది, సరస్సు మంచుగడ్డ మున్నగు భిన్ననామములతో భిన్నరూపములతో నాకారితమైనను, దాని జలత్వమున కన్యథాత్వము లేదు. సర్పము, కుండలరూపిణియై యీ పేరఁ బరఁగినను సర్పము సర్పమే కాని కుండలము కాదు. ముత్తెపుఁజిప్ప రజతాకారమునఁ బ్రతీయమానమైనను, అది ముత్తెపుఁజిప్పయే; కాని వెండి కాదు. ఆకాశము ఘటమఠాది విశేషణములతోఁ గూడినను అది మహాకాశవిశేషముగానే యుండును.

ఇప్పుడు చూడుఁడు. అనంతవస్తువు దన్నుఁ దా విశేష రూపముతో సమర్థించునప్పుడే యది సగుణము. వేదాన్తులు దీనిని మాయయొక్క యధ్యాసమందురు. సాంఖ్యులు ప్రకృతి సంబంధమందురు. కాని యుపనిషత్తులీ సగుణస్వరూపమును 'ఆత్మ, బ్రహ్మ' శబ్దములతో నిర్దేశించినవి. మతి యీ సగుణ

సంభవమందు బహుత్వానుభవము తెలియఁబడును. ఎందుచేత? ఎట్లు? అని ప్రశ్నింపవలదు. అది యాత్మలీలగాను; ఇచ్ఛగాను దలంపవలసినదే. "నేను ఆనందస్వరూపుఁడను, ఒక్కరూపముతో ననుభవించి పొందు నానందమును, బహుధా విభజించి భోగింతును" అనెడి యిచ్ఛ నాకయినపుడు, నా పేరు ఈశ్వరుఁడు. 'ఏకోఽహమ్ బహుస్యామ్" అను నిబోధము (అనుభవము) చేరే ఈశ్వరుఁడు. కేవలానందస్వరూపాత్మయందనేక భావముల యుత్పత్తిస్థితి లయములగునపుడే, ఆ యాత్మ ఈశ్వరుఁడు. అపుడు బ్రహ్మ మానందరహితమనఁ గలదా? లేదు. బ్రహ్మవస్తువు స్వరూపము చేతనే యానందము. దాని యానందమునకు లేమి యున్నది, ఏకాలమందును లేనే లేదు. అపుడు దాని యేకత్వము (అద్వితీయత్వము) సత్యత్వము స్వాభావికమైనట్లే దాని బహుత్వము కూడ (ఈశ్వరత్వము) జగద్దర్శన కాలమందును సత్యమును స్వాభావికమునై యున్నది. జగదదృష్టావస్థయందు బ్రహ్మము నిర్గుణమైనట్లే జగద్దర్శన కాలమందది సగుణము. అది గుణాతీతము, గుణమయము. ఈ రెండు భావములును నేకాధారమం దొక్కసారి తోఁచునుగాని యొకదానివలన నొకదానికి హానిపరివర్తనము లెంతయుఁ గలుగవు. సరే మును చెప్పినట్లు పరమప్రేమాస్పదమును; ఆనందమయమును నైన యాత్మ, తన్నుఁ దా బహుధా విభజించుకొని భోగించునపుడే "ఈశ్వరుఁడు". ఇది మఱువకుండునపుడే ఆత్మయొక్క ఈశ్వరత్వమనెడి మహత్త్వమేమో తెలియఁబడును.

ఆత్మయొక్క మఱియొక మహాత్త్వము జీవత్వము. "తత్త్వమసి" మున్నగు మహావాక్యములు "సర్వం ఖల్విదం బ్రహ్మ" "ఆత్మైవేదం సర్వమ్" "స ఏవ సర్వమ్" "పురుష ఏవేదం సర్వం" "యదిదం కించ తత్సర్వమ్" మున్నగు శ్రుతి వాక్యములవలన జీవుఁడు బ్రహ్మముతోఁ గేవల మభిన్నమైన వస్తువే యని ప్రతిపాదింపఁ బడినది. జీవుఁ డెవఁడు ? ఈశ్వరా నందము. అనఁగా బహుత్వాప్రకాశమానమగు సమష్ట్యానందము యొక్క వ్యష్టిరూపము. ఆ "బహు" అనువానియందలి ప్రత్యేకమే జీవుఁడు. కావుననే జీవుఁడును స్వరూపముచే నానందమే. ఇదివఱకు మను జెప్పిన ప్రత్తి, నీరు, బంగారు దృష్టాంతములను స్మరించుకొనునది సముద్రమందలి జలతరంగములు జలము తక్క మఱేమియుం గావు, దారముచేనైన వస్త్రము ప్రత్తి తక్క మఱేమియుం గాదు. ఇటులే జీవుఁడు విభిన్నాముఁడైనను స్వరూపముచే నానందము తక్క మఱేమియుం గాదు. ఈవిధముగా జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జము లనెడి నాలుగు విధములైన భూతగ్రామము (ప్రాణిబృందము) ఈశ్వ రానందమునందె పుట్టి; ఈశ్వరానందమందె యుండి ఈశ్వ రానందమందె యవసానము నొందుచున్నది. కావున జీవుని స్వరూప మానందమే. ఇపుడాలోచించి చూడు. ఆత్మ (అమ్మ) కేవలానందమయియు, సర్వకారిణియు, నీశ్వరానందమయియు నైనది.

సాధకుఁడా! ఈ రూపములందు లక్ష్యముంచి మెల్ల మెల్లగా వెనుకకు తిరిగిచూడు. చండీ ప్రథమభాగమందు చేసిన కేవల సద్రూపముగా నెఱింగితివో, ద్వితీయఖండమందు చేసిన చిద్రూపము (ప్రాణరూపము) గా నెఱింగితివో, యదే యిపుడు పరమప్రేమాస్పద పరమానందస్వరూపాత్మ యైనది. ఆ యానందమునుండియే నీవును వచ్చితివి. నీ ప్రత్యేకసంకేత మానందమయము. చూడు. నీ శరీరమందలి ప్రత్యేకపరమాణువును ఆనందము తప్ప మఱియొకటి కాదు. ఆనందమే నీకుపాదానము. ఆనందమే నీ స్వరూపము. ఆనందమందే నీవున్నావు. నీ రోగశోకాదు లానందమయములు. నీ దుఃఖదారిద్ర్యము లానందమయములు. నీలోపగు ప్రత్యేకచింతయు నానందమయము. నీ ఇష్టానిష్టవస్తువు లానందమయములు. నీ యెదురనున్న చెట్టు సైత మానందమువల్లనే ఘటితమైనది. ఒక ఘనానందశక్తియే వృక్షాకారమున వెలయుచున్నది. జడమైన కాష్ఠముక్క కాదు. ఈ యానందమయాత్మయే యాకారమున వెలయుచున్నది. నీకంటె వేఱుగా నీకుఁదోచు భార్యాపుత్త్రులు, స్వజనము, ఆ బహుత్వవిషయ మానంద సత్తవే. నీయానందోల్లాసమే మూర్తిమంతమయి ప్రతిభాసించుచున్నది. ఏ వైపున నీవు చూచినను, ఏ యింద్రియమువలనను గ్రహించినను, అవి యన్నియు నానందమయమే; క్షిత్యాది పంచభూతములు, శబ్దాది పంచవిషయములు, చంద్ర సూర్యాది జ్యోతిర్మండలము నీ పరమప్రేమాస్పద పరమానందమయాత్మకంటె

వేఱేమియుం గాదు. ఈ యానందమయాత్మస్వరూపము నాస్వా
దింపనిచో, నీ జీవనము వ్యర్థమే. నీ వానందసముద్రమునందే
మునిఁగియున్నావు; మునుఁగుచున్నావు కేవలము నానంద
సేవయే చేయుచున్నావు అయినను ఆనంద మెచట నున్నది!
యనుచు గ్రుడ్డివానివలె వెదకుచున్నావు ఒక్కసారి అన్త
ర్వైపు చూడుము. నీకానందాభావ మెన్నఁడును లేదు. ఉండదు;
అని తెలియును. నిత్యానందుఁడు నిన్ను నీ వానందమయునిగాఁ
దలంతువో. యా క్షణమందే నీయెదుట, నీ సంసారమానంద
మయమై వెలయును. అది మొదలు విశిష్టభావములతో నగు
జగద్భోగవాసనలు, పూర్తిగా నుడిఁగిపోవును.

చక్కఁగా వినుము. ఆనందమే నీస్వరూపము ఇది యథార్థ
ముగాఁ దెలియునప్పుడు, కామ్యవస్తుసంగ్రహము చేసియు,
భోగించియు, నానందసంపాదనము జేయఁగలవా! ఎన్నఁడును
జేయలేవు. అప్పుడు సహజముగానే నీయందు వైరాగ్యముద
యించును. "నేనానందమయుఁడను" సర్వత్ర నిరాకార
ముగాఁ బ్రతిభాసించుచున్నాను; అనెడి సత్యము నెఱుఁగఁ గల్గి
నచోఁ బట్టువిడుపులు, పలుకుసీతలును, మఱి యుండవు. నిర్వి
చారనిమగ్నానందమును విహరించుశక్తి కలుగును.

"రాగద్వేష వియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి" ॥ —గీత

ఉపసించు. పరమానందతత్త్వము నాలోచనము
చేయుచుఁ గడు దూరము వచ్చితిమి. మఱల మనము దేవతల

స్వరముతో స్వరము చేర్చి "సారాయై సర్వకారిణ్యై నమః" అనుచు నానందమయి చరణములందు ప్రణామము. ఆర్ద్ర – ఆనందమయి – అమృత – సార – నిర్గుణచైతన్యమయి యగు యీ సర్వకారిణీరూపముతో, నీశ్వరమూర్తితోఁ బ్రకటిత మైనది; అగుచున్నది.

"ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః"

ఖ్యాతిశబ్దమునకు యోగప్రసిద్ధాదులను మీఱిన యర్థము మఱియొకటి కలదు. అదే వివేకఖ్యాతి ప్రకృతిపురుషుల పృథక్త్వము (వేఱుపాటును) గూర్చిన సుస్పష్టప్రతీతి. దానిని వివేకఖ్యాతి యని సాంఖ్యులందురు. ఆ పాతదృష్టిచే (పైపైచూపులతో) సాంఖ్యకారులు ప్రకృతిని జడనామముతో నుల్లేఖించిరి. వాస్తవముగాఁ బ్రకృతి జడము కాదు. చైతన్యము యొక్క జడత్వప్రతీతిమాత్రమే. జడత్వము సైత మొకవిధమైన బోధమే. బోధవస్తువు చేతనమే కాని జడము కాదు. కేవల చేతనమే కాదు. ఆనందమే దాని స్వరూపము. నిర్గుణానందవస్తువే రూపమున సగుణభావము నొందినది; అనఁగా సత్త్వరజస్తమోగుణమై ప్రకాశించినది. ఈ విషయమును చక్కఁగా ననుభవించుట పేరే ప్రకృతిపురుషతత్త్వ వివేకము. లేదా వివేకఖ్యాతి.

అమ్మా! ఈ ఖ్యాతిరూపముతో నీవే నిన్ను వెలయించుకొనుచున్నావు. ఆనందమయపురుషుఁడవైన నీవే నిన్ను విశేష భావముతో ననుభవించునపుడు నీవు "ప్రకృతి" యను

పేరయ్యెను. ఈ ప్రకృతిపురుషతత్త్వముల యథార్థానుభవ రూపములతోనే నీవున్నావు. ఈ యనుభవము (ఉపలబ్ధి) పేరే వివేకఖ్యాతి. త్రిరూపిణివైన నీకుఁ బ్రణతి.

ఈ ఖ్యాతికి విపరీతమైన యజ్ఞానమయమూర్తితోఁ గూడ నీవే యున్నావు. వికాసముగాను; బోధవికాసము లేక, లక్ష్యసాధనములు చేసినను, అనుభవవికాసము కాకయున్నప్పుడే "అజ్ఞానమయ కృష్ణమూర్తినై విరాజిల్లుదు" వందురు. ఆ యజ్ఞానమయమైన నీ కృష్ణమూర్తికిని మా ప్రణామములు.

మఱి, యీరెండిటికి మధ్యవర్తినై (ఖ్యాతి కృష్ణల నడుమ) నీ మఱియొక మూర్తి యున్నది. దాని పేరు ధూమ్రము. ఈ ధూమ్రమూర్తివలన జ్ఞానముయొక్క అవ్యక్తకాలముతోఁ గూడి యజ్ఞానరూపప్రకాశ మగును.

అమ్మా! నీ సంతానమందుఁ గొందఱు వేదాది ప్రతిపాద్యమైన నీ స్వరూపమును వ్యాఖ్యానింప దక్షులు, సగుణ నిర్గుణాది తత్త్వవిశ్లేషణ సమర్థులు, మోక్షశాస్త్రమందును అన్వయవ్యాఖ్యానములందును పటువులు నయ్యు. నీ యీ యానందమయ స్వరూపానుభవము లేకయే పోవుచున్నారు. అప్పుడే, అమ్మా! ఈ ధూమ్రమూర్తితో (జ్ఞానవికాసము నవ్యక్తగల మూర్తితో) వారి నాడి నుంచుకొన్నావని తలంతుము. అట్టి నీ యపూర్వ ధూమ్రమూర్తికి మా మ్రొక్కులు.

మఱియొక వంక, అమ్మా! నీవు సదా ఖ్యాతికృష్ణా ధూమ్రామూర్తులతో సర్వజీవుల నాడి నుంచుకొనుచుననియు

మాకుఁ దెలిసినది. మేము విషయగ్రహణము చేయుచున్నప్పుడే నీ యీ మూర్తుల విశిష్టత ప్రకటమగునని మేము తెలిసికొనుచున్నాము. "మేమిది తెలిసికొనుచున్నా" మనునదే విషయగ్రహణస్వరూపము; సర్వత్ర మేమీ మాయందు మూర్తుల స్వరూపము సిద్ధరూపముగాఁ బ్రకాశించుట కనుగొనుచున్నాము. దానికి మా ప్రణామము.

అధికారిసాధకులకు నా నివేదించునది యేమనఁగా ఈ మన యజ్ఞసత్కృత దుర్గాస్తుతియందుఁ గానవచ్చు యోగదేవి యొక్క దుర్గాత్వమును, సర్వశక్తిసమన్వితత్వమును, భయత్రాణదీక్షాలక్షణమును వివరించుటకే కాక, యందలి శ్వేతా, కృష్ణా ధూమ్రాక్షీనామములు దేవకృత దుర్గాస్వరూపమున మార్కండేయ పురాణాంతర్గత దేవీమాహాత్మ్యము (చండీపాఠమున) ఖ్యాతి కృష్ణా ధూమ్రా నామములతో నెట్లు సమన్వయించుకొనఁ గలిగితిమో తెలియఁజెప్పుటకే యందలి (చండీపాఠమందలి) ఈ రెండుశ్లోకముల వివరణము (నా సాధనసామగ్రి నుండి) యుల్లేఖింపఁ బడినది.

వ్యాఖ్యాతః

శ్రీ శ్రియానందనాథుఁడు

ఈశ్వర సత్యనారాయణశర్మ

శ్రీ కాకుళము.

64,703

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
1	1	స్వరూవ	స్వరూపే
1	7	స్వరూపమున	స్వరూపమును
5	7	ధర్మవద	ధర్మపద
8	13	గొప్పదనము	గొప్పతనము
8	19	వరము	పరము
9	16	స్వాత్త్వికులు	సాత్త్వికులు
9	19	స్వాత్మేష్ఠ	స్వాత్మేష్ట
23	14	అధికారులంలో	అధికారులలో
24	13	నీతో నుండియే -	నీలో నుండియే
32	17	నీను	నీవు
35	22	కావువనే	కావుననే
36	4	తామాత్మ	తామాగ్మ
38	7	సుషుప్త	సుషుప్తి
44	11	కామ్యకర్మ	ఆగామికర్మ
44	20	కాంగా	కాంతా
44	20	కరుతా	కనుగా
47	10	లక్షణానై	లక్షణావై
50	1	పింధెము	పించెము
50	8	శిఖ	శిఖ
51	18	నస్మిత	వస్మితా
55	3	పెద్దల	పెద్ద

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
66	11	భావముతో	భావములతో
79	9	దీనిచే	దేనిచే
81	19	మాయ	మాయా
87	20	హ్రీంకారమునకును	హ్రీంకారము
92	3	నాయికనై	నాయికయై
106	18	దర్ధర్ష	దుర్ధర్ష
107	17	మహాత్వ	మహాత్త్వ
108	17	[illegible]	[illegible]
109	3	[illegible]	[illegible]
114	19	శ్రుతి	స్మృతి
125	3	దర్గ	దుర్గ

